www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 23-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 159 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి మ. 1.51 తదుపరి సప్తమి; నక్షత్రం రోహిణి రా. 10.07 తదుపరి మృగశిర; వర్జ్యం: మ. 2.25-3.57, తె. 3.39-5.15; దుర్ముహూర్తం: మ.12.31-1.19, మ. 2.55-3.42; అమృతఘడియలు: రా.7.02-8.34; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.06 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత చదరంగం.. స్వర్ణ సంబరం



చెస్ ఒలింపియాడ్ విజేత భారత్

పురుషులు, మహిళల జట్లకు తొలిసారి స్వర్ణాలు

10

బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో భారత క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి చరిత్ర సృష్టించారు. అటు అబ్బాయిల, ఇటు అమ్మాయిల విభాగాల్లోనూ సత్తా చాటారు. భారత చదరంగం చరిత్రలో తొలిసారి 2 స్వర్ణాలు సాధించారు.



ల‌డ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు

ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో బృందం: సీఎం



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను సీఎం చంద్రబాబుకు అందిస్తున్న ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

- వైసీపీ రాగానే ఇష్టానుసారం సభ్యుల నియామకం
- టీటీడీలో 50 మందిని నియమిస్తే కోర్టుకెళ్లాల్సి వచ్చింది
- కనిపించినవారందరినీ ఎక్స్-అఫిషియో చేశారు
- అడ్డగోలుగా దర్శనం టికెట్లు అమ్మారు
- దీనికి నిరసనగా నేను, పవన్ నాడు ధర్నా చేశాం
- రివర్స్ టెండరింగ్‌తో నిబంధనలు మార్చారు
- అనుభవం లేనివారికి నెయ్యి సరఫరా అప్పగించారు
- వారు నాణ్యత లేని సరుకు పంపారు
- అందరి మనోభావాలూ దెబ్బతిన్నాయి
- అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారు: సీఎం

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీపై ఐజీ, అంతకంటే పైస్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తిరుమలలో జరిగింది అపచారమని స్పష్టం చేశారు. 'మనోభావాలు దెబ్బతిన్న హిందువులకు, ఇతర మతస్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. తెలిసి చేసినా, తెలియక చేసినా

మిగతా 11వ పేజీలో...

కల్తీ నెయ్యి దోషాన్ని తొలగించాం

- గత నెలలోనే సంప్రోక్షణతో శుద్ధి
- నేడు ఆలయంలో శాంతి హోమం
- అలాగే పంచగవ్య ప్రోక్షణ చేస్తాం
- భక్తులెవరూ ఆందోళన చెందొద్దు
- స్వచ్ఛమైన నెయ్యి వాడుతున్నాం: ఈవో

పెరిగిన లడ్డూ విక్రయాలు

11 3 రోజుల్లోనే 10,45,221 పొందిన భక్తులు

నాణ్యత, రుచిలోనూ మార్పు.. భక్తుల హర్షం



చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?

జగన్‌కు పవన్ సూటి ప్రశ్న

లడ్డూ నెయ్యి కల్తీని ఆయన ఎలా సమర్థిస్తారు?

- జంతువుల కొవ్వు కలపడం దుర్మార్గం.. అయోధ్యకూ అవే లడ్లు పంపారు
- చర్చి, మసీదులో చేసుంటే దేశం అల్లకల్లోలం
- హిందువులకు జరిగితే మాట్లాడకూడదా?
- ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం
- వైసీపీ హయాంలో టీటీడీలో అవకతవకలు
- గత ఐదేళ్లలో 219 ఆలయాలు అపవిత్రం
- వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి
- నెయ్యి కల్తీకి గత టీటీడీ బోర్డుదే బాధ్యత
- సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపై విచారణ జరగాలి

దోషులను కఠినంగా శిక్షిస్తాం: పవన్

ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం

పెదకాకాని, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. లడ్డూకు వినియోగించిన నెయ్యిలో పశువుల కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె, సోయా, సన్ ఫ్లవర్ లాంటి ఇతర నూనెలు ఉన్నట్లు ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. వైసీపీ హయాంలో ఇలాంటి నేతిని వినియోగించిన లక్ష లడ్డూలను అయోధ్య రామ జన్మభూమి మందిరానికి టీటీడీ పంపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం

మిగతా 11వ పేజీలో...

హెచ్చరించినా మారలేదు

- ఏఆర్ డెయిరీ కల్తీ నెయ్యే పంపింది
- టీటీడీ ల్యాబ్‌లో కల్తీని నిర్ధారించే పరికరాల్లేవు
- ఇది సరఫరాదారులకు లాభించింది
- నాణ్యత లేని సరుకు పంపుతున్నారు
- వాసన, రుచి లేకపోవడంతో పరీక్షల కోసం ఎన్‌డీడీబీకి గోప్యంగా పంపాం
- జంతువుల కొవ్వు కలిపినట్లు తేలింది
- ముఖ్యమంత్రికి టీటీడీ ఈవో నివేదిక!

11

లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై

నెలపాటు విస్తృత చర్చలు

- కొత్త ప్రభుత్వం వస్తూనే సకల జాగ్రత్తలు
- కార్మికులు, ప్రొక్యూర్‌మెంట్ కమిటీతో ఈవో శ్యామలరావు వరుస భేటీలు
- విశ్రాంత ఉద్యోగులు, డెయిరీ నిపుణులు, నెయ్యి సరఫరాదారులతో సమావేశం
- కల్తీ తేలగానే బ్లాక్‌లిస్టులోకి 'ఏఆర్'
- గత ప్రభుత్వంలో ఆపేసిన నందిని నెయ్యి కొనుగోలుకు మళ్లీ శ్రీకారం

జగన్ కోటను తాకిన నిరసన సెగ



జగన్ ఇంటి గేటు ముందు ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

లడ్డూలో కల్తీపై ప్రజాగ్రహం.. మెరుపు వేగంతో తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడించిన హిందూ సంఘాలు.. గోవింద నామస్మరణతో నిరసన

జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్.. దిష్టిబొమ్మ దహనం 12

టీటీడీ బోర్డులో బీజేపీవాళ్లే ఎక్కువ!

వారంతా కేంద్ర మంత్రులు సిఫారసు చేసినవారే.. ప్రధానికి లేఖలో జగన్ వ్యాఖ్యలు

- నెయ్యి, సరుకుల కొనుగోళ్లపై టీటీడీ సభ్యులకు పూర్తి అవగాహన
- తిరస్కరించిన నెయ్యిని లడ్డూలో వాడలేదు
- బాధ్యత లేకుండా చంద్రబాబు వ్యాఖ్యలు
- దీంతో లడ్డూ పవిత్రతపై సందేహాలు
- దేశం యావత్తూ మిమ్మల్నే చూస్తోంది
- భక్తుల్లో విశ్వాసం పునరుద్ధరించండి
- 8 పేజీల లేఖలో మాజీ సీఎం వినతి



అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యత లేకుండా చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఏం చేస్తారోనని దేశమంతా ఆయనవైపే చూస్తోందని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ)

మిగతా 12వ పేజీలో...

బెదిరింపా.. బ్లాక్‌మెయిలా?

- ప్రధానికి జగన్ లేఖపై సర్వత్రా విస్మయం
- సీబీఐ లేదా న్యాయ విచారణ కోరలేదేం?
- పైగా మెజారిటీ టీటీడీ సభ్యులు బీజేపీవారేనని చెప్పడంలో మతలబేంటి?
- చంద్రబాబుపై దుష్ప్రచారమే లక్ష్యం
- ఈ వైఖరితో పార్టీకే చేటు.. నేతల్లో ఆందోళన



ఆ ఒక్కటీ అడక్కు!

విజిలెన్స్ ప్రశ్నలతో వైవీ ఉక్కిరి బిక్కిరి.. సమాధానాలు చెప్పలేక భిన్నవాదనలు

- టీటీడీ వ్యవహారంలో విజిలెన్స్ విచారణకు చట్టబద్ధత లేదంటూ కొత్త పల్లవి
- విజిలెన్స్, మీడియాను నియంత్రించాలట
- సుబ్బారెడ్డికి నాలుగుసార్లు నోటీసులు
- గుండెలు బాదుకుంటున్న మాజీ చైర్మన్

తనకు కీలక సమాచారం ఇవ్వాలంటూనే ఆ సంస్థకు ప్రశ్నించే అర్హతే లేదని వాదన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్, వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి గత తప్పిదాలను సమర్థించుకోలేక బెంబేలెత్తిపోతున్నారు. టీటీడీ చైర్మన్‌గా ఆయన పనిచేసిన కాలంలో చేపట్టిన సివిల్ వర్క్‌లు, కొనుగోళ్ల టెండర్లు, ప్రత్యేకించి నెయ్యి కొనుగోలు వ్యవహారంలో పీకల్లోతు ఇరుక్కుపోయిన ఆయనకు భవిష్యత్ దర్శనం కనిపిస్తోంది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లేవనెత్తిన ప్రశ్నలకు

మిగతా 12వ పేజీలో...



2

శ్రీలంక నూతన అధ్యక్షుడు దిసనాయకే

దేశ చరిత్రలో తొలి మార్క్సిస్ట్ నేతగా రికార్డు

సైనికుల రైలు వెళ్లే పట్టాలపై

డిటోనేటర్లు!

- మధ్యప్రదేశ్‌లో ఘటన
- యూపీలో రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్
- దర్యాప్తు జరుపుతున్న రైల్వే, ఎన్ఐఏ

2



అమెరికాలో క్వాడ్ సదస్సులో దేశాధినేతలు ఆంటోని అల్బనెస్, మోదీ, జో బైడెన్, ఫుమియో కిషిదా

నిలబడతాం.. బలపడతాం

- మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు
- అన్ని దేశాల సార్వభౌమత్వాన్నీ గౌరవిస్తాం
- శాంతియుతంగా సమస్యల పరిష్కారం
- భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు
- క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ
- ఇకపై సముద్రంలోనూ క్వాడ్.. కొత్తగా 'మైత్రి'
- వచ్చే ఏడాది భారత్‌లోనే 'మైత్రి' శిక్షణ
- ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్‌కు పైలట్ ప్రాజెక్టు
- 'విల్మింగ్టన్ డిక్లరేషన్'లో పాక్‌పై నిప్పులు
- వచ్చే ఏడాది క్వాడ్‌కు భారత్ ఆతిథ్యం
- మోదీపై జో బైడెన్ పొగడ్తల వర్షం

వాషింగ్టన్, సెప్టెంబరు 22: "క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్నీ గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే.! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్ల

మిగతా 2వ పేజీలో...

చైనా మాకు పరీక్ష పెడుతోంది

సదస్సులో సహచర దేశాధినేతలతో బైడెన్

మైక్ ఆన్‌లో ఉన్న విషయం తెలియక మాట్లాడిన ప్రెసిడెంట్



స్పెషల్ సీఎస్ ఓకే చేసినా మాకేంటి?

- లెక్క చేయని సెక్షన్ అధికారులు
- సకాలంలో జీవోలు పంపని వైనం
- సంతకం చేశాక 20 రోజులు పెండింగ్
- రెవెన్యూ శాఖలో కాసుల కక్కుర్తి
- అడ్డంగా దొరికిన విజిలెన్స్ విభాగం-2
- నలుగురు అధికారులకు షోకాజ్

సస్పెన్షన్ కేసుల్లో విన్యాసాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'మీపై సస్పెన్షన్ ఎత్తివేస్తే నాకేంటి? ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు ఉపసంహరించుకుంటే నాకు వచ్చేదేమిటి? ముందు నా సంగతేమిటో తేల్చండి? అదయ్యాకే మీకు ఉత్తర్వులు వస్తాయి' కాసుల కక్కుర్తికి అలవాటుపడిన కొందరు అధికారుల వ్యవహారశైలి ఇది. వివిధ కారణాలపై ప్రభుత్వం చేతిలో క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొన్న ఉద్యోగులు మరో ఉద్యోగి చేతిలో బాధితులుగా మారుతున్న వైనమిది. ఇది ఇప్పుడు పరాకాష్టకు చేరుతోంది. స్పెషల్ సీఎస్ సంతకం చేసిన ఉత్తర్వుల కాపీలను సకాలంలో పంపకుండా రోజుల కొద్దీ పెండింగ్‌లో పెడుతున్నారు. నేరుగా ప్రభుత్వమే గుర్తించి బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. రెవెన్యూలో విజిలెన్స్ విభాగంలోని నలుగురు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చింది. సచివాలయం కేంద్రంగా

మిగతా 12వ పేజీలో...



గిన్నిస్ బుక్‌పై మెగా స్టెప్

- 156 సినిమాల్లో 537 పాటల్లో మెగాస్టార్ 24 వేల స్టెప్పులు
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు
- సర్టిఫికెట్‌ను అందజేసిన గిన్నిస్ బృందం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమిర్‌ఖాన్
- చిరంజీవికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు

9

రవాణాలో బదిలీల మంట

మంత్రి ఇచ్చిన జాబితాకు రెడ్ సిగ్నల్

- వైసీపీ ప్రభుత్వ హయాంలో బదిలీలు పొందిన ఎంవీఐలను మార్చేయాలన్న రవాణా మంత్రి
- ఐదేళ్లు దాటిన వారికే బదిలీ అన్న కమిషనర్.. ప్రజాప్రతినిధుల సిఫారసులతో 44 మంది జాబితా
- పలువురిపై అవినీతి కేసులున్నాయంటూ తిరస్కరణ

3



సైనికుల రైలు వెళ్లే పట్టాలపై డిటోనేటర్లు!

» మధ్యప్రదేశ్‌లో ఘటన.. యూపీలో పట్టాలపై సిలిండర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: రైలు పట్టాలపై డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు ఉంచిన ఘటనలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకున్నాయి. జమ్మూకశ్మీరు నుంచి కర్ణాటకకు సైనికులతో వెళ్తున్న ప్రత్యేక రైలు.. మధ్యప్రదేశ్‌లోని సగ్‌ఫతా రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా పట్టాలపై డిటోనేటర్లను గుర్తించారు. వాటిని గమనించిన డ్రైవర్ రైలును కొద్దిసేపు ఆపి, స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన బుధవారం జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. ఆ డిటోనేటర్లు హానికరమైనవి కాదని, అయినా అవి పట్టాలపై ఎందుకు ఉంచారనే విషయమై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై ఆదివారం గ్యాస్ సిలిండర్‌ను గుర్తించారు. దాన్ని చూసిన గూడ్స్ రైలు డ్రైవర్ అత్యవసర బ్రేకులు వాడి, రైలును నిలిపివేశారు. రైలు కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్తోంది.

ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిబ్



న్యూఢిల్లీ/కోల్‌కతా, సెప్టెంబరు 22: ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) నూతన అధ్యక్షుడిగా ఉదయ్ భాను చిబ్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం నియమించారు. ఈయన నియామకం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఐవైసీ అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాస్ బీవీ స్థానంలో ఉదయ్ భాను చిబ్ నియామకం జరిగినట్టు పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఐవైసీ జనరల్ సెక్రటరీగా ఉన్న చిబ్ ఇంతకు ముందు జమ్మూకశ్మీర్ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేశారు. జమ్మూకు చెందిన చిబ్.. కాంగ్రెస్ నేత హరి సింగ్ చిబ్ కుమారుడు. మరోవైపు పశ్చిమబెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) నూతన అధ్యక్షుడిగా సుభాంకర్ సర్కార్‌ను ఖర్గే నియమించారు.

పోలీసులూ టికెట్లు కొనకుండా ప్రయాణిస్తున్నారు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణాలు చేసే వాళ్లలో పోలీసులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఘజియాబాద్-కాన్పూర్ సెక్షన్‌లో చేపట్టిన తనిఖీల్లో వందల మంది పోలీసులు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఏసీ బోగీలు, మెయిల్ రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు గుర్తించామని ఓ అధికారి పేర్కొన్నారు. వారిపై జరిమానా విధిస్తే చెల్లించేందుకు నిరాకరించారని, పైగా తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు తెలిపారు. కాగా, పండుగ సీజన్ నేపథ్యంలో రైల్వే అధికారులు ప్రత్యేక తనిఖీలు(డ్రైవ్) నిర్వహించాలని నిర్ణయించారు. దీనిపై రైల్వే శాఖ ఈనెల 20న 17 రైల్వే జోన్ల జనరల్ మేనేజర్లకు లేఖ రాసింది. అక్టోబరు 1 నుంచి 15 వరకు, అక్టోబరు 25 నుంచి నవంబరు 10వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించింది.

అసంపూర్ణ 'మందిర్'లో పూజలు చేయలేను

» జ్యోతిర్మఠ్ శంకరాచార్య వ్యాఖ్య

అయోధ్య సెప్టెంబరు 22: అయోధ్యలోని బాల రాముని మందిరంలో పూజలు చేసేందుకు ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్మఠ్ శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి ఆదివారం సుముఖత వ్యక్తం చేయలేదు. అసంపూర్ణంగా ఉన్న మందిరంలో పూజలు చేయకూడదని, అందువల్లనే తాను దూరంగా ఉంటున్నట్టు తెలిపారు. ఆలయ శిఖరం నిర్మాణం పూర్తయిన తరువాతే పూజలు చేస్తానని చెప్పారు. అయోధ్యలోని రామ మందిరాన్ని ఎందుకు దర్శించడం లేదంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ పై విధంగా తెలిపారు. అయితే రాంకోట్ ప్రాంతంలో ఉన్న రామజన్మభూమి ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చినేశ్వర్‌నాథ్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీలంక నూతన అధ్యక్షుడు దిసనాయకే



కొలంబో, సెప్టెంబరు 22: శ్రీలంక నూతన అధ్యక్షుడిగా మార్క్సిస్ట్ నేత, జనతా విముక్తి పెరమున(జేవీపీ)నాయకుడు అనూర కుమార దిసనాయకే ఎన్నికయ్యారు. దేశ చరిత్రలో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించబోతున్న తొలి మార్క్సిస్ట్ నాయకుడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాల లెక్కింపులో తన సమీప ప్రత్యర్థి సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) నాయకుడు సజిత్ ప్రేమదాసపై ఘన విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికల్లో దిసనాయకే గెలుపొందినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ప్రతిపక్ష నేత సజిత్ ప్రేమదాస రెండో స్థానంలో నిలిచారని తెలిపింది. దిసనాయకే దేశ తొమ్మిదో అధ్యక్షుడిగా సోమవారం ప్రమాణస్వీకారం చేస్తారని జేవీపీ ప్రకటించింది. శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మీడియాతో దిసనాయకే మాట్లాడుతూ.. జాతి ఐక్యత కోసం కలిసి పోరాడుదాం అన్ని పిలుపునిచ్చారు.

కుమారుడి ఫీజుల కోసం అడుక్కునేలా చేశారు

» బీజేపీలో చేరకపోతే చంపేస్తామన్నారు: మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: రాజకీయ కారణాలతోనే బీజేపీ తనను అరెస్టు చేయించి ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఆరోపించారు. మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఆయన ఆదివారం జంతర్‌మంతర్ వద్ద 'జనతా కీ అదాలత్' పేరుతో ఆప్ నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. పార్టీని చీల్చడానికి ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. బీజేపీలో చేరాలని, కుంభకోణానికి కేజ్రీవాలే కారణమంటూ చెప్పాలని ఒత్తిడి తెచ్చారని, కానీ తాను లొంగలేదని అన్నారు. "జర్నలిస్టుగా ఉన్నప్పుడు 2002లో రూ.5 లక్షలతో ఫ్లాట్ కొన్నా. దాన్ని తీసేసుకున్నారు. నా బ్యాంకులోని రూ.10లక్షలను స్తంభింపజేశారు. కుమారుడి కాలేజీ ఫీజుల కోసం అడుక్కునేలా చేశారు" అంటూ ఆవేదన చెందారు. "బీజేపీలో చేరాలని ఒత్తిడి తెచ్చారు. లేకుంటే జైలులోనే చంపేస్తామని హెచ్చరించారు. కుటుంబం గురించి, అనారోగ్యంతో బాధపడుతున్న భార్య గురించి, కుమారుని ఫీజుల గురించి ఆలోచించుకో అని చెప్పారు" అంటూ జైలులోని అనుభవాలను వివరించారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం, మయన్మార్ తీరంలో ఉన్న మరో ఆవర్తనం ప్రభావంతో సోమవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో రెండు మూడు రోజుల పాటు అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, వాయువ్య భారతం నుంచి సోమవారం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ మొదలు కానున్నదని పేర్కొంది. రానున్న మూడు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

కోచింగ్ సెంటర్లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: సరైన బోధన, ఇతర సదుపాయాలు కల్పించకుండా విద్యార్థుల నుంచి ఇష్టారీతిన ఎన్‌రోల్‌మెంట్ ఫీజును వసూలు చేసిన కోచింగ్ సెంటర్లపై కేంద్రం కొరడా ఝళిపించింది. సివిల్స్, ఐఐటీతో పాటు వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజులో రూ.కోటిని ఆయా శిక్షణా కేంద్రాల నుంచి జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్) రిఫండ్ చేయించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఫిర్యాదుల నేపథ్యంలో వినియోగదారుల మంత్రిత్వశాఖ జోక్యంతో ముందు దశలోనే రిఫండ్‌ను ప్రాసెస్ చేశారు. దీనిపై వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే మాట్లాడుతూ.. 'విద్యార్థులు తమ ఫిర్యాదులను 1915కు ఫోన్‌చేసి లేదా www.consumer helpline.gov.in పోర్టల్ ద్వారా తెలియజేయవచ్చు' అని సూచించారు.

నిలబడతాం.. బలపడతాం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనెస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు. క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అంతకు ముందు ఆయన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ ఈవెంట్'లో మాట్లాడుతూ.. ఇండో-పసిఫిక్ రీజియన్ దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సకు భారత్ తరఫున రూ.62.61 కోట్ల(7.5 మిలియన్ డాలర్ల)ను అందజేస్తామని ప్రకటిస్తూ.. తమ లక్ష్యం 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం' అంటూ నినదించారు. ఈ రీజియన్‌లోని దేశాలకు 4 కోట్ల డోసుల క్యాన్సర్ టీకాలను అందజేస్తామన్నారు.



వచ్చే ఏడాది భారత్‌లో..

క్వాడ్ దేశాధినేతల తదుపరి సదస్సు వచ్చే ఏడాది భారత్‌లో జరగనుంది. నాలుగేళ్ల క్రితం ఈ సంస్థ ఆవిర్భవించగా.. అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్‌లలో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. నిజానికి ఈ సంవత్సరం భారత్ వంతు కాగా.. తన పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో తన స్వస్థలంలో సమ్మిట్‌కు అనుమతించాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ విజ్ఞప్తి చేశారు. దాంతో.. వచ్చే ఏడాది సదస్సును భారత్‌లో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

ఈ సదస్సులో క్వాడ్ దేశాధినేతలు ఈశాన్య, దక్షిణాసియా, పసిఫిక్ దీవుల్లో పరస్పర సహరాన్ని అందిపుచ్చుకోవాలని నిర్ణయించారు. మారిటైమ్ ఇనిషియేటివ్ ఫర్ ట్రైనింగ్ ఇన్ ఇండో-పసిఫిక్(మైత్రి)ని క్వాడ్ దేశాధినేతలు సంయుక్తంగా ప్రకటించారు. ఇకపై ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని సముద్ర జలాల్లో భద్రత, అంతర్జాతీయ చట్టాల అమలు, చట్టవ్యతిరేక చర్యల నిర్మూలనకు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం భారత్, అమెరికా, జపాన్ కోస్ట్‌గార్డులు, ఆస్ట్రేలియా సరిహద్దు దళం సంయుక్తంగా పనిచేస్తాయి. 2025లో మైత్రి శిక్షణ కార్యక్రమాలను భారత్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. సముద్రాల్లో క్వాడ్ పోర్టులను ఏర్పాటు చేసి, పరస్పరం సహకరించుకోవాలని నలుగురు నేతలు సంకల్పించారు. దీనిపై ముంబైలో 'క్వాడ్ ప్రాంతీయ పోర్టులు-రవాణా సదస్సు'ను నిర్వహించాలని నిర్ణయించారు. క్వాడ్ ఇండో-పసిఫిక్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంత నిపుణులకు ఇస్తున్న ఫెలోషిప్‌ల సంఖ్యను 2,200కు పెంచాలని క్వాడ్ దేశాధినేతలు నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో సెమీకండక్టర్ల సప్లయ్ చైన్ ఏర్పాటు తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.

'విల్మింగ్టన్ డిక్లరేషన్'లో పాక్‌పై నిప్పులు

క్వాడ్ దేశాధినేతలు 'విల్మింగ్టన్ డిక్లరేషన్' పేరిట సీమాంతర ఉగ్రవాదాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా పరోక్షంగా పాకిస్థాన్ చర్యలపై నిప్పులు కురిపించారు. 26/11 ముంబై ఉగ్రదాడులు, పఠాన్‌కోట్ దాడి గురించి ప్రస్తావించారు. అదే సమయంలో చైనా, ఉత్తరకొరియాల తీరును కూడా పరోక్షంగా ఎండగట్టారు. రష్యాకు ఉత్తర కొరియా ఆయుధ సంపత్తిని అందజేస్తున్న విషయాన్ని ఆయా దేశాల పేర్లను ప్రస్తావించకుండా విమర్శించారు.

మోదీపై బైడెన్ పొగడ్తల వర్షం

విల్మింగ్టన్‌లో శనివారం బైడెన్-మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపిన విషయం తెలిసిందే.! ఈ చర్చల్లో మోదీపై బైడెన్ పొగడ్తల వర్షం కురిపించినట్లు విదేశాంగ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన.. శాంతికోసం ఆయన చేస్తున్న కృషిని అభినందించినట్లు వివరించారు. కొవిడ్ సమయంలో 'టీకా మైత్రి' మొదలు.. ఇటీవలి జీ20 సమ్మిట్ వరకు ప్రపంచ క్షేమం కోసం భారత్ చేస్తున్న కృషిని కొనియాడినట్లు పేర్కొన్నారు.

చైనా పరీక్ష పెడుతోంది

వాషింగ్టన్, సెప్టెంబరు 22: ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా తమకు పరీక్ష పెడుతోందని క్వాడ్ దేశాల అధినేతల సదస్సులో బైడెన్ అన్నారు. అయితే ఆయనకు ఆ సమయంలో అక్కడున్న మైక్ ఆన్‌లో ఉందని తెలియదు. ఆర్థిక, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలతోపాటు అనేక విషయాల్లో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుగా వ్యవహరిస్తోందని ఆయన క్వాడ్ దేశాధినేతలతో చెప్పారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రకు చెందిన హస్త కళాకారులు తయారుచేసిన ఒక వెండి రైలు నమూనాను ప్రధాని మోదీ బైడెన్‌కు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా అమెరికా ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు జమ్ము, కశ్మీర్‌లో తయారుచేసిన పాష్మినా శాలువాను ప్రధాని బహూకరించారు. మరోవైపు, భారత్ నుంచి అక్రమంగా అమెరికాకు తరలించిన 297 పురాతన కళాఖండాలను ఆ దేశం భారత్‌కు అప్పగించింది.





'మోదీ- యూఎస్- ప్రోగ్రెస్ టుగెదర్'కు హాజరైన ప్రవాస భారతీయులు



భారత్‌ను ఆపడం ఎవరితరం కాదు

ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ

'పుష్ప'కు ప్రధాని కొత్త నిర్వచనం

న్యూయార్క్, సెప్టెంబరు 22: మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌ను ఆపడం ఎవరితరం కాదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మూడో సారి ప్రధానిగా ఎన్నికైన తన ముందు మహోన్నత లక్ష్యాలున్నాయని వివరించారు. ఆదివారం ఆయన న్యూయార్క్‌లో ప్రవాస భారతీయులు ఏర్పాటు చేసిన 'మోదీ- యూఎస్- ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పుష్ప-1లోని 'శ్రీవల్లి' పాటతో ఉర్రూతలూగించి.. 'హర్ ఘర్ తిరంగా' పాటను ఆలపిస్తుండగా.. ప్రధాని మోదీ వేదికపైకి చేరుకున్నారు. మోదీ కూడా పుష్ప గురించి మాట్లాడారు. "పుష్ప అంటే.. ప్రోగ్రెసివ్ భారత్.. అన్‌స్టాపబుల్ భారత్, స్పిరిచ్యువల్ భారత్, డెడికేటెడ్ భారత్, హ్యూమానిటీ ఫస్ట్ భారత్, ప్రాస్పరస్ భారత్" అని వివరించారు.

మా నిజాయితీపై మోదీ దాడి!

» నాకు సొంత ఇల్లు కూడా లేదు..

» డబ్బు సంపాదించలేదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: ప్రధాని మోదీ కుట్రతో తన నిజాయితీపై దాడి చేస్తున్నారని, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలను జైలుకు పంపుతున్నారని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, ప్రతిపక్షాలు చేసిన అవినీతి ఆరోపణలు తన మనసును గాయపరిచాయని, అందుకే సీఎం పదవికి రాజీనామా చేశానని చెప్పారు. ఢిల్లీ సీఎం పదవి నుంచి వైదొలగిన తర్వాత తొలిసారిగా ఆయన ప్రజల ముందుకు వచ్చారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ 'గత పదేళ్లుగా మేం ప్రభుత్వాన్ని నిజాయితీగా నడుపుతున్నాం. ప్రజలకు విద్యుత్, నీరు ఉచితం చేశాం. ఉచితంగానే వైద్య చికిత్సలు అందిస్తున్నాం. విద్యను మెరుగుపరిచి అద్భుతం చేశాం. దీంతో మాపై గెలవాలంటే మా నిజాయితీపైనే దాడి చేయాలని మోదీ భావించారు. అందుకే కేజ్రీవాల్, సిసోడియా, ఇతర ఆప్ నేతలను అవినీతిపరులుగా నిరూపించేందుకు, వారందరినీ జైల్లో పెట్టేందుకు కుట్ర పన్నారు. తోలుమందం నేతలు(ఇతర పార్టీల నాయకులు) అవినీతి ఆరోపణలను పట్టించుకోరు. కానీ నేను పట్టించుకుంటాను. బీజేపీ నేతలు దొంగ, అవినీతిపరుడు అనడం నా హృదయాన్ని గాయపరిచింది. అందుకే బాధతో రాజీనామా చేశాను. నాకు సొంత ఇల్లు కూడా లేదు. తమ ఇల్లు తీసుకోవాలని ప్రజల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దసరా నవరాత్రులు మొదలైనప్పుడు సీఎం బంగ్లాను ఖాళీ చేసి, వారి (ఢిల్లీ ప్రజలు)లో ఒకరి ఇంటికి వెళ్లి నివసిస్తాను' అన్నారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు తనకు అగ్ని పరీక్షగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ ఐదు ప్రశ్నలు సంధించారు. 'అత్యధిక మంది అవినీతి నేతలను మోదీ తన పార్టీలో చేర్చుకున్నారు. ఇలాంటి రాజకీయాలను ఆర్ఎస్ఎస్ ఆమోదిస్తుందా? బీజేపీలో రిటైర్‌మెంట్ వయసు(75 ఏళ్లు) నిబంధన ఎల్‌కే అడ్వాణీకి వర్తించినట్టే, మోదీకీ వర్తిస్తుందా? వర్తించదని అమిత్‌షా అంటున్నారు. ఆర్ఎస్ఎస్ అవసరం తమ పార్టీకి లేదని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించినప్పుడు మీకు ఏమనిపించింది? బీజేపీ ప్రస్తుత రాజకీయాల పట్ల మీరు సంతృప్తి చెందుతున్నారా? అని కూడా ప్రశ్నించారు.



ఎస్టీలపై దాడుల్లో.. ఆంధ్రకు ఐదో స్థానం

» 2022లో 499 కేసులు నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22: దేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల్లో 98.35 శాతం వరకు 13 రాష్ట్రాల్లోనే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2022లో నమోదైన కేసులపై తాజా గణాంకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. ఆ ఏడాది ఎస్టీలపై దాడుల కేసులు 9,735 నమోదు కాగా.. మధ్యప్రదేశ్ మొదటి స్థానం(2,979-30.61%)లో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 499 కేసులతో ఐదో స్థానం(5.13%)లో నిలిచింది. ఎస్సీలపై దాడుల కేసులు 51,656 కాగా.. ఉత్తరప్రదేశ్ 12,287 కేసులతో ప్రథమ స్థానం(23.78%)లో నిలిచింది. రాజస్థాన్ (16.75%), మధ్యప్రదేశ్ (14.97%), బిహార్ (13.16%), ఒడిశా (6.93%), మహారాష్ట్ర (5.24%)తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం కేసుల్లో 81% ఈ ఆరు రాష్ట్రాల్లోనే నమోదు కావడం గమనార్హం. కేసుల విచారణ పురోగతి గురించి కూడా నివేదికలో ప్రస్తావించారు. 60.38 శాతం ఎస్సీ సంబంధ కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయి. తప్పుడు ఆరోపణలు, సాక్ష్యాధారాలు లేకపోవడం వంటి వాటివల్ల 14.78 శాతం కేసులను మూసివేశారు. ఎస్టీ సంబంధ కేసుల్లోనూ 2,702 కేసుల విచారణ పెండింగ్‌లో ఉంది.

పైరవీలకు తావులేకుండా బదిలీలు!

» పౌరసరఫరాల శాఖలో ముగిసిన అధికారుల ట్రాన్స్‌ఫర్‌లు

» మేనేజర్ నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు..

» పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోనూ స్థానచలనాలు

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో బదిలీలు జరిగాయి. ఎలాంటి సిఫారసులు, రాజకీయ పైరవీలకు తాము లేకుండా, సమర్థత ఆధారంగా అధికారుల బదిలీలు జరిగాయని అధికారిక వర్గాల్లో చర్చ జరుగుతున్నది. పౌరసరఫరాల శాఖలో మేనేజర్లతోపాటు కిందిస్థాయి ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 22వ తేదీ వరకు సాధారణ బదిలీలకు అవకాశం ఇచ్చింది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల సర్వీసు పూర్తైన వారిని తప్పనిసరి(కంపల్సరీ), మరికొందరిని అభ్యర్థన(రిక్వెస్ట్), ఇంకొందరిని పాలన అవసరాల దృష్ట్యా(అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్) బదిలీలు చేస్తూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మార్కెటింగ్ మేనేజరుగా పనిచేస్తున్న ఎస్.నీలిమ, ఫైనాన్స్ మేనేజరు వి.నాగసుధ, ప్రొక్యూర్‌మెంట్ మేనేజరు జి.శిరీష, స్టోరేజ్ మేనేజరు వి.శ్రీలక్ష్మిలకు ఐదేళ్ల సర్వీసు పూర్తవడంతో వారిని వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. నీలిమను విశాఖపట్నం జిల్లా మేనేజరుగా, నాగసుధను కర్నూలు జిల్లా మేనేజరుగా బదిలీ చేశారు. శిరీషను స్పౌజ్ కోటాలో విజయవాడ జోనల్ మేనేజరు ఇన్‌చార్జిగా నియమించారు. శ్రీలక్ష్మిని కూడా స్పౌజ్ కింద ఏలూరు జిల్లా మేనేజరుగా బదిలీ చేశారు. విజయనగరం జిల్లా మేనేజరు కె.మీనాకుమారి (కంపల్సరీ), ఏలూరు జిల్లా మేనేజరు కె.మంజు భార్గవి, కర్నూలు జిల్లా మేనేజరు డి.షర్మిల, విశాఖపట్నం జిల్లా మేనేజరు ఐ.రాజేశ్వరి, కృష్ణా జిల్లా మేనేజరు టి.వి.సతీష్‌లను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో అసిస్టెంట్ మేనేజరు(అకౌంట్స్)గా ఉన్న పి.శ్రీనివాసరావును మన్యం జిల్లా ఇన్‌చార్జి మేనేజరుగా, కడప జోనల్ మేనేజరు కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజరు(జనరల్)గా పనిచేస్తున్న బి.బాలకృష్ణను చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మేనేజరుగా రిక్వెస్ట్ బదిలీలు చేశారు. మన్యం జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్‌ను కాకినాడకు, పల్నాడు జిల్లా మేనేజరు జి.వరలక్ష్మిని ప్రకాశం జిల్లాలకు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లా మేనేజరు మోహన్‌బాబును రిక్వెస్ట్‌పై మళ్లీ కాకినాడ జోనల్ మేనేజరుగా నియమించారు. కృష్ణా జిల్లా అసిస్టెంట్ మేనేజరు(అకౌంట్స్)గా పని చేస్తున్న డి.సృజనను అదే జిల్లా ఇన్‌చార్జి మేనేజరుగా నియమించారు. వివిధ క్యాడర్లకు చెందిన కింది స్థాయి ఉద్యోగులకు కూడా బదిలీలు నిర్వహించారు.

డ్వామా పీడీ, జడ్పీ సీఈఓల బదిలీలు

రాష్ట్రంలో పలువురు డ్వామా పీడీలు, జడ్పీ సీఈఓలకు బదిలీలు చేపడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. అధికారుల సమర్థతను గుర్తించి పలు జిల్లాలకు జడ్పీ సీఈఓలుగాను, డ్వామా పీడీలుగా నియమించగా, మంత్రులు ఎమ్మెల్యేల నుంచి సిఫారసు లేఖలు తీసుకొచ్చిన వాళ్లకు ప్రాధాన్యత లేని పోస్టులు దక్కాయి. రాజకీయ పైరవీలకు తావులేకుండా శాఖలో బదిలీలు జరిగాయని చెప్పుకుంటున్నారు. ఇంకా నాలుగు జిల్లాల్లో డ్వామా పీడీలకు సంబంధించి బదిలీలు నిర్వహించలేదు. పలువురు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు, ఈఈలకు బదిలీలు నిర్వహించారు. పంచాయతీరాజ్‌లో 12 మంది ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వాటితో పాటు డీపీఓలు, డీఎల్‌డీఓ బదిలీలు చేస్తూ ఆదేశాలిచ్చారు.

బీఎస్సీ అగ్రికల్చర్ ప్రశ్నాపత్రాల లీక్

» ఆలస్యంగా గుర్తించిన రంగా వర్సిటీ అధికారులు

» కడప జిల్లాలోని ప్రైవేట్ కాలేజీపై అనుమానాలు

» నేడు, రేపు తిరిగి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

» లీకేజీపై విచారణకు కమిటీ ఏర్పాటు: రిజిస్ట్రార్

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్‌కు సంబంధించి బ్రీడింగ్, ఎంటమాలజీ సబ్జెక్ట్‌ల పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్లు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. దీంతో సోమ, మంగళవారాల్లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తున్నారు. గత వారం బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి కడప జిల్లాలోని ఓ ప్రైవేట్ వ్యవసాయ కళాశాలలో ముందే ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యినట్లు వర్సిటీ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. పరీక్షకు గంట ముందు నిర్వాహకులైన అధికారులకు వాట్సాప్ ద్వారా పంపే పేపర్లను పరీక్షా కేంద్రంలోని అధికారులు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను ఇచ్చారు. అయితే కడపలోని ప్రైవేట్ అగ్రికల్చర్ కాలేజీ నుంచి పేపర్లు లీక్ అయినట్లు వర్సిటీ అధికారులు అనుమానిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల వాట్సాప్ గ్రూపుల్లో ప్రశ్నాపత్రాలు ముందే చక్కర్లు కొట్టినట్లు గుర్తించని అధికారులు యథావిధిగా పరీక్షలు నిర్వహించారు. తర్వాత ఈ వ్యవహారం తెలిసి, ప్రశ్నాపత్రాల లీకేజీపై విచారణకు కమిటీని నియమించారు. కడప జిల్లాలో పేపర్ లీకేజీ వ్యవహారం జరిగినట్లు గుర్తించినా.. రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీ నిర్వహణలోని 7 అగ్రికల్చర్ కాలేజీలతో పాటు 6 ప్రైవేట్ కాలేజీల్లోనూ ఈ రెండు పేపర్లకు తిరిగి పరీక్ష నిర్వహించాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. 13 కాలేజీల్లోని దాదాపు వెయ్యి మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాలని సమాచారం ఇచ్చినట్లు రిజిస్ట్రార్ రామచంద్రరావు ఆదివారం ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో చెప్పారు. పేపర్ లీకేజీకి బాధ్యులను గుర్తించి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రైవేటు బస్సులో మహిళపై అత్యాచారం

» బస్సు హెల్పర్ అఘాయిత్యం

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణికురాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఆ బస్సు హెల్పర్‌ను కూకట్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ పీఎస్ నుంచి 'జీరో ఎఫ్ఐఆర్' రావడంతో దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు ఈ కేసు వివరాలు తెలిపారు. ఏపీకి చెందిన ఓ మహిళ (28) హైదరాబాద్‌లోని ఒకరింట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తోంది. సొంతూరు వెళ్లేందుకు ఈ నెల 18న రాత్రి 10.40 గంటలకు కూకట్‌పల్లి వై జంక్షన్‌లో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎక్కింది. ఆమె అప్పర్ బెర్త్ బుక్ చేసుకోగా.. ఆమెపై కన్నేసిన బస్సు హెల్పర్ మాయమాటలు చెప్పి వెనకాల లోయర్ బెర్త్ ఖాళీగా ఉందని అక్కడ పడుకునేలా చేశాడు. ఆ తర్వాత వాటర్ బాటిల్ ఇచ్చేందుకు వెళ్లి ఆమెతో మాటలు కలిపాడు. కొద్దిసేపటి తర్వాత ఆమె నోరు నొక్కి, కర్టన్లు మూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయపెట్టడంతో ఆమె మౌనంగా ఉండిపోయింది. తర్వాత మరోసారి ఆమెపై లైంగిక దాడి చేశాడు. మరుసటి రోజు ఆమె ఇంటికెళ్లిన తర్వాత జరిగిన విషయాన్ని తన యజమానికి చెప్పింది. దాంతో వెంటనే ఆమెను హైదరాబాద్‌కు పిలిపించాడు. బస్సు బయలుదేరిన సుమారు 2 గంటల తర్వాత ఘటన జరగడంతో అది చౌటుప్పల్ పరిధి కావచ్చని భావించి.. అక్కడి పీఎస్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన చౌటుప్పల్ పోలీసులు కేసును కూకట్‌పల్లి పీఎస్‌కు బదిలీ చేశారు. ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు దర్యాప్తు చేపట్టి బస్సు హెల్పర్ రెడ్డి సాయికుమార్‌ను అరెస్టు చేశారు. ఆ బస్సులో మొత్తం 25 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది.

అమ్మఒడి అమలులో మాట తప్పలేదా!

» ఈ ప్రశ్నలకు బదులివ్వు జగన్!

» జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు సవాల్

నంద్యాల, అనంతపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమ్మఒడి అమలులో జగన్ మాట తప్పింది నిజం కాదా! అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. తాను అడిగే ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పులివెందులలో ఎన్నికల ప్రచారంలో ఒక పిల్లోడుంటే రూ.15వేలు ఇద్దరు పిల్లలుంటే రూ.30వేలు అని వైఎస్ భారతి చెప్పారని, జగన్ అలా ఇచ్చారా? అని నిమ్మల ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 9 నెలలకు అమ్మఒడి అమలు చేసింది నిజం కాదా? అని నిలదీశారు. 15వేలు అని చెప్పి, రూ.14 వేలు.. చివరికి రూ.13వేలకు తగ్గించారని, కొందరికైతే రూ.7 వేల నుంచి రూ.8వేలే జమైంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలంలో మల్యాల ఎత్తిపోతల పథకాన్ని మంత్రి ఆదివారం పరిశీలించారు. అలాగే, అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలంలో జీడిపల్లి రిజర్వాయర్‌ను మంత్రి సందర్శించారు. అనంతరం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో కలిసి నిమ్మల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత వంద రోజుల్లోనే జగన్ చేసిందంతా విధ్వంసమని బయటపడుతోందన్నారు. వరదలో ప్రకాశం బ్యారేజీకి బోట్లు కొట్టుకొచ్చిన వ్యవహారం, తిరుమల లడ్డూలో కల్తీ ఇలా అనేకం వెలుగుచూస్తున్నాయన్నారు. నెలలో పది రోజులు రాయలసీమలోనే ఉంటానని నిమ్మల చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎత్తిపోతల పథకాలను సర్వనాశనం చేశారని, రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే నైతిక హక్కు జగన్‌కు లేదని మండిపడ్డారు. హంద్రీ నీవా ఎత్తిపోతల ప్రాజెక్టు ఆసియాలోనే అత్యంత పొడవైనదని, ఇలాంటి ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయటంతో ప్రస్తుత సామర్థ్యం 1,900 క్యూసెక్కులకు పడిపోయిందని తెలిపారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రాయలసీమకు సంబంధించిన ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.12,441 కోట్లు ఖర్చు చేస్తే, గత ఐదేళ్లలో వైసీపీ రూ.2,011 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని మంత్రి వెల్లడించారు. హంద్రీ నీవా ప్రాజెక్టును మునుపటి స్థాయికి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామన్నారు. తుంగభద్ర డ్యాం గేట్లన్నీ మార్చాలనే విషయంలో ఇంకా నివేదికలు అందలేదని, రాగానే కర్ణాటక ప్రభుత్వంతో సమీక్షించుకుని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారన్నారు.

రవాణాలో బదిలీల మంట

» మంత్రి ఇచ్చిన బదిలీల జాబితాకు రెడ్ సిగ్నల్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏరికోరి బదిలీలు పొందిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)లను బదిలీ చేసి.. వారిస్థానాల్లో ఫలానా వారిని నియమించండి.. అంటూ రవాణా శాఖ మంత్రి ఇచ్చిన ఎంవీఐల బదిలీ జాబితాకు రెడ్ సిగ్నల్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లు దాటిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని చెప్పింది కదా.. రెండు, రెండున్నరేళ్లకే మార్చాల్సిన అవసరం ఏముంది..? అంటూ రవాణా శాఖ కమిషనర్ అభ్యంతరం చెప్పడం బదిలీల మంటను రాజేసింది. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఐదేళ్ల పాటు ఒకే చోట కదల్చకుండా ఉంచడమంటే అవినీతికి హైవే వేసినట్లే.! ప్రతి రెండేళ్లకు పోలీసుల్ని మార్చేస్తారు.. ఇది కూడా అలాంటిందే. అవసరాన్నిబట్టి ఆయా శాఖల అధిపతులు మార్పులు చేసుకోవచ్చని ప్రభుత్వం చెప్పిందని బదిలీలు కోరుకుంటున్న ఎంవీఐలు గుర్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఖజానాకు ఏటా ఐదువేల కోట్లకు పైగా ఆదాయం తెచ్చిపెట్టేది రవాణా శాఖ. ఈ శాఖలో ఎంవీఐలు, ఆర్టీవోలు, డీటీసీలు కీలకం. అయితే.. ఎంవీఐల బదిలీలు ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటాయి.



సరిహద్దు చెక్ పోస్టులు, ఫిట్‌నెస్ కేంద్రాలు, ఇతర ఆదాయ మార్గాలున్న ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం ఎంవీఐలు అనేక మార్గాల్లో ప్రయత్నిస్తుంటారు. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రితో విజయవాడలోని ఆటోనగర్‌లో సమావేశమై ఏకంగా వేలం పాట ద్వారా రూ.20-25 లక్షలు పోసి పోస్టింగ్స్ దక్కించుకున్న వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పోయి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. కొత్త ప్రభుత్వం.. సీఎస్, డీజీపీ మొదలుకొని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల వరకూ బదిలీలు చేపట్టింది. ఇదే సమయంలో పలు శాఖల హెచ్‌వోడీలనూ మార్చేసింది. కిందిస్థాయి ఉద్యోగుల బదిలీలకు గతనెల 17న అనుమతిచ్చింది. ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన వారిని తప్పనిసరిగా మార్చేయాలని పేర్కొంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధిపతులకు అవసరం మేరకు ఒకే చోట రెండేళ్ల సర్వీసు దాటిన వారిని కూడా మార్చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో పలువురు ఎంవీఐలు, ఆర్టీవోలు, డీటీసీలు రవాణా శాఖ పెద్దలకు వినతులు సమర్పించారు. ప్రభుత్వం ఇచ్చిన బదిలీల జీవోలో ఐదేళ్లు ఉన్నా.. రవాణా శాఖలో రెండేళ్లకే బదిలీలు చేసుకోవచ్చంటూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సడలింపు జీవో ఇచ్చారు. అయితే.. ఇది అనవసర వివాదాలకు తావిచ్చినట్లు అవుతుందంటూ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా అభ్యంతరం చెప్పడంతో ఈ జీవోను కాంతిలాల్ దండే విరమించుకున్నారు. ఇదే సమయంలో రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డితో భేటీ అయిన పలువురు ఎంవీఐలు, ఆర్టీవోలు... గత ప్రభుత్వంలో అడ్డదారుల్లో వచ్చినవారిని బదిలీ చేయకుంటే కొత్త ప్రభుత్వంలోనూ దోపిడీ కొనసాగుతుందని చెప్పారు. దీంతో రవాణా శాఖలోని కొందరు అధికారులతో చర్చించిన మంత్రి రెండు రోజుల క్రితం కమిషనర్ ఎంకే సిన్హాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డదారుల్లో వచ్చిన వారితోపాటు కూటమి ప్రభుత్వంలో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారి పేర్లతో 44 మందితో కూడిన జాబితా ఇచ్చి బదిలీ చేయాలని కోరారు. ఇలాచేస్తే అవినీతి ఆరోపణలు వస్తాయన్న అభిప్రాయంతో రవాణ శాఖ కమిషనర్ దాన్ని పక్కన బెట్టేశారు. దీంతో వివాదం ముదిరి ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది.

అవినీతిపరులను పక్కన పెట్టొచ్చు కదా...

రవాణా శాఖ మంత్రి సిఫారసు చేసిన ఎంవీఐల జాబితాలో పలువురిపై అవినీతి ఆరోపణలున్నాయని సమాచారం. అయితే ఈ జాబితాలో అందరూ అవినీతి పరులే ఉంటారా..? ఒకవేళ ఉన్నా.. సర్వీస్ రిజిస్టర్, ఏసీఆర్ లాంటివి చూసి అలాంటి వారిని పక్కన పెట్టవచ్చు కదా..? అనే ప్రశ్నలు రవాణా శాఖలో వినిపిస్తున్నాయి. రాజకీయ పరమైనవో, ఇతర ప్రజా ప్రనిధుల సిఫారసుల తోనో ఉన్నవి తప్ప.. అందులో ఉన్న వన్నీ తప్పే అనడం డిపార్ట్‌మెంట్ పరువు తీయడమేనంటూ కొందరు పెదవి విరుస్తున్నారు. రవాణా మంత్రి, ముఖ్య కార్యదర్శి, కమిషనర్ మధ్య సమన్వయం లోపిస్తే రవాణా శాఖపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు.



టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలు

శ్రీప్రకాష్‌లో ముగిసిన క్లస్టర్ లెవెల్ టీటీ పోటీలు

పెద్దాపురం, సెప్టెంబరు 22: కాకినాడ జిల్లా పెద్దాపురంలో శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో 3 రోజులుగా జరుగుతున్న క్లస్టర్ లెవెల్ సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. కాకినాడ టీటీ అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌బాబు హాజరవ్వగా ఆయనకు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ సాదరంగా ఆహ్వానం పలికారు. టీటీ ఇంటర్నేషనల్ కోచ్ సురేష్, కాకినాడ టీటీ వైస్ ప్రెసిడెంట్ దండు భాస్కర్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, రమణకుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర ఆయకట్టులో రెండు పంటలకు నీరిస్తాం

» డ్యామ్‌ను పరిశీలించిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్



కన్నయ్యనాయుడును సన్మానిస్తున్న సిద్ధరామయ్య, ఇతర మంత్రులు

బళ్లారి/హొస్పేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర రిజర్వాయర్ నుంచి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఆయకట్టులో రెండు పంటలకు నీరిస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. విజయనగర జిల్లా కేంద్రం హొస్పేట్ సమీపంలోని తుంగభద్ర జలాశయాన్ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా తుంగభద్రకు వాయనం ఇచ్చారు. అనంతరం రిజర్వాయర్ సమీపంలోనే కొప్పళ జిల్లా కణికగిరిలో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. ఆగస్టు 10న డ్యాం 19వ క్రస్ట్ గేటు నీటి ఉధృతిలో కొట్టుకుపోయిందని, అయితే దేవుడి దయతో స్టాప్‌లాగ్ అమర్చి, రిజర్వాయర్‌లోని నీటిని నిలబెట్టుకోగలిగామన్నారు. కన్నయ్యనాయుడు లాంటి మహావ్యక్తి సమయస్ఫూర్తితో ఆయన అనుభవం అంతా కూడగట్టి క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చారని ప్రశంసించారు. కన్నయ్యనాయుడుకు రైతుల తరఫున సీఎం కృతజ్ఞతలు తెలిపారు. క్రస్ట్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ అమర్చడంలో కీలకంగా వ్యవహరించిన కన్నయ్యనాయుడు, ఆయనకు సహకరించిన తమిళనాడుకు చెందిన 20 మంది యువకులను ముఖ్యమంత్రి ఇతర మంత్రులు సన్మానించారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జుల నియామకం

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులను నియమించింది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కొత్తరి శ్రీనివాస్, శ్రీకాకుళం జిల్లాకు గాదం వెంకట త్రినాథరావు, విజయనగరం జిల్లాకు గంగిశెట్టి ఉమాశంకర్, విశాఖకు నూతన్‌నాయుడు, అనకాపల్లికి వి.గురునాథం, కాకినాడకు మేడ సురేశ్, అమలాపురానికి జగతా శ్రీనివాస్, రాజమండ్రికి కొలనుకొండ శివాజీ, నరసాపురానికి బి.నాడేశ్వరరావు, ఏలూరుకు వినీత సంజీవరెడ్డి, మచిలీపట్నంకు ఎం.శేఖర్, విజయవాడకు మొవ్వ మోహనరావు, గుంటూరుకు శ్రీపతి ప్రకాశం, బాపట్లకు గడ్డం పాల్ విజయకుమార్, నరసరావుపేటకు ఎం.మోహనరెడ్డి, ఒంగోలుకు గౌతు ఎస్వీ సత్యేంద్రబాబు, నంద్యాలకు పి.మహమ్మద్ అలీఖాన్, కర్నూలుకు అంబటి రామకృష్ణయాదవ్, అనంతపురానికి టి.వెంకట నరసింహులు, కడపకు ఎం.శ్రీనివాసరెడ్డి, హిందూపురానికి పి.శ్రీనివాసరెడ్డి, రాజంపేటకు ఎస్.ప్రతాప్‌రెడ్డి, నెల్లూరుకు ఎం.గోపాలరెడ్డి, తిరుపతికి ఇసుధాకరరెడ్డి, చిత్తూరుకు డి.రాంభూపాల్‌రెడ్డిని నియమించారు.

ఏటీఎంలలో రూ.42 లక్షల చోరీ

» కడప జిల్లాలో రెండు చోట్ల దొంగతనాలు



ఒంటిమిట్ట, కడప ఏటీఎంలలో సీసీ కెమెరాకు స్ప్రే కొడుతున్న దుండగులు

ఒంటిమిట్ట/కడప క్రైం, సెప్టెంబరు 22: కడప జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున రెండు ఏటీఎంలలో జరిగిన భారీ చోరీలు కలకలం రేపాయి. ఒంటిమిట్ట, కడప నగరంలో చోటుచేసుకొన్న ఈ ఘటనల్లో రూ.42 లక్షలకు పైగా నగదు దొంగతనానికి గురైంది. ఒంటిమిట్టలో రూ.36,19,400, కడపలో రూ.6,19,300 ఏటీఎంల నుంచి దుండగులు దోచుకెళ్లారు. ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌కు 30 అడుగుల దూరంలోని ఏటీఎంలో చోరీ జరగడం గమనార్హం. వివరాల ప్రకారం.. ఒంటిమిట్ట పోలీసుస్టేషన్‌కు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలోకి తెల్లవారుజామున 4.10 గంటలకు దుండగులు చొరబడ్డారు. ఏటీఎంను పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ముఖానికి మంకీ క్యాపుతో ప్రవేశించిన దుండగుడు కెమెరాలకు నలుపురంగు స్ప్రే చేసి ఏటీఎం మిషన్‌ను కట్టర్‌తో పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. మరో వ్యక్తి బయట కాపలాగా ఉన్నాడు. చోరీ అనంతరం దుండగులు రాజంపేటవైపు కారులో వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకున్నారు.

పక్కనే ఉన్నా ఏం చేస్తున్నారు?

పోలీసుస్టేషన్ పక్కనే ఉన్న ఏటీఎంలో చోరీ జరగడం చూస్తుంటే ఎంత బాగా విధులు నిర్వహిస్తున్నారో అర్థమవుతోందని సీఐ కృష్ణంరాజునాయక్‌పై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. చోరీకి గురైన ఏటీఎంను ఎస్పీ మధ్యాహ్నం పరిశీలించారు. దుండగుల ఆచూకీ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ చోరీ అంతర్రాష్ట్ర ముఠా పనేనని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఒకటి విఫలమై.. మరొకదాని వద్దకు

కడప నగరంలో రెండు ఏటీఎంలలో చోరీకి యత్నించిన దుండగులు ఒకచోట ఏటీఎం మిషన్‌ను పగులగొట్టి రూ.6,19,300 నగదు దోపిడీ చేశారు. శనివారం అర్ధరాత్రి 12.40 గంటల ప్రాంతంలో దుండగులు కారులో విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్దకు వచ్చారు. ఎస్‌బీఐ ఏటీఎంలోకి ప్రవేశించి చోరీకి యత్నించారు. లోపల రూములోని డోరు తెరిచే ప్రయత్నంలో అలారం మోగడంతో పరారయ్యారు. తర్వాత ద్వారకానగర్‌లోని రైతు బజారు సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి తెల్లవారుజామున 2-3 గంటల సమయంలో ప్రవేశించి కట్టర్లతో మిషన్‌ను కట్ చేసి రూ.6,19,300 నగదును దొంగిలించారు. దుండగుల కోసం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో గాలింపు చర్యలు చేపట్టారు.



అనంతపురం జిల్లా రేకలకుంట వద్ద ప్రమాదంలో నుజ్జయిన ఇన్నోవా వాహనం

రహదారులు రక్తసిక్తం

అనంతపురం, తిరుపతి జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు.. ఏడుగురు దుర్మరణం, ఎనిమిది మందికి గాయాలు

నార్పల వద్ద ఇన్నోవాను ఢీకొన్న లారీ.. నలుగురు యువకులు మృతి, ఒకరికి గాయాలు

చిల్లకూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ప్రమాదంలో చిన్నారి సహా ముగ్గురు మృత్యువాత



బొలిశెట్టి పవన్, శ్రీనివాసులు, ముస్తాక్, యర్రగుడి పవన్

బుక్కరాయసముద్రం/చిల్లకూరు, సెప్టెంబరు 22: రాష్ట్రంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో రహదారులు రక్తసిక్తమయ్యాయి. అనంతపురం జిల్లాలో స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని వస్తున్న నలుగురిని మృత్యువు లారీ రూపంలో కబళించింది. నెల్లూరు జిల్లాకు చెందిన మూడు కుటుంబాలు అరుణాచలం వెళ్లి వస్తుండగా తిరుపతి జిల్లాలో ఆగి ఉన్న లారీని వారు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. అనంతపురం నగర పరిధిలోని స్టాలిన్‌నగర్ కాలనీకి చెందిన యర్రగుడి పవన్, కురుబ శ్రీనివాసులు, ముస్తాక్, బలిజశెట్టి పవన్ స్నేహితులు. శనివారం ముస్తాక్ పుట్టిన రోజు కావడంతో నలుగురూ వేడుకలు చేసుకున్నారు. బలిజశెట్టి పవన్ నానమ్మ ఇంటికి వెళ్లేందుకు ఇన్నోవాలో అనంతపురం నుంచి నార్పల బయలుదేరారు. బుక్కరాయసముద్రం మండలం రేకలకుంట గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వారి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవా నడుపుతున్న శ్రీనివాసులు(26), ముస్తాక్(25), యర్రగుడి పవన్ (25), బలిజశెట్టి పవన్(26) అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ తాతయ్యకు గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వ్యక్తి ప్రమాదాన్ని గమనించి 100కి ఫోన్ చేసి, సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు ప్రమాదస్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. లారీ వేగంగా ఢీకొనడంతో మృతుల శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. శరీర భాగాలు తెగిపోయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. శ్రీనివాసులు శరీరం రెండు ముక్కలైంది. మృతదేహం వాహనంలోనే ఇరుక్కుపోయింది. పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో లారీలో ఇరుక్కున్న ఇన్నోవా వాహనం, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాలను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎవరికీ వివాహం కాలేదు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. తిరుపతి జిల్లా చిల్లకూరులో ఆదివారం తెల్లవారుజామున ఆగివున్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం కాకుపల్లికి చెందిన గోనెల బాబు(50), గోనెల లక్ష్మమ్మ, గోనెల మాధవి, గోనెల కిషోర్‌బాబు, నెల్లూరు వనంతోపునకు చెందిన వడ్ల జశ్వంత్, పచ్చిపులుసు రాధాకుమారి, వడ్ల కళ్యాణి, వడ్ల వెన్నల మేఘన(8), నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన వాయిగండ్ల సునీల్‌కుమార్, నెల్లూరుకు చెందిన జగదీశ్వర్(45) కారులో అరుణాచలం వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చిల్లకూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో బాబు, వెన్నల మేఘన, జగదీశ్వర్ మృతి చెందగా లక్ష్మమ్మ, కళ్యాణి, మాధవి, రాధాకుమారి, సునీల్‌కుమార్, కిషోర్‌బాబు, జశ్వంత్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెప్పపాటులో ముంచెత్తింది!

» విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చిన ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాల విద్యార్థులు

» జల తరంగిణి జలపాతం వద్ద హఠాత్తుగా వర్షం

» ఎగువ నుంచి ఒక్కసారిగా వచ్చిన వరద

» తేరుకునే లోపే కొట్టుకుపోయిన ఐదుగురు

» ఇద్దరిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

» మరో ముగ్గురి కోసం కొనసాగుతున్న గాలింపు



చింతకుంట్ల హరదీప్, బాలి అమృత, కొసిరెడ్డి సౌమ్య

మారేడుమిల్లి, సెప్టెంబరు 22: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతంలోని జలతరంగిణి జలపాతంలో ఐదుగురు వైద్య విద్యార్థులు కొట్టుకుపోయారు. వారిలో ఇద్దరిని అగ్నిమాపక సిబ్బంది కాపాడగా, మిగతా ముగ్గురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఏలూరు జిల్లా ఏలూరు ఆశ్రమ్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న 13 మంది విద్యార్థులు ఆదివారం మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చారు. జల తరంగిణి జలపాతం వద్దకు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో చేరుకున్నారు. అక్కడ స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం పడింది. అప్పటికే ఎగువ ప్రాంతాల్లో వర్షం కురవడంతో కొండలపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా రావడంతో విద్యార్థులందరూ బయటికి వచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వారిలో గాయత్రి పుష్ప, చింతా హరిణి ప్రియ, కె.సౌమ్య, బి.అమృత, సీహెచ్ హరదీప్ కాలవలోకి కొట్టుకుపోయారు. వీరిలో గాయత్రి ప్రియ, హర్షిణి సమీపంలోని కాజ్‌వేవద్ద సిమెంట్ తూరల్లో చిక్కుకుపోగా మారేడుమిల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. గల్లంతైన ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన చింతకుంట హరదీప్(20), విజయనగరం జిల్లాకు చెందిన కొసిరెడ్డి సౌమ్య(21), బాలి అమృత (22) కోసం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. వర్షం ఎక్కువగా కురుస్తుండడం.. చీకటిపడటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలిగింది. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఈ ఘటనపై మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.



సీతారాం ఏచూరి సంతాప సభకు హాజరైన వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

ప్రజల హక్కుల కోసం పోరాడిన ఏచూరి

» ఆయనకు అధికారం కంటే సిద్ధాంతాలే ముఖ్యం

» సంతాప సభలో కొనియాడిన వక్తలు

విజయవాడ(గవర్నర్‌పేట), సెప్టెంబరు 22: అధికారం కాదు, సిద్ధాంతాలే ముఖ్యంగా పనిచేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కొనియాడారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే)లో నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ దేశం ఓ గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. తాడిత, పీడిత ప్రజల హక్కుల కోసం ఏచూరి అవిశ్రాంత పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన తెలుగువాడు కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాసంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై పోరాటం: యూటీఎఫ్


అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీ పోరాటం చేపట్టనున్నట్టు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి అక్టోబరు 24 వరకు వివిధ దశల్లో పోరాటం ఉంటుందన్నారు. మున్సిపల్‌లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల అప్‌గ్రేడేషన్, పీఎఫ్, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.


భారత దేశంలో పుస్తకమే కవిని రాస్తుంది!

"తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది" అని తిరుపతి వేంకట కవులు అన్నారు కానీ, తెలుగు ఒక్కదానికే కాదు, మొత్తంగా భారతదేశానికే దీపాల 'కొరత' బాగా ఉన్నట్టుంది. అందులో పెద్ద కొరత చరిత్రదీపం. మనకు చరిత్రలు రాసుకోలేదని, చారిత్రక దృష్టి లేదని, ఇంగ్లీషువాడు వచ్చే దాకా మన గురించి మనం తెలుసుకోనేలేదని బాధపడడం మన ఆధునిక ఆత్మవిమర్శలో ఒక అనివార్య అధ్యాయం. సాధారణ చరిత్ర రంగంలోనే అంతటి చీకటి ఉందనుకుని బాధపడితే, ఇక సాహిత్యచరిత్ర సంగతి చెప్ప నక్కరలేదు. కావలి వేంకట రామస్వామి, గురజాడ శ్రీరామ మూర్తి, కందుకూరి వీరేశలింగం కంటె ముందు మన కవుల గురించి 'కథలు' చెప్పుకోవడమే తప్ప, చరిత్రలే లేవు. పైన చెప్పిన ముగ్గురూ కూడా కవులజీవన రేఖలూ కవిజీవితాలూ కవుల చరిత్రలూ తప్ప సాహిత్య 'చరిత్ర' రాసినవారు కాదు. బ్రిటిష్ వారు రాకముందు "మనకు చరిత్ర అంటే బయోగ్రఫీయే" అంటారు వెల్చేరు నారాయణరావు. సాహిత్యచరిత్రరచన గురించి ఈ మధ్య ఆయనను (నేను, కరుసాల వెంకటేశ్ కలిసి) ఇంటర్వ్యూ చేసినప్పుడు వెల్చేరు కీలకమయిన, మౌలికమయిన కొన్ని వ్యాఖ్యలు చేశారు. వ్యక్తి కథ మాత్రమే అయిన చరిత్ర భావనను దేశానికి, ప్రాంతానికి, రంగానికి కూడా అన్వయించి విస్తరించారని ఆయన అన్నారు. "దేని చరిత్రను రాయాలో ముందు దాన్ని తెలుసుకోవాలి. ఏ వస్తువు చరిత్ర రాస్తారో ఆ వస్తువును తయారుచేయాలి." అని ఆయన అన్న మాట ఎంతో లోతైనది. బహుశా, ఆయన ఉద్దేశ్యంలో, వస్తువు అంటే, కథావస్తువు లాంటి చరిత్రవస్తువు. దేని చరిత్ర అయినా రాయడానికి ముందు దాన్ని 'భావించాలి'. భావించడం అంటే, కల్పించడం, ఊహించడం, పరికల్పన చేయడం, ఇమాజిన్ చేయడం. ఇప్పుడు మనం చూస్తున్న సాహిత్యచరిత్రల వంటివి రాయాలన్న ఊహ, భావన, 19వ శతాబ్దానికి ముందు రాలేదు. పరికల్పనలు అకాలంగా, కాలాతీతంగా ఉండవు.

తెలుగు సాహిత్యచరిత్రల పరిణామం, రచనాపద్ధతి గురించి తెలుసుకోవాలన్న నా కొత్త ఆసక్తి తగినట్టుగా, ఎంతో అనువుగా ఈ మధ్య తారసపడినవి వెల్చేరు నారాయణరావు రెండు కొత్త పుస్తకాలు. "తెలుగు సాహిత్యం-కొత్తకోణాలు", "సంస్కృతి, భాష, చరిత్ర". ఈ పుస్తకాలను "ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)" ప్రచురించింది. ఇందులో మొదటి పుస్తకంలో కేవలం నారాయణరావు ఒక్కరే రాసినవి, రెండోదానిలో ఆయన డేవిడ్ షూల్మన్, సంజయ్ సుబ్రహ్మణ్యం, పరుచూరి శ్రీనివాస్, పప్పు నాగరాజుల భాగస్వామ్యంతో రాసినవి వ్యాసాలు ఉన్నాయి. వివిధ సాహిత్య సందర్భాలలో రాసిన ఈ వ్యాసాలలో అన్నిటిలో కాదు కానీ, ఎక్కువ వాటిలో సాహిత్యచరిత్ర మీద, సాహిత్య చరిత్ర గురించి చేసిన వ్యాఖ్యలు, ప్రతిపాదనలు ఉన్నాయి. నిజానికి "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం" దగ్గర నుంచి వెల్చేరు చేస్తూ వచ్చిన సాహిత్య ప్రయత్నం అంతా ఏదో ఒక రకంగా "ప్రధాన స్రవంతి సాహిత్యచరిత్ర"ను విమర్శనాత్మకంగా చూస్తూ, ఒక ప్రత్యామ్నాయ చరిత్రను నిర్మించడమే.

"భారతీయులకు చారిత్రక స్పృహ లేదనీ, మంచికో, చెడుకో వలస పాలకుల వల్ల చరిత్ర రచన మనకు అబ్బిన కొత్త లక్షణమనీ





రచయిత పుస్తకం రాస్తాడు, పాఠకుడు చదువుతాడు, ఈ పుస్తకానుభవ క్రమమే ఆధునికులు చాలా మంది ఆలోచనలో ఉందని, కానీ భారతదేశంలో పుస్తకమే కవిని రచిస్తుందని వెల్చేరు సూత్రీకరిస్తారు.

వున్న అపోహను తొలగించడమే" తమ ఉద్దేశ్యమని వెల్చేరు, ఆయన సహరచయితలు చెబుతారు. అట్లాగని, వలసపాలకుల చరిత్రదృక్పథం, రచనాపద్ధతి భారతీయులకు ఎప్పటి నుంచో తెలుసుననే చెప్పే బాపతు ధోరణి కాదు ఇది. వీరి ప్రకారం, పాశ్చాత్య చరిత్ర రచన ప్రమాణాలతో మనకు ఉన్న మౌలికమైన వ్యత్యాసాలను గుర్తించగలిగితే, దక్షిణ భారత చారిత్రక రచనలను గుర్తించగలం. దక్షిణ భారతంలో చరిత్ర ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సాహిత్య ప్రక్రియ కాదు. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ఆ కాలంలో ఏ సాహిత్య ప్రక్రియ ప్రాచుర్యంలో ఉంటే ఆ ప్రక్రియలోనే చరిత్ర రచనలు కూడా సాగాయి.

మరి సాహిత్యచరిత్ర? మనం అనుకుంటున్న సాహిత్య చరిత్ర కూడా "వలసపాలన ద్వారా వచ్చిన పాశ్చాత్య విద్య". ఆ కోవలో కవులు, రచయితల స్థలకాలాలు, వారి పోషకుల వివరాలు తెలుసుకోవడానికి పండితులు పడిన కష్టం మీద వెల్చేరుకు గౌరవం లేకపోలేదు. కానీ, సాహిత్యచరిత్ర అంటే అది కాదు. "ఏ పుస్తకం ముందు వచ్చిందో, ఏ పుస్తకం తరువాత వచ్చిందో చెప్పుకుంటూ కూర్చోవడం సాహిత్యచరిత్ర కాదు. అలాంటి చరిత్ర మనకి లేకపోయినందుకు మనం విచారించక్కర్లేదు" అంటారాయన. కవి, గ్రంథం, పాఠకులు, ఈ మూడు అంశాల మధ్య సంబంధాన్ని తెలుసుకోవడం సాహిత్యచరిత్రకు ముఖ్యం. రచయిత పుస్తకం రాస్తాడు, పాఠకుడు చదువుతాడు, ఈ పుస్తకానుభవ క్రమమే ఆధునికులు చాలా మంది ఆలోచనలో ఉందని, కానీ భారతదేశంలో పుస్తకమే కవిని రచిస్తుందని వెల్చేరు సూత్రీకరిస్తారు. పుస్తక స్వభావం బట్టి, కవులను ఊహించుకోవడం మన పద్ధతి. వాస్తవం ఉండవచ్చు, లేకపోవచ్చు, కానీ, కవుల కథలన్నీ వారి రచనల్లో కనిపించే వ్యక్తిత్వానికి అనుగుణంగా కల్పితమవుతాయి. కవులను, ఆర్షకవులు, కావ్యకవులు, భక్తికవులు, చాటుకవులు అని నాలుగురకాలుగా వర్గీకరించి, వారి పుస్తకాల ఆధారంగా పాఠకుల ఊహల్లో కవి ఎట్లా రూపొందుతాడో వివరిస్తారు.

బ్రిటిష్ వలసపాలన భారతీయ భావప్రపంచం మీద వేసిన మార్పు మీద విమర్శలో భాగంగా వెల్చేరు సాహిత్యచరిత్ర ప్రతిపాదనలు చేస్తారు. వలసపాలన తెచ్చిన ఆధునికత వల్ల వివిధ భావరంగాలలో ప్రధాన కథనాలు రూపొందాయి. ఆధునిక చరిత్ర వలసవాద ఆధునికత ఫలితమే కాబట్టి, భారతీయులు తమ గతాన్ని చూసే పద్ధతి అదే దారిలో తయారయింది. అయితే, వలసపాలనకు ముందే ఆధునికత మన దగ్గర రూపొందడం మొదలయిందన్న ప్రతిపాదనను వెల్చేరు బలపరుస్తారు. వలసవాద ఆధునికత అలవరచిన చూపును విదిలించుకుని, వలస పూర్వ భారతదేశాన్ని వలసపూర్వ దృష్టితోనే చూడడానికి ఉన్న అవకాశాలను చర్చిస్తారు. మన పూర్వ సాహిత్యాన్ని, నాటి



దృష్టితోనే అర్థం చేసుకోవాలని అంటారు. కొన్ని బాహ్య పరిస్థితులను ప్రభావాలను పరిగణనలోకి తీసుకుంటూనే, సాహిత్యంలో అంతర్గత సాక్ష్యాల ద్వారా, వాచక పరీక్ష ద్వారా కొత్త వ్యాఖ్యానాలను అందిస్తారు. 15, 16 శతాబ్దాల కాలం నుంచి, తెలుగు ప్రాంతాలలో వచ్చిన రాజకీయాలలో, పాలకశ్రేణులలో వచ్చిన మార్పులు, కొత్త జీవనవిధానాన్ని తెచ్చాయని, అది సాహిత్యంలో ప్రతిఫలించిందని ఆయన ప్రతిపాదించారు. మునుపు అధికారానికి, సంపదకు ఎడంగా ఉన్న 'ఎడమచేతి' కులాలు ఆ కాలంలో ప్రాబల్యం సంపాదించుకున్నాయని, అప్పటి నుంచే మనదైన ఒక ఆధునికత రూపొందుతూ వస్తోందని ఆయన చెబుతారు. అందులో కరణాలు ముఖ్య పాత్ర నిర్వహించారని, ఆధునిక తెలుగుకు వారి లేఖనంలోనే పునాదులున్నాయని ఆయన అంటారు. ఆయన దృష్టిలో, ఆస్థానాల నుంచి స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చిన పద్యమే చాటువు, అది తక్కువ రకం సాహిత్యం కాదు. గురజాడ అప్పారావులో కనిపించిన ఆధునికత తాను చెబుతున్న దేశీయ ఆధునికత కొనసాగింపేనని, కందుకూరి వీరేశలింగం లాగా గురజాడ వలసవాద ఆధునికుడు కాదని వెల్చేరు వాదన. 'కన్యాశుల్కం' నాటకంలో ఆయన దేశీయ ఆధునిత వైపు నుంచి వలసవాద ఆధునికతను హేళన చేశాడని లేదా విమర్శించారని ఆయన ఉద్దేశ్యం. క్షీణ యుగంగా పరిగణించే నాయకరాజుల కాలాన్ని సాహిత్యం వైవిధ్యంతో వికసించిన కాలంగా ఆయన అంటారు.

తెలుగుకు సేవ చేశాడని చెప్పే బ్రౌన్ గ్రంథ పరిష్కరణల పేరుతో అనేక ప్రాచీన గ్రంథాలను సవరించాడని, ఇక్కడి పుస్తక సంస్కృతి బ్రౌన్‌కు అర్థం కాలేదని వెల్చేరు అంటారు. అచ్చు యంత్రం వచ్చే దాకా, పుస్తకానికి తప్పనిసరిగా ఒకే కర్త ఉండవలసిన అవసరం లేదని, మౌఖికంగా మాత్రమే ఉనికిలో ఉండే సాహిత్యానికి స్థిర రూపం ఉండదని, నిరంతరం రూపొందుతూనే ఉంటుందని ఆయన చెబుతారు. సుమతిశతకం బ్రౌన్ ప్రతితో, వావిళ్ల వారి ప్రతిని పోలుస్తూ వెల్చేరు, పరిష్కరణలో భాషా సాంస్కృతిక సవరణలు ఎట్లా ఉంటాయో, ఎక్కువ మంది నోళ్లలో ప్రాచుర్యం పొందే పద్యం ఎట్లా సరళం అవుతుందో ఉదాహరణలతో సహా వెల్చేరు వివరించారు. నీతిశతకాలను వాటిలో చెబుతున్న సాంఘిక నీతిని చర్చించి, దేశకాలాదులను అన్వయించిన తీరు ఆసక్తికరంగా ఉంది. గిడుగు రామమూర్తి, చిన్నయసూరి, కావలి రామస్వామి, బ్రౌన్ వీళ్లందరి గురించీ మనకు తెలిసిందాన్ని వదిలించుకుని, కొత్తగా అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు ప్రేరేపిస్తాయి. ఆధునిక కవుల గురించి కూడా ఈ పుస్తకాలలో వ్యాసాలు ఉన్నాయి. ఎవరూ చూడని కోణాలను వెల్చేరు చూపిస్తారు.

ప్రస్తుతం సాహిత్యచరిత్రల మీద వస్తున్న విస్మరణ విమర్శలు కూడా వెల్చేరు చర్చించకుండా పోలేదు. ప్రాబల్య శ్రేణుల నుంచి వచ్చిన రచనలతోనే సాహిత్య చరిత్రలు ఏర్పడుతున్నాయని ఆయన అంగీకరిస్తారు. "సాహిత్యచరిత్ర కారులందరూ ఉన్న పుస్తకాల కథలు రాశారు.. కానీ, అణచివేయబడ్డ వర్గాలకు ఏ రకమైన సాహిత్యం వుంది, ఆ సాహిత్యం ఎన్ని రూపాలుగా, ఏయే కాలాలలో అణచివేయబడింది అనే విషయం బయటకు వచ్చే పద్ధతిలో సాహిత్యపు ప్రశ్న ఎవరూ వేసుకోలేదు", ఈ మాట ఆయన 1990లో అన్నారు కానీ, ఆ తరువాత ఆ ప్రశ్న చాలా మంది వేసుకున్నారు. విషయం ఎంత బయటకు వచ్చిందనేది వేరే విషయం.

కాలక్రమానుగత పద్ధతిలో రాసిన వ్యాసాలు కావు కాబట్టి, సాహిత్యచరిత్రలు చదివిన అలవాటున్నవారికి, ఈ పుస్తకాలు చదివాక, సమాధానపడలేని చాలా ప్రశ్నలు మిగిలి ఉంటాయి. వెల్చేరు ఆలోచనలను ఎంత వరకు స్వీకరించాలో తేల్చుకోలేనంతగా, ఆయన ప్రత్యేకమైన పరిశీలనాదృష్టి పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఆ దృష్టిని అలవరచుకోవాలన్న కుతూహలం కలుగుతుంది. కానీ, ఆ చూపు కేవలం అభిరుచి కాదు, ఎంతో అధ్యయనం, పరిశ్రమ కలగలసిన విద్య?

■ కె. శ్రీనివాస్

బొమ్మలు: అక్బర్

'సబ్బని సాహిత్య వ్యాసములు'

సబ్బని లక్ష్మీనారాయణ రాసిన సాహిత్య వ్యాసాల పుస్తకం ఆవిష్కరణ సభ సెప్టెంబర్ 23 సా.5.30నిమిషాలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో కె.వి. రమణాచారి, బైస దేవదాస్, మామిడి హరికృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి, దార్ల వెంకటేశ్వరరావు, సంకెనపల్లి నాగేంద్ర శర్మ తదితరులు పాల్గొంటారు.

మానస ఆర్ట్ థియేటర్స్

ఉడాలి నరసింహశాస్త్రి వైదుష్యం

'డా. ఉడాలి నరసింహశాస్త్రి వైదుష్యం' గ్రంథావిష్కరణ సభ సెప్టెంబర్ 29 ఉ.10.30నిమిషాలకు శ్రీరేబాల లక్ష్మీనరసారెడ్డి (జూ.) స్మారక భవనం, ట్రంక్ రోడ్, నెల్లూరులో జరుగుతుంది. సభలో ఉడాలి వెంకట నరసింహ రవి, విశపు బాలసుబ్రహ్మణ్యం, చింతలపాటి పూర్ణానంద శాస్త్రి, ఉడాలి మహాలక్ష్మి తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 99890 05369.

పొన్నాల రామసుబ్బారెడ్డి

'లోపలి వాన' కవితా సంపుటి

కుడికాల వంశీధర్ 'లోపలి వాన' కవితా సంపుటి ఆవిష్కరణ సభ సెప్టెంబర్ 29 ఉ.10గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఎన్. గోపి, సూర్యా ధనుంజయ్, ఎస్. రఘు, గిన్నారపు ఆది నారాయణ తదితరులు పాల్గొంటారు.

మద్దాళి రఘురాం

విమలా శాంతి కవితా పురస్కారం

విమలా శాంతి కవితా పురస్కారానికి 2024కి గాను 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి' కవితా సంపుటి రాసిన లేదాళ్ల రాజేశ్వరరావు ఎంపికయ్యారు. అక్టోబర్ 20న అనంతపురంలో జరిగే సభలో ఆయన పురస్కారంతో పాటు రూ.10వేల నగదు బహుమతిని స్వీకరిస్తారు.

శాంతి నారాయణ

సాంఘిక నవలల పోటీ

పిడపర్తి వెంకటరమణ శర్మ జ్ఞాపకార్థం కౌముది వెబ్ మాస పత్రిక నిర్వహిస్తున్న 2025 ఉగాది సాంఘిక నవలల పోటీలో మూడు ఉత్తమ నవలలకు ఒక్కొక్క నవలకూ రూ.25వేలు, మూడు సాధారణ నవలలకు ఒక్కొక్క నవలకు రూ.15వేలు బహుమతులు అందిస్తారు. నవలలను తెలుగులో టైప్ చేసి (యూనికోడ్ లేదా అనుఫాంట్స్) లేదా స్కాన్ చేసి ఈమెయిల్లో మాత్రమే పంపాలి. నిడివి, మరిన్ని వివరాల కోసం www.koumudi.net వెబ్‌సైట్ చూడవచ్చు. నవలలను డిసెంబర్ 31లోగా novels2025@koumudi.netకు ఈమెయిల్ చేయాలి. ఫలితాలు మార్చి 2025లో వెబ్‌సైటులో ప్రకటిస్తారు.

కిరణ్ ప్రభ

శిశువు చిత్రనిద్ర

సముచిత హింస అహింసేనా?
ధర్మ మీమాంస ఎప్పుడూ చేతిలోని జిగురు చర్మపు చేపే
fish out.. తప్పించుకుని నీటిలోకి అంతర్ధానమైపోవడం
ఆత్మ రక్షణే.. తా మించిన ధర్మం లేదు...
శిరోఖండనే గణరాజ్య సిద్ధాంతం
గుర్రపు డెక్కల ఎర్రని ధూళి, మహోగ్రారణ్యాలు
విస్ఫోటించే రక్తపు నదులు
చరిత్ర ఎప్పుడూ నెత్తుటితడిని అద్దుకుంటూ
లిఖించబడ్తూంటుంది
శత్రువును జయించి అంతఃపురకాంతలతోసహా
సకలసంపదలనూ గుంజుకుని అనుభవించడమే
'రాజధర్మ'మౌతున్న వేళ
నిర్వచనాలను మార్చుకుంటూ మార్చుకుంటూ
న్యాయం, ధర్మం, శాస్త్రం, ఆక్రందనలు... అన్నీ నిశ్శబ్దిస్తూ
ఆస్థానాల్లో మేధావులు తలలు వంచుకుని
సిగ్గుతో కుంచించుకుపోతున్నపుడు
కేవలం శారీరక మరణాలే కాదు
సౌప్తిక పర్వంలో శూన్యహత్యలు కూడా జరుగుతాయి
అన్నీ కరవాలదంష్ట్రలే.. హరోంహరహర

2

ఆదిమయుగంనాటి మనిషి
ఒక సారించిన ధనువు.. ఒకటే బాణం ఒకటే లక్ష్యం
జీవితం సరళ సమీకరణం
రణమో... మరణమో
ట్రిగ్గర్‌పై వేలును
ఒక 'జి కోడ్' ఉగ్రావేశం శాసిస్తుంది..
లక్ష్యం మాత్రం విధ్వంసమే
అన్నీ ముఖాలపై నవ్వులను చిందే రాజకీయ పాచికలే
ఎప్పుడు ఎక్కడ ఆకాశాన్ని చించుకుని
మహాసముద్రాలు కురుస్తాయో తెలియదు
కన్నుతెరిచే రెప్పపాటులోనే
ద్వారక సముద్రగర్భంలోకి కూరుకుపోతుంది
గాంధారిశాపం యుగాంతంకోసం వ్యూహించబడ్డ
కృష్ణుని రిక్తాదేశం
ఒకరు ఇంకొకరై ప్రత్యయిస్తారు
ఎప్పుడు ఎవరికోసం ఎవరు
కాలుతున్న కాగితంపై రాయబడ్డ
అక్షరాయుధాలౌతారో తెలియదు
కాలం గర్జిస్తూ ప్రవహించే అనంతాకాశమేనని.. ఉవాచ

3

మనుషుల వేషభాషలుమారుతాయి
వ్యూహాలు పొటమరిస్తున్నపుడు
అనుభూతులూ ప్రత్యనుభూతులూ మారుతూ
విందుల్లో విషాన్ని తినిపిస్తాయి
రహస్యప్రపంచాలు నిరాకారంగానే రాజకీయాలను కప్పుకుని
నిన్నటి రణభూమిని ఇవ్వాళ్టి ఆరోవేలుగా మారుస్తాయి
అంతిమంగా
'ఒక్కడు చచ్చు... మరియొకడుచంపుననుమాట పొరపాటు
ఆ భ్రాంతి విడువు' గీతా ప్రవచనంతో
శాంతి పర్వంలో.. అనంత అశాంతి విస్తరిస్తూంటుంది
చివరికి come and go అంతే.. అదే జీవితం

■ రామా చంద్రమౌళి
✆ 93901 09993







3? మూడు ప్రశ్నలు |

■ సోలోమోన్ విజయ్ కుమార్



ఉనికి చాటే రాతలు నావి!

ఇటీవల తెచ్చిన మీ మొదటి నవల 'సన్ ఆఫ్ జోజప్ప' గురించి చెప్పండి? మొదటిసారి నవల రాసిన అనుభవం ఎలా వుంది?


నవలలోని 'పిల్లోడు' నా ఈడువాడు. ఇద్దరం ఒకే వీధివాళ్లం. మగపిల్లల్తో కలవకుండా ఆడపిల్లల్తో ఆడుతూ కనబడేవాడు. చిన్నతనం నుంచి కూడా పరధ్యానంగా, భయం భయంగా ఉండేవాడు. టీనేజీకి వచ్చాక అందరికీ వాడేంటో పూర్తిగా తెలిసింది. ఎవరూ వాడిని వాడిలాగా స్వీకరించలేదు. వాడి మానాన వాడ్ని బతకనివ్వనూ లేదు. రోజూ ముఖాన నవ్వడాలు, అవమానాలూ వాడ్ని మరింతగా ముడుచుకుపోయేలా చేశాయి. తన ఇరవయ్యో ఏట ఉరి వేసుకుని చనిపోయాడు. నేను ఈనాటికీ బాధపడి దుఃఖపడే నా ఊరి మనుషుల్లో వాడొకడు. ఆ బాధ, దుఃఖాలే 'సన్ ఆఫ్ జోజప్ప' నవలకు నేపథ్యం అయ్యాయి. అయితే నవలలో వాడు చనిపోయాడని నేను డైరెక్ట్‌గా చెప్పలేదు. వాడు ఎప్పుడు కన్నీరుపెడితే అప్పుడు వచ్చి చేతులు చాచి వాడ్ని చంకనెత్తుకొనే ఊహాలోకపు తండ్రి 'జోజప్ప' నవల ఆఖరులో చీకటి రాత్రి వీధి చివరన నిలుచుకొని చేతులు చాపుతాడు. వాకిట నిలుచుకొని చూసిన పిల్లోడు ఆయన కనపడిన ప్రతిసారిలాగానే (ఆయన చంకన ఎక్కేందుకు) అడుగు ముందుకు వేస్తాడు. అక్కడితో నవల ముగుస్తుంది. అలాగ వాడు 'శాశ్వతంగా జోజప్ప చంకనెక్కాడని' చెప్పకనే చెప్పాను. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే వాడిని కొందరు పాఠకులు ట్రాన్స్ జెండర్‌గా పొరబడ్డారు. కాదు వాడు 'గే' అని అతికొద్దిమంది పాఠకులే గ్రహించగలిగారు. వాడు చనిపోయినప్పటికీ నవల "అ సమాప్తం" అన్నాను. ఎందుకంటే మీలోనో నాలోనో మన ఇళ్లల్లోని ఎవరోఒకరిలోనో 'పిల్లోడు' దాగి లేడని, ఉండబోడని కచ్చితంగా చెప్పగలమా? ఇక మొదటి నవల రాసిన అనుభవం గురించి అడిగారు కదా, "The only book that is worth writing is the one we don't have the courage or strength to write. The book that hurts us (we who are writing), that makes us tremble, redden, bleed" అన్నారు ప్రముఖ ఫ్రెంచ్ రచయిత్రి Helene Cixous. కత రాయడం ద్వారా రెండు మూడు పేజీల్లో అనుభవించే Trembling, Reddening, bleeding నవల రాయడం ద్వారా వంద పేజీల్లో అనుభవించినట్టయ్యింది.

హోమోసెక్సువల్ ఇతివృత్తంతో సాగే ఈ నవలలోని కథనం ప్రధాన పాత్ర అనుభవాలను ఉన్నదున్నట్టు నిస్సంకోచంగా చెబుతుంది. రాస్తున్నప్పుడు ఇతివృత్తాన్ని, భాషనీ పాఠకులు స్వీకరిస్తారా లేదా అనే ఆలోచనలు ఏమైనా కలిగేవా?

హోమోసెక్సువల్ అనే కాదు అది ఏదైనా కానీయండి ఉన్నది ఉన్నట్టు నిస్సంకోచంగా ఎందుకు చెప్పకూడదు? బతుక్కి ముసుగేసి, సోకాల్డ్ సాహిత్యానికీ ముసుగేసి మనం సాధించే ప్రయోజనం ఏముంటుంది? ముసుగేసింది సాహిత్యం ఎట్లా అవుతుంది? మోసం అవుతుంది కానీ! ఏదైనా ఆకాశం నుంచి ఊడిపడిన అద్భుతం ఉందనుకోండి, దాన్ని చెప్పడానికైనా ఉపయోగించాల్సింది మనం ఎరిగిన భాషనే కదా? ఆకాశం నుంచి పడింది కాబట్టి 'ఆకాశ భాష' అంటూ ప్రత్యేకంగా తయారు కావాలంటే కుదురుతుందా? ఒకవేళ తయారు చేసినా పొసగుతుందా? ఒకటి చెప్పగలను, నా రాతల్లో మేధావినో సంస్కారినో నీతి బోధకుడినో వెతకబూనడం వృథా ప్రయాస. ఎందుకంటే రాసే ప్రక్రియ ఏదైనా నోరులేనివాళ్ల చెప్పుకోలేనివి, నోరున్నవాళ్ల చెప్పేందుకు అసహ్యపడేవే విధిగా ఎంచుకుంటాను. నా రచనలకి కేంద్రం అటువంటి చీకటి లోకమే. అక్కడి భాషని, ఇతివృత్తాలని సోకాల్డ్ వెలుతురి ప్రపంచం తట్టుకోలేకపోవచ్చును. కానీ ఆ చీకటిలోకం ఎక్కడో లేదనీ, మీ మధ్యనే చాలాసార్లు మీ లోపలనే- కోరలు చాస్తూ ఉంటుందనే పచ్చి నిజాన్ని 'ముసుగుబుద్ధితో' మీరు అంగీకరించక అందుకు గింజుకుని నన్ను తప్పుపట్టడం ఏమి న్యాయం? పాఠకుల స్వీకారం గురించి అడిగారు కదా, వెలుగుచూడని జీవితాలను రాయడం ద్వారా వాటి ఉనికిని చాటాలి అనే ఉద్దేశం తప్ప మరొక యావ నాలో లేనప్పుడు 'తరువాత ఏమిటి రాయడం' అనే ఆలోచన ఉంటుంది కాని రాసి బైటకు వెళ్లిపోయిన రచనను పట్టుకొని వేలాడడం ఉండదు. దాని మీద మీరు దుమ్మెత్తిపోయండి గాక! దానికి విలువ అనేది ఉంటే మట్టిపొరల కింద ఎన్నాళ్లైనా నిక్షేపం లాగా నిలిచి ఉంటుంది కనుక 'రేపటివాడు' ఎవడో తవ్వి తీసి చదువుకుంటాడు. విలువ అనేదే లేదా? ఆ మట్టిలోనే చివికి మట్టైపోతుంది. ఇప్పటివరకూ ఏ రచయిత అయినా వాస్తవంలో అంతకుమించి మూట కట్టుకున్నది ఏమైనా ఉందా?

మీ మొదటి పుస్తకం 'మునికాంతపల్లి కత'ల్ని కొందరు కథలుగా చూడలేదు దీనిపై మీ స్పందన? మీ తర్వాతి రచన ఏమిటి, అది కూడా మొదటి రెండు పుస్తకాల్లాగే సువర్ణముఖి నది ఒడ్డునే జరుగుతుందా?

అవును 'మునికాంతపల్లి కత'ల్ని లంజ కతలు, లంజల భాష అన్నాడొక ప్రముఖ రచయిత. 'సన్ ఆఫ్ జోజప్ప' నవలని యాక్ థూ అన్నాడొక పెద్దమనిషి. పచ్చి బూతుల నవల చదివాను తల తిరిగిపోయింది అన్నది ఒక అమ్మ. ఎవరి నోరైనా వారి అవగాహనా స్థాయిని బట్టే మాట్లాడుతుంది. ఐరిష్ రచయిత Samuel Beckett "ఎప్పుడైనా ప్రయత్నించావా? ప్రయత్నించి విఫలమయ్యావా? పర్లేదు, మళ్లీ ప్రయత్నించి మళ్లీ విఫలమవ్వు. మరింత బాగా విఫలమవ్వు (Fail Better)" అన్నాడు. నా వరకూ రచయితగా పటం కట్టించి పెట్టుకోదగిన మాటలవి. నా రాతలు కూడా అలాంటివే అని చెబుతాను. ఒకదానికంటే మరొకటి మరింత బాగా విఫలమవుతూ ఎటువంటి సాహిత్యపు రీతి రివాజుల్ని పాటించవు నా రాతలు. అవసరాన్ని బట్టి 'ఎంత చెత్తగానైనా' విషయాన్ని చెప్పడమే ముఖ్యంగా భావిస్తాయి కానీ నా రాతల్లోని అట్టడుగు బతుకులు సాహిత్యపు కొలతల్ని, ప్రమాణాలని, భాషా కౌశలాన్ని, వాక్య నిర్మాణాన్ని, ఘనమైన విశేషణాలనీ, సోకాల్డ్ కీర్తి కిరీటాలనీ నమ్మవు, అసలు లెక్కే చేయవు. కాబట్టి మేధావులు నా రాతల్ని దూరం పెట్టడంలో ఆశ్చర్యం లేదు. వాళ్లు దూరం పెట్టారు కాబట్టే "నాకు నేను మిగిలాను". అయితే చదువుకున్న యువత నా రాతల్ని గుండెలకు హత్తుకుంటోంది. అట్టడుగు బతుకుల దైన్యాన్ని, యాసల విలువని ఎరిగిన పెద్దలు కొందరు మనసారా ప్రోత్సహిస్తున్నారు. యూనివర్సిటీ విద్యార్థులు తమ పుస్తకాల అరల్లో ఆంగ్ల సాహిత్యంతో పాటూ నా రెండు పుస్తకాలను సంబరంగా చేర్చుకున్నారు. వాళ్లందరూ 'గే'లు కాకపోయినా 'సన్ ఆఫ్ జోజప్ప' గురించి ఆప్యాయంగా తడిగా ఎంతోసేపు మాట్లాడారు. ఇలా ద్వేషంతో పాటుగా ప్రేమని కూడా అధికంగా సంపాదించుకుంటోన్న 'Fail better' రాతలు నావి. ఇక నా తర్వాత రచన గురించి అడిగారు- కుటుంబసభ్యుల వల్లనే వ్యభిచారంలోకి దించబడిన మైనర్ అమ్మాయి, మొగుడు వదిలేస్తే దిక్కులేక ముష్టెత్తేందుకు తన ఇద్దరు చిన్నపిల్లల్ని రోజూ బస్టాండుకు పంపుకున్న తల్లి, మతపిచ్చితో కాపురాన్ని నరకం చేసుకున్న ఇల్లాలు... ఇలా రాస్తే మా ఊరివాళ్ల కతలే నవలికలు కాగలవు. 'ప్యార్థనలు' పేరిట నేను రాస్తున్న క్రైస్తవ జీవనానికి సంబంధించిన కవితలు సగంలో ఉన్నాయి. అవును ఇవన్నీ మొగిలేరు (సువర్ణముఖి నదికి అసలు పేరు) ఒడ్డుకు చెందిన బతుకు కతలు. వీటిలో ఏది తర్వాతి రచనగా వస్తుందో కానీ చివరగా ఒక మాట చెబుతాను, మీ రెండవ ప్రశ్నకు జవాబులో 'ఉనికి చాటాలి అనే ఉద్దేశం నాది' అన్నాను. అదే నేను నా రాతల ద్వారా చేస్తోంది. ఉనికిని తెలియజేయాలనే తపనని నాగరికతకు పై మెట్టు అన్నారు చరిత్రకారులు. గుహ గోడలపైన వేలిపళ్లకి ముందరి చేతి ముద్రలు, జంతువుల్ని వేటాడే బొమ్మలు అందుకు ఉదాహరణలు. అలాగ, "దిగువ పంట నాడు" (తిరుపతి జిల్లా పరిధిలో నేను పుట్టి పెరిగిన నాయుడుపేట మండలంలోని మొగిలేటి ఒడ్డున చిగురుపాడు గ్రామం దాని చుట్టుపక్కల మండలాలు) బతుకుల ఉనికిని మా యాసలోని పదసంపదతో కతలుగా చెప్పడమే నా 'విఫల' రాతల లక్ష్యం. రూట్స్ ద్వారా అలెక్స్ హేలీ, చెదిరిన సమాజం ద్వారా చినువా అచబే చేసింది అక్షరాలా అదే. ■



సృజనకారుల్లో విధ్వంస వాంఛ ఎందుకు?

"ఇంకెన్ని రాసినా నేను డార్కర్ సైడ్ అఫ్ లైఫ్ గురించే రాస్తాను.... నేను చచ్చిపోయిం తర్వాత ఏమవుతానన్నది అస్తిత్వవాదం ప్రకారం నాకు సంబంధం లేదు. నా రచనలన్నీ నేను బతికుండగానే తగలబెట్టి ఎవడన్నా దాని మీద ఒంటేలుకు పోయినా కూడా నాకేం ప్రాబ్లమ్ లేదు. I wanted to speak out my inner self" - కొద్దిరోజుల క్రితం చనిపోయిన రచయిత కాశీభట్ల వేణుగోపాల్ గురించి మెహెర్ రాసిన వ్యాసం, 'ముసుగుల్ని సహించని అక్షరం' (ఆంధ్రజ్యోతి, 26 ఆగష్టు 2024)లో పేర్కొన్న కాశీభట్ల మాటలు ఇవి. వేణుగోపాల్ మాటల్లో కనిపించేంత అసహనం అసాధారణంగా అనిపించవచ్చేమో గానీ, మైకెలాంజిలో నుంచి, కాఫ్కా, జాయిస్, సిల్వియా ప్లాత్.. ఇంకా ఈ మధ్య మరణించిన జయంత మహాపాత్ర వరకూ ఎందరో సృజనకారులను పరిశీలించినప్పుడు- వారు కూడా తమ సృష్టిని తామే ధ్వంసం చేసిన లేదా మరణానంతరం ధ్వంసం చేయమని ఆదేశించినవారే. ఇంతకూ సృష్టికర్తలు తమ సృజనల్ని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటారు? సృష్టించే, విధ్వంసం చేసే ప్రక్రియలకు అవినాభావ సంబంధం ఉన్నదా?

ఒకప్పుడు సృజనకారులు తమను తాము దేవుళ్లుగానో, దైవశక్తిగలవారి గానో భావించే వారు. అందువల్ల సృష్టించడం లేదా సృష్టికి ప్రతిసృష్టి చేయడం తమకు మాత్రమే వీలవుతుందని భావించేవారు. కొంతమంది ఇంకాస్త ముందుకెళ్లి తమను తాము సృష్టి కారకులు గానే గాక, లయకారులుగా కూడా భావించి తమ సృజనలను ధ్వంసం చేసే అధికారం తమకే ఉందనుకున్నారేమో అనిపిస్తుంది. లేదా తమ సృజనలు తమ జీవితంతోనే, తమ మానసిక ప్రపంచంతోనే, ఇంకా తమ భౌతిక శరీరంతోనే ముడిపడినవనీ, తమ మరణానంతరం మరెవరికీ వాటితో సంబంధం లేదనీ భావించారా? తమ సృజనలను చాలామంది సృష్టికర్తలూ, రచయితలూ తమ సంతానంగా భావించినట్లు కూడా మనం గమనించవచ్చు.


కళాకారులు తమ సృష్టికి తాము సొంతదారులు గానూ, సృజనలను ఆస్తిగానూ భావించడం కాలక్రమంలో జరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ దాన్ని పటిష్టం చేసింది. పర్యవసానంగా తమ సృజనలకు సంబంధించిన కాపీరైట్ హక్కులు ముందుగా తమకూ, తమ మరణానంతరం ఆ హక్కుల్ని వారు సంక్రమింప చేసిన వారికి రావటం జరిగింది.

సాహిత్య, కళా రంగాలలోని సృజనకారులు తమ సృజనలను ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటారు అన్న ప్రశ్నతో మొదలెడదాం. కొన్నిసార్లు తాము చేసిన సృజనలపై తమకే కలిగిన అయిష్టత కావొచ్చు, సృజన చేసేటప్పుడే వాటిని చింపేసే ప్రవృత్తి చాలా మంది సృజనకారులలో గమనించవచ్చు. తాము చేస్తున్న సృజనలు తామనుకున్నంత గొప్పగా కుదరడం లేదని విసుగూ, కోపం కూడా దీనికి కారణమై ఉండవచ్చు. కొంతమంది తమ కొన్ని సృజనలను వద్దనుకున్న శిశువులుగా భావించి వాటిని ధ్వంసం చేయాలనుకోవచ్చు. ఐతే ప్రచురింపబడి, బహుళ ప్రాచుర్యం పొందిన తర్వాత కూడా వాటిని ధ్వంసం చేయాలనుకోవడం; ప్రచురణ కాని, ప్రకటింపబడని తమ రచనలను, సృజనలను తగలబెట్టమని తమ వారసులను ఆదేశించడం కూడా అక్కడక్కడా చూస్తున్నాం. తాము చేసిన రచనల చివరి డ్రాఫ్ట్‌లను అవి ప్రచురణ కావడానికి ముందు చూడలేకపోతామనే ఆలోచనే ఇందుకు కారణమేమో! లేదా తాము చేసిన రచనలకు మార్పులూ చేర్పులూ చేసి కాపీరైట్ హక్కుదారులు తమ మరణానంతరం ప్రచురిస్తారేమోననే అనుమానమేమో!



అయినా తమ రచనలపై, సృజనలపై వీళ్లకు ఎందుకంత వ్యామోహం? అసలు రచనలపై రచయితలకు యాజమాన్యపు హక్కులు ఎంతవరకు సమంజసం? ఏ రచనైనా, సృజన అయినా ఒక చోట, ఒక వ్యక్తిలో, ఒక వ్యక్తితో పుడుతుందా? ఒక రచయిత, సృజనకారుని మరణంతో అది అంతమొందుతుందా? రచయితలు, సృజనకారులు భాషలో, కళలో పుడతారు కదా? మరి భాషకు, కళకు పుట్టుక ఎప్పటిది, ఎవరితో జరిగింది? భాషకంటూ, కళకంటూ మరణం ఉంటుందా?

■ ఎమ్. శ్రీధర్





ఆడుతూ పాడుతూ.. : పుస్తకాలు, డ్రెస్సులను ఆరబెట్టుకుంటున్న విద్యార్థులు



పాఠశాల సామగ్రిని శుభ్రం చేసుకుంటూ..



స్కూల్ డ్రెస్సులు, సాక్సులను ఆరబెట్టుకుంటూ..



స్కూల్ బెల్టులను శుభ్రం చేస్తూ..




చివరికి పాఠశాలలో పాఠాలు వింటూ..

సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణీ

సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణీ.. అంటూ విద్యాబుద్ధులు నేర్చుకున్న ఆ విద్యార్థులు.. తమ పాఠశాలకు వరద వల్ల కలిగిన నష్టంలోనూ అదే స్ఫూర్తితో ముందుకు కదిలారు. అనుకోకుండా వచ్చిన వరద తమ విద్యాలయాన్ని దారుణంగా మార్చేసినా.. నామరూపాల్లేకుండా చేసినా.. తమ బడిని తిరిగి నిలబెట్టుకోవాలని చేతులు కలిపి వారే శుభ్రపరుచుకున్నారు. వరద సృష్టించిన బీభత్సానికి కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్ నాశనం కాగా, పుస్తకాలు, రికార్డులు పాడైపోయి, స్కూల్ డ్రెస్సులు, బెంచీలు, బల్లలు, ఆటపరికరాలు అస్తవ్యస్తంగా మారాయి. వరద తగ్గినా పాఠశాలకు పాతరూపం రాలేదు. బురద తొలగలేదు. దీంతో విద్యార్థులంతా నడుం బిగించి పారిశుధ్య కార్మికులుగా మారి శుభ్రం చేసుకున్నారు. తడిచిన పుస్తకాలు, బెల్టులు, షూ, డ్రెస్సులను ఆరబెట్టుకున్నారు. ప్రతి తరగతి గదిలో బురదను తొలగించి చక్కగా తీర్చిదిద్దారు. పాఠాలు నేర్చుకోవడంతో పాటు పాఠశాలపై ప్రేమను చాటుకున్న ఆ విద్యార్థుల కృషిని అటు ఉపాధ్యాయులతో పాటు ఇటు తల్లిదండ్రులు కూడా మెచ్చుకున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

ఎక్సైజ్‌లో బదిలీల పైరవీలు

ఉమ్మడి కృష్ణాజిల్లాకు భారీగా డిమాండ్



మొన్నటి వరకు ఎక్సైజ్ శాఖది ఒక దారి. ఎస్ఈబీ(స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో)ది మరో దారి. అయితే ఈ రెండింటికీ మధ్య ఉన్న గీత ఇప్పుడు చెరిగిపోయింది. ఎస్ఈబీని రద్దు చేసిన ప్రభుత్వం అందులోని సిబ్బందిని ఎక్సైజ్ శాఖకు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎక్సైజ్ శాఖలో బదిలీలకు జోరుగా పైరవీలు సాగుతున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులు ఉన్న స్థానాలను పదిలం చేసుకునే పనిలో పడ్డారు. కోరుకున్న స్థానాల్లో కూర్చోవడానికి కొత్త వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటికే కొందరు సిఫార్సు లేఖలను సైతం చేజిక్కించుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన వారికి సైతం సిఫార్సు లేఖలు ఇవ్వడం ఇప్పుడు జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో దుమారం రేపుతోంది.

ప్రస్తుత స్థానం కాపాడుకునే పనిలో కొందరు..

- జిల్లాకు రావడానికి మరికొందరి ప్రయత్నం
- కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- ఇప్పటికే పలువురికి అందిన సిఫార్సు లేఖలు
- వైసీపీతో అంటకాగిన వారికి ఇవ్వడంపై విమర్శలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఈబీని రద్దు చేయడంతో అందులో ఉన్న సిబ్బందిని అధికారులు రిలీవ్ చేశారు. వారంతా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్నారు. ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ త్వరలో ప్రారంభం కాబోతుంది. దీనికోసం ఇప్పటి నుంచే అధికారులు స్థానాలను ఎంచుకునే పనిలో పడ్డారు. ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీబిజీగా ఉన్నారు.

ఎవరి పట్టు వారిది..!

ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే కొనసాగాలని కొందరు అధికారులు చూస్తున్నారు. ఆ స్థానాలను పదిల పరచుకునే పనిలో ఉన్నారు. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖను ఒకరకంగా ఏలిన అధికారులంతా ఇప్పుడు ఉమ్మడి కృష్ణాజిల్లాలో అడుగు పెట్టడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

పోస్టులు ఇవే..

ఎస్ఈబీని రద్దు చేసి ఎక్సైజ్‌లో విలీనం చేసిన తర్వాత ప్రభుత్వం పోస్టుల వివరాలను ప్రకటించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అసిస్టెంట్ కమిషనర్ ఉంటారు. వీరు కాకుండా మచిలీపట్నం కేంద్రంగా ఒక ఎక్సైజ్ సూపరింటెండెంట్, విజయవాడ కేంద్రంగా ఒక ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉంటారు. అలాగే, ఉమ్మడి జిల్లాలో మూడు ఎక్సైజ్ డిపోలు ఉన్నాయి. గుడివాడ, నిడమానూరు, గొల్లపూడిలో ఈ డిపోలు ఉన్నాయి. ఇక్కడి నుంచి మద్యం దుకాణాలు, బార్‌లకు సరుకు సరఫరా అవుతుంది. ఈ డిపోలు ఒక్కోదానికి ఒక్కో ఈఎస్ ఉంటారు. డీసీ, ఏసీ పోస్టులు రెండూ విజయవాడ కేంద్రంగా ఉండబోతున్నాయి. దీంతో ఈ రెండు పోస్టులకు గట్టి పోటీ ఉంది.

ప్రయత్నాలు ముమ్మరం

- ఎస్ఈబీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ పదోన్నతిపై డీసీగా రావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈనెలాఖరు వరకు ఎక్సైజ్ శాఖలో బదిలీలు పూర్తి చేసుకోవడానికి గడువు ఉంది. ఒకవేళ పదోన్నతి రావడం ఆలస్యమైతే ఏసీగా విజయవాడలో చేరి డీసీ పోస్టు ఇన్‌చార్జి తీసుకునే ప్రయత్నం జరుగుతున్నట్టు తెలుస్తోంది.
- ప్రస్తుతం ఎస్ఈబీ డీసీగా శంకరయ్య ఉన్నారు. ఎస్ఈబీ రద్దుతో ఆయన వీఆర్‌లో ఉన్నారు. ఆయన ఇప్పుడు ఎక్సైజ్ డీసీ పోస్టుపై ఆసక్తిని చూపిస్తున్నట్టు తెలిసింది.
- ఇంతకుముందు మచిలీపట్నం ఈఎస్‌గా పనిచేసిన కృష్ణకుమారి ప్రస్తుతం విశాఖపట్నంలో పనిచేస్తున్నారు. ఆమె తిరిగి మచిలీపట్నం ఈఎస్‌గా గానీ, విజయవాడ ఈఎస్‌గా గానీ రావడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆమెకు ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇచ్చారు. ఆమె మచిలీపట్నంలో పనిచేసినప్పుడు బార్ యజమానులను వేధించారన్న ఆరోపణలు ఉన్నాయి.
- వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు నారాయణస్వామి, గుడివాడ అమరనాథ్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన మధు ఉమ్మడి కృష్ణా జిల్లాలో రెండు ఈఎస్ పోస్టుల్లో ఒక్కదాన్ని ఆశిస్తున్నారు. ఆయనకు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఒక మంత్రి లేఖ ఇచ్చారు. దీనిపై కూటమి ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నాటి ప్రభుత్వ హయాంలో మంత్రుల అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరించిన వ్యక్తికి ఎలా లేఖ ఇచ్చారని ఆ మంత్రిని ప్రశ్నించినట్టు తెలిసింది.

సామాజిక వర్గాల బేరీజుతో సర్దుబాటు!

సామాజిక వర్గాలను బేరీజు వేసుకుని బదిలీల్లో స్థానాలు కేటాయించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈఎస్ పోస్టుల కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న కృష్ణ కుమారి, మధులను రెండుచోట్ల సర్దుబాటు చేస్తారని విశ్వసనీయంగా తెలిసింది. ఒకరిని డిపో ఈఎస్‌గా పంపి, మరొకరికి విజయవాడలో గానీ, మచిలీపట్నంలో గానీ పోస్టింగ్ ఇవ్వాలన్న విధంగా సర్దుబాటు చర్చ నడుస్తున్నట్టు సమాచారం.

చౌకబారు దోపిడీ

చౌకధరల దుకాణాల నష్టాల లెక్కల్లో మతలబు | ఎక్కువ వరద నష్టం చూపించి దోచుకునే యత్నాలు

- అధికారులతో కుమ్మక్కైన డీలర్లు
- నష్టం ఎక్కువగా నమోదుచేస్తూ నివేదిక
- మంచి బియ్యం బస్తాలు కూడా పాడైనట్టుగా..
- జేసీ వద్దకు చేరిన సర్వే రిపోర్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వరదల పేరిట భారీగా దోచుకునేందుకు చౌకధరల దుకాణాల్లో అడ్డగోలు వ్యవహారాలు నడుపుతున్నారు. వరదల కారణంగా చౌకధరల దుకాణాల్లోని నిత్యావసరాలు కూడా నాశనమయ్యాయి. అయితే, వీటికి సంబంధించి నష్టాన్ని ఎక్కువగా చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో రేషన్ డీలర్లు, సివిల్ సప్లయిస్ అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి.

దోపిడీ ఇలా..

బుడమేరు, కృష్ణా వరదల కారణంగా జిల్లావ్యాప్తంగా 200కు పైగా రేషన్ డిపోలు నీట మునిగాయి. ఒక్క విజయవాడలోనే 150కు పైగా రేషన్ డిపోలు దెబ్బతిన్నాయి. కండ్రిక, వాంబేకాలనీ, అంబాపురం వంటి ప్రాంతాల్లోని చౌక దుకాణాల్లోకి నీరు చేరింది. అయితే, నాలుగు వరుసల్లో ఉన్న బస్తాలే నీట మునగగా, మిగిలినవి బాగానే ఉన్నాయి. తేమ వల్ల ఐదో వరుస కూడా పాడై ఉండొచ్చు. కానీ, చాలాచోట్ల పూర్తి సరుకు వరదార్పణం అయినట్టుగా లెక్కలు చెబుతున్నారు. డీలర్లు, అధికారులు కుమ్మక్కై ఇలా చేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇలా దొంగ లెక్కలు రాసినందుకు.. బాగున్న బియ్యం బస్తాలు వారికిచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. డిపో స్థాయిని బట్టి పది నుంచి పాతిక వరకు బియ్యం బస్తాలను ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ బస్తాలను వ్యాపారులకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడానికి అధికారులు అత్యుత్సాహ పడుతుంటే, తక్కువ సరుకు నష్టపోయినా ఎక్కువ సరుకు పొందవచ్చని డీలర్లు సంబరపడిపోతున్నారు. ఈ వ్యవహారం విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలో భారీగా జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. రేషన్ డీలర్లు, అధికారులు కుమ్మక్కై సర్వేను తమకు అనుకూలంగా మార్చుకున్నారని తెలుస్తోంది. ఈ రిపోర్టు జాయింట్ కలెక్టర్‌కు నివేదించినట్టుగా సమాచారం. కాగా, ప్రభుత్వానికి నష్టం కలిగించే ఈ వ్యవహారాలపై జాయింట్ కలెక్టర్ రీ వెరిఫికేషన్‌కు ఆదేశించాలనే కోరుతున్నారు.



వరద నీటిలో బియ్యం బస్తాలు

ఫోన్లు దొరికాయ్

400 సెల్‌ఫోన్ల రికవరీ

6లో

యాసిడ్ తాగి ఏడాదిన్నర పాప మృతి

అశోక్‌నగర్‌లో విషాదం

విజయవాడ, ఆంధ్రజ్యోతి : నీళ్లు అనుకుని యాసిడ్ తాగి ఏడాదిన్నర పాప మృతిచెందిన విషాద ఘటన అశోక్‌నగర్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మచిలీపట్నం టెంపుల్ కాలనీకి చెందిన మహ్మద్ అబ్బాస్ ఎక్స్‌కవేటర్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. అతని కుటుంబం అశోక్‌నగర్‌లో నివసిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన మహిళను ఆయన వివాహం చేసుకున్నాడు. వీరికి కవల ఆడపిల్లలు. ఏడాదిన్నర వయసున్న వీరికి ఆయేషా, ఆఫియా అని నామకరణం చేశారు. ఈనెల 19వ తేదీన అబ్బాస్ భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి మచిలీపట్నం నుంచి అశోక్‌నగర్‌కు వచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆఫియా బయట ఆడుకుంటూ బాత్‌రూంలోకి వెళ్లింది. అక్కడ సీసాలో ఉన్న యాసిడ్‌ను తాగింది. వాంతులు చేసుకుంటూ బయటకు రావడంతో గమనించిన అబ్బాస్ వెంటనే విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాడు. ఆఫియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి చనిపోయింది. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

మచిలీపట్నం వైసీపీలో ముసలం

ఇద్దరు సీనియర్ నాయకులు గుడ్‌బై

- తాళ్లపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు తొమ్మిది మంది రాజీనామా
- వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించిన 200 కుటుంబాలు
- అదేబాటలో పలువురు సీనియర్ నాయకులు, వారి అనుచరులు
- పార్టీ మారేందుకు బందరులో 20 మంది కార్పొరేటర్లు రెడీ
- మాజీమంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు కిట్టు వ్యవహారశైలి నచ్చకే రాజీనామాల పర్వం

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : మచిలీపట్నం వైసీపీలో ముసలం మొదలైంది. మాజీమంత్రి పేర్ని నాని, ఆయన తనయుడు కిట్టూ వ్యవహారశైలితో మనస్థాపానికి గురైన సీనియర్ నాయకులు పార్టీని వీడుతున్నారు. మచిలీపట్నం మండలానికి చెందిన వైసీపీ క్లస్టర్ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, జిల్లా వ్యవసాయ సలహామండలి డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీకాకుళపు నాగేశ్వరరావు, వారి అనుచరులు, తాళ్లపాలెం పంచాయతీ పాలకవర్గ సభ్యులు తొమ్మిది మంది వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాళ్లపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్ని నానీకి పంపిన రాజీనామా లేఖలను వారు చూపారు. తాళ్లపాలెం పంచాయతీలోని మరో 200 కుటుంబాల వారు వైసీపీని వీడుతున్నట్లు ప్రకటించారు.

సీనియర్లకు అవమానాలు

మచిలీపట్నం మండలానికి చెందిన వాలిశెట్టి రవిశంకర్, శ్రీకాకుళపు నాగేశ్వరరావు 30 ఏళ్లకుపైగా రాజకీయాల్లో ఉన్నారు. పేర్ని నాని మంత్రి అయ్యాక తాళ్లపాలెం, పెదపట్నం, గోకవరం, కానూరు తదితర గ్రామాలకు చెందిన నాయకులను పట్టించుకోలేదు. వీరిపై కిట్టూ పెత్తనం చెలాయించాడు. సీనియర్ నాయకులు పేర్ని నాని వద్దకు వెళ్తే.. మండల స్థాయిలో లంకే వెంకటేశ్వరరావు పార్టీ వ్యవహారాలు చూస్తారని, ఆయనను కలవాలని చెప్పి పంపేశారు. దీనిపై సీనియర్లు గుర్రుగానే ఉండిపోయారు. వాలిశెట్టి రవిశంకర్ రెండు నెలల క్రితం తన అనుచరులతో వైసీపీకి రాజీనామా చేసేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలిసిన పేర్ని నాని.. కిట్టూను అక్కడకు పంపారు. గతంలో తప్పులు జరిగాయని, వాటన్నింటినీ సరిదిద్దుతామని పార్టీలోనే కొనసాగాలని కిట్టూ చెప్పినా వారు వినిపించుకోలేదు. కాగా, మరికొందరు సర్పంచ్‌లు, నేతలు కూడా రాజీనామాలు చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. మేకావానిపాలెం, పోతిరెడ్డిపాలెంలోని సీనియర్ నాయకులు సైతం రెండు రోజుల్లో రాజీనామాలను సమర్పిస్తారని ప్రచారం జరుగుతోంది. అలాగే, మచిలీపట్నం కార్పొరేషన్‌లో వైసీపీకి చెందిన 20 మందికి పైగా కార్పొరేటర్లు కూడా బయటకు రావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


దుర్గమ్మను దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

దుర్గమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్ : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఇ.వేణుగోపాల్, కుటుంబసభ్యులతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


దుర్గగుడి గోపుర స్వర్ణతాపడానికి విరాళం ఇస్తున్న భక్తులు

దుర్గగుడి గోపుర స్వర్ణ తాపడానికి విరాళాలు

వన్‌టౌన్: దుర్గగుడి ఆలయగోపురం స్వర్ణతాపడ పనుల నిమిత్తం గుంటూరు సంగడిగుంట రెడ్లబజారుకు చెందిన పేరం శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు విరాళం అందజేశారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన వారు 1,01,116లను చెక్కురూపంలో ఈవో రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. అలాగే గొల్లపూడి ప్రాంతానికి చెందిన రాఘవేంద్ర బ్రోకర్స్ యాజమాన్యం రూ.1,01,116ల విరాళాన్ని చెక్కురూపంలో ఏఈవో ఎన్.రమేష్ ద్వారా ఆలయానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతలకు అర్చకులు ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాలను అందజేశారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



దసరా ఉత్సవాలకు సంబంధించి క్యూలైన్లు, తదితరాలను ఆదివారం ఈవో కె.ఎస్.రామారావు, ఏడీసీపీ రామకృష్ణ, వన్‌టౌన్ పోలీసు అధికారులు పరిశీలించారు. ఈఈ లింగం రమాదేవి, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడి కళావేదికపై కూచిపూడికి చెందిన శ్రీఅభినయ సత్య అకాడమీ కె.జ్యోతి ఆధ్వర్యంలో కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.


కృష్ణవేణి మాత విగ్రహం వద్ద ఆళ్ల గోపాల కృష్ణారావు, తదితరులు

నదులు మానవాళి మనుగడకు జీవనాడులు

» ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు

వన్‌టౌన్, సెప్టెంబరు 22 : నదులు మానవాళి మనుగడకు జీవనాడులని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వన్‌టౌన్ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణవేణి మాత విగ్రహానికి జలవనరుల శాఖ అధికారులు, సంఘాల నాయకులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, పెన్నా పెద్ద నదులు, ఏలేరు, చెయ్యేరు, పాపాగ్ని, స్వర్ణముఖి లాంటి చిన్న నదులను పరిరక్షించుకోవాల్సిన సామాజిక బాధ్యత మన అందరిది అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటీవల శ్రీశైలం జలాశయం దగ్గర జలసిరికి హారతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీఆర్. కృష్ణారావు, బ్యారేజీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.దినేష్ రాఘవేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంపై సీఎం వ్యాఖ్యలకు అనుచిత పోస్టు

» మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో చర్చ

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను రవాణా శాఖకు చెందిన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు అనుచిత వ్యాఖ్యలతో ట్యాగ్ చేయటం వివాదాస్పదమైంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో ఈ అనుచిత వ్యాఖ్యల వ్యవహారం నడిచింది. లడ్డూ ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలిశాయని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్డీఏ కూటమి సమావేశంలో చంద్రబాబు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వీటికి సంబంధించిన వీడియోను సంజీవ్ కుమార్ అనే వ్యక్తి జతచేసి కొన్ని పాయింట్లతో ఎంవీఐ గ్రూపులో పోస్టు చేశారు. ఈ పోస్టుపై విజయవాడ ఏఎంవీఐగా పని చేస్తున్న ఉమామహేశ్వరరావు స్పందిస్తూ 'సొల్లు' అంటూ కామెంట్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతాయుతంగా ఉండాల్సిన అధికారి ఈ రకంగా స్పందించటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.


ట్రోఫీల ప్రదానోత్సవంలో ఆర్ఐవో సీఎస్ఎస్ఎన్ రెడ్డి, రవికాంత

ఎస్‌జీఎఫ్ అండర్-19 విజేతలు కృష్ణా, తూర్పు

» జాతీయ పోటీలకు ఏపీ జట్టు ఎంపిక పూర్తి

విజయవాడ స్పోర్ట్స్ : నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-19 టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో బాలికల విభాగంలో కృష్ణా, బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో బాలుర ఫైనల్స్‌లో పవన్ సత్య(కృష్ణా) నమాన్ జైన్(తూర్పు)పై 11-5, 11-8తో వరుస సెట్లతో విజయభేరి మోగించాడు. బాలికల ఫైనల్స్‌లో డి.దీక్షిత(విశాఖ), పి సంహిత(కృష్ణా)పై 11-8, 8-11, 11-6తో విజయం సాధించి టైటిల్‌ను కైవశం చేసుకున్నారు. జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఈఐవో సాల్మన్‌రాజు, జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి .రవికాంత ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి ప్రతిభ చూపిన బాలబాలికలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్టు పరిశీలకులు దుర్గాప్రసాద్ ప్రకటించారు. ఈ జట్లు అక్టోబర్ 5 నుంచి 8వ వరకు లడక్‌లోని లేహ్‌లో జరిగే జాతీయస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాయి.

ఏపీ జట్టు : పి సత(కృష్ణా), నమాన్ జైన్, బి.సాయి జోషిత్, ఎల్ సాకేత్, ఎస్.కార్తికేయ(తూర్పుగోదావరి), ఎం.కౌశిక్(వైజాగ్), పి.రఫీ(గుంటూరు), సీహెచ్ వీరాంజనేయులు(గుంటూరు), బాలికలు : డి.దీక్షిత(విశాఖ), పి.సంహిత, ఎం.తన్వి, కె.వసుధ(కృష్ణా), పి.హాసిని(గుంటూరు), పి.భవిత(విశాఖ), పి.అక్షయ(కృష్ణా), ఎం.గ్రేష్మ శ్రీ(తూర్పుగోదావరి)లు ఎంపికయ్యారు.

విపత్తుల కట్టడిపై ప్రత్యేక దృష్టి

» జిల్లాలో డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై కసరత్తు
» సర్వే నెంబర్ల ఆధారంగా వివరాలు
» బుడమేరు ఆక్రమణలో 3వేల గ్రహాలు, 80 నిర్మాణాల గుర్తింపు
» ఎవరికీ ఇబ్బంది లేకుండా 'ఆపరేషన్ బుడమేరు'
» వరద ముంపు బాధితులందరికీ న్యాయం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి


వరద ముంపు బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, సెప్టెంబరు 22 : ఇటీవల విజయవాడలో సంభవించిన బుడమేరు వరద ముంపు అధికశాతం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని, ఇకపై ఇటువంటి విపత్తులను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఈ క్రమంలో డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై కసరత్తు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. వరద ప్రభావిత ప్రజలను ఆదుకోవటంలో ముఖ్యమంత్రి మార్గనిర్దేశంతో జిల్లా యంత్రాంగం విశేష కృషి చేసిందన్నారు. అర్బన్ పరిధిలో 32 వార్డులు, 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్ చేశారని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారిని కూడా జాబితాలో చేర్చుతున్నట్లు తెలిపారు. నష్ట పరిహార చెల్లింపులు పూర్తయిన తరువాత డ్రెయిన్ల నెట్‌వర్క్‌పై దృష్టి సారిస్తామని తెలిపారు. సమర్థ కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. అవుట్‌ఫాల్స్ డ్రెయిన్లపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. 'ఆపరేషన్ బుడమేరు'లో ఆక్రమణలను గుర్తించి ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్, నీటిపారుదల శాఖ, విజయవాడ సిటీ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు, సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించి సర్వే నెంబర్ల వారీగా ఆక్రమణ వివరాలను నమోదు చేశామన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు నుంచి విజయవాడ వరకు 40 గ్రామాల పరిధిలో దాదాపు 2,700 ఎకరాల్లో బుడమేరు ప్రవహిస్తుందన్నారు. దాదాపు 270 ఎకరాల బుడమేరు ప్రాంతం పంట పొలాలుగా ఆక్రమణలకు గురైనట్టు గుర్తించామన్నారు. దీంతో పాటు 3 వేల గృహాలు, 80 నిర్మాణాలు ఉన్నాయని తెలిపారు. ఆక్రమణలన్నింటినీ పూర్తిగా పరిశీలించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం 'ఆపరేషన్ బుడమేరు'ను చేపట్టనున్నట్టు తెలిపారు.

ముంపు బాధితులందరికీ న్యాయం

వరద ముంపు ప్రాంతాల్లో నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఈమేరకు చర్యలు తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. విజయవాడలోని 32 వార్డుల్లో, 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్ పూర్తిచేశామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయినట్టయితే వారిని కూడా జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు. ఆదివారం సింగ్‌నగర్, 259 వార్డు సచివాలయాన్ని, రాజరాజేశ్వరిపేటలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులతో ఆమె మాట్లాడుతూ, సర్వే ప్రకారం లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించామని, ఇంకా ఎవరి పేరు అయినా మిగిలిపోయినట్టయితే వారి వివరాలను కూడా యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. చాలా మంది బాధితులు తమ పేర్లు ఉన్నాయో లేవోనని సచివాలయాలకు వస్తున్నారని, ఎవరూ ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. చివరి కుటుంబానికీ పరిహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మ్యాపింగ్ జరగకపోయినా, నివాసం ఉంటున్నట్లు ఏదైనా ఆధారం చూపినా కూడా వివరాలు నమోదు చేస్తామన్నారు. నోటి మాటగా ఇక్కడ ఉంటున్నాం, అక్కడ ఉంటున్నాం అంటే సరిపోదని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రానికి ప్రక్రియ పూర్తవుతుందని, ఈనెల 25న బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి!

» సచివాలయాల వద్ద బాధితుల ఆందోళన

అజిత్‌సింగ్‌నగర్/పాయకాపురం : బుడమేరు ముంపు ప్రాంత బాధితుల నష్టపరిహారం జాబితా ఆదివారం విడుదలవడంతో లిస్టులో తమపేర్లు లేవని పలువురు సచివాలయాల వద్ద ఆందోళనకు దిగారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బాధితులు ఆందోళనకు దిగారు. ఈనెల 1న నగర శివారున వేలాది కుటుంబాలు బుడమేరు ముంపు బారిన పడ్డాయి. ఇళ్లు, ఫర్నీచర్, వాహనాలు పూర్తిగా నీట మునిగి ఆర్థికంగా నష్టపోయారు. పదిరోజులుగా అధికారులు ఎమ్యూనరేషన్ సర్వే చేపట్టి బాధితుల జాబితా తయారు చేశారు. అయితే వివిధ కారణాలతో వేలాది మంది బాధితుల పేర్లు లిస్ట్‌లో కనిపించలేదు. ఆదివారం సచివాలయాల్లో నష్ట పరిహారానికి అర్హులైన బాధితుల జాబితా సచివాలయాల్లో ఉంచారు. అయితే లిస్టులో తమ పేర్లు లేవని బాధితులు ఆదివారం ఆందోళనకు దిగారు. తాము వరదల్లో సర్వస్వం కోల్పోయామని, అయినా తమ పేరు ఎందుకు రాలేదని న్యూ రాజరాజేశ్వరిపేట, రాజీవ్ నగర్‌తో పాటు పలు సచివాలయాల పరిధిలో సిబ్బందిని నిలదీశారు. వేలసంఖ్యలో బాధితులు సచివాలయాల వద్ద గుమిగూడటంతో వారిని శాంతిపజేయడానికి నానా ఇబ్బందులు పడ్డారు. సోమవారం జాబితాలో చేరుస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు.

జగన్ నియంతృత్వం నచ్చకే వైసీపీని వీడా!

● మోపిదేవి వెంకటరమణ వెల్లడి

ధర్నాచౌక్: తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, వైసీపీ అధినేత జగన్ తనకు ఎమ్మెల్యే సీటు నిరాకరించడం మింగుడుపడలేదని, తీవ్ర అవమానం కలిగించిందని రాజ్యసభ మాజీ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ చెప్పారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయసభలో ఆయన మాట్లాడారు. జగన్ నియంతృత్వ పోకడల వల్లే రెండేళ్ల కాలపరిమితి ఉన్నప్పటికీ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మత్స్యకారులు.. భయపెడితే భయపడే జాతి కాదన్నారు. మోపిదేవి టీడీపీలోకి రావడం శుభపరిణామమన్నారు. సభలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే కర్రి పద్మశ్రీ, జనసేన నాయకురాలు ఘంటశాల వెంకటలక్ష్మి, పలు మత్స్యకారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ ఉపసంహరించాలి

● ఇన్సూరెన్స్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 22: జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న 18శాతం జీఎస్‌టీని వెంటనే ఉపసంహరించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిూస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి టీవీఎస్ఎస్ రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. జీఎస్‌టీని ఎత్తివేయని పక్షంలో పాలసీదారుల ప్రయోజనాలు కాపాడేందుకు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఫెడరేషన్ 56వ మహాసభ ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో జరిగింది. రవీంద్రనాథ్ మాట్లాడుతూ బీమా రంగాన్ని మరింత శక్తిమంతం చేస్తే జీడీపీలో ప్రీమియం వాటా పెరుగుతుందన్నారు. సభలో ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్, డివిజన్ అధ్యక్షుడు జె.సుధాకర్, ప్రధాన కార్యదర్శి జి.కిషోర్‌కుమార్, ఎల్ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ జి.సుధాకర్‌బాబు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు ప్రసంగించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దశలవారీ ఉద్యమం : యూటీఎఫ్

గవర్నర్‌పేట, సెప్టెంబరు 22 : దీర్ఘకాలంగా పరిష్కారం కాని మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26 నుంచి అక్టోబరు 24 వరకు దశల వారీ పోరాటాలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంస్థ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అప్‌గ్రేడేషన్ జరగలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, నేతలు కె.శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, కుసుమకుమారి, జి.లక్ష్మీరాజా, ఎస్‌పీ మనోహర్‌కుమార్, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కెనరా ప్రీమియర్ క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 22: జాతీయ కెనరా బ్యాంక్ ఎంప్లాయిూస్‌కు కెనరా ప్రీమియర్ లీగ్ 2.0 పురుషులకు క్రికెట్ టోర్నీ, మహిళలకు బ్యాడ్మింటన్ పోటీలను విజయవాడ సర్కిల్ కెనరా బ్యాంకు మేనేజర్ (డీ) సీజే విజయలక్ష్మి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మంగళగిరి సమీపంలో నాగార్జున వర్సిటీ సమీపంలో డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ గ్రౌండ్స్‌లో క్రికెట్ పోటీలను, బెంజిసర్కిల్‌లోని కృష్ణానగర్ పాపులర్ స్పోర్ట్స్ సెంటర్ వద్ద బ్యాడ్మింటన్ పోటీలను ఆమె ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు హెల్త్‌క్యాంప్‌ను నిర్వహించారు. బ్యాంకుల్లోని వివిధ హోదాల్లోని ఉద్యోగులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

వీఆర్వోలకు ప్రమోషన్లు కల్పించండి

ధర్నాచౌక్, సెప్టెంబరు 22: ఎంతో కష్టపడి డిగ్రీలు, పీజీలు చదివిన తాము డిపార్ట్‌మెంట్ టెస్ట్ పాసై కూడా ప్రమోషన్లు లేక బాధపడుతున్నామని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకుండా డిపార్ట్‌మెంట్ టెస్ట్‌లు, సర్వే ట్రైనింగ్ పాసైన అర్హత కలిగిన గ్రేడ్-1 వీఆర్వోలకు మాత్రమే సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. సంఘం ప్రధానకార్యదర్శి బీకేవీ.మురళీరాజు, కోశాధికారి ఎం.రాజమోహన్‌రావు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో యార్లగడ్డ తదితరులు

మనసు కవి ఆత్రేయ

» రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ

విజయవాడ కల్చరల్/వన్‌టౌన్: ఆత్రేయ మనసు కవి అని, నాటకాల్లోనూ నటించారని పద్మభూషణ్ సత్కార గ్రహీత, విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆదివారం గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో ఎక్స్‌రే సంస్థ ఆధ్వర్యంలో సినీ సాహిత్య పరిశోధకుడు పైడిపాల రచించిన 'అక్షరశిల్పి ఆత్రేయ' పుస్తకావిష్కరణ జరిగింది. కొల్లూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, విశిష్ట అతిథిగా సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, పుస్తక స్వీకర్త ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టు రెంటాల జయదేవ్ హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆత్రేయ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన పుస్తకావిష్కరణ సభలో యార్లగడ్డ మాట్లాడుతూ, రాసి ప్రేక్షకులని, రాయకుండా నిర్మాతలని ఏడిపించేవాడే ఆత్రేయ అని అన్నారు. ఆయన వందలాది పాటలు రాశారని, ఆ చిత్రాలన్నీ విజయవంతమయ్యాయని చెప్పారు. ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఆత్రేయ గొప్ప కవి అని, ఆయన జీవిత చరమాంకంలో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డారని చివరి రోజుల్లో ఆయన రాసిన రచనలను నటుడు మోహన్ బాబు కొన్నారన్నారు. ప్రస్తుతం తాను చైనా నటుడు, త్రిపుల్ ఆర్ చిత్రంలో నటించిన హాలీవుడ్ హీరోయిన్, బాలీవుడ్, కోలీవుడ్ నటులతో 'సద్గురు దినాలెడ్జి' అనే చిత్రం తీస్తున్నట్టు తెలిపారు. ఈ చిత్రంలో మనిషి 320 ఏళ్లు కూడా జీవించవచ్చు అనే అంశంతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఆత్రేయ పాటలను ఎంతగానో ఇష్టపడతానన్నారు. రెంటాల జయదేవ్ అక్షర శిల్పి ఆత్రేయ పుస్తకాన్ని విశ్లేషించారు. అనంతరం రచయిత డాక్టర్ పైడిపాలను ఘనంగా సన్మానించారు.

ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ గౌతమ్‌రెడ్డికి నిరసన సెగ

» అడ్డగించిన రాధా-రంగా మిత్రమండలి సభ్యులు
» రంగాకు క్షమాపణ చెప్పాలని డిమాండ్


రాధా-రంగా మిత్రమండలి సభ్యులను అరెస్టు చేస్తున్న పోలీసులు



వెళ్లిపోతున్న గౌతమ్‌రెడ్డి

గుడివాడ, సెప్టెంబరు 22 : ఏపీ ఫైబర్ నెట్ మాజీ చైర్మన్ గౌతమ్‌రెడ్డికి గుడివాడలో నిరసన సెగ తగిలింది. రంగాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గౌతమ్‌రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ రాధా-రంగా మిత్రమండలి సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో సమావేశం నుంచి గౌతమ్‌రెడ్డి నిష్క్రమించారు. త్వరలో జరగనున్న కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై గుడివాడ నియోజకవర్గ వైసీపీ నేతలతో స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గౌతమ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రాధా-రంగా మిత్రమండలి సభ్యులు అక్కడకు చేరుకుని ధర్నా నిర్వహించారు. గతంలో వంగవీటి రంగాను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన గౌతమ్‌రెడ్డిని క్షమాపణ చెప్పకుండా గుడివాడ విడిచి వెళ్లనిచ్చేది లేదని ధర్నాకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. రాధా-రంగా మిత్రమండలి సభ్యులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సొంత పూచికత్తుపై విడుదల చేశారు. మిత్రమండలి సభ్యుల ఆందోళనతో సమావేశాన్ని అర్ధంతరంగా ముగించుకుని గౌతమ్‌రెడ్డి వెళ్లిపోయారు.

100 రోజుల్లోనే బకాయిల చెల్లింపు సంతోషకరం

» కోర్టుల్లో పెండింగ్ కేసులను ఉపసంహరించాలి » ల్యాండ్ పూలింగ్‌పై అనుమానాలు నివృత్తి చేయాలి » ప్రభుత్వానికి అమరావతి జేఏసీ విజ్ఞప్తి

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే రాజధాని అమరావతి రైతులకు బకాయిలు చెల్లించడం సంతోషకరమని అమరావతి ఐక్య కార్యాచరణ సమితి నాయకులు అన్నారు. అమరావతి రైతులు, కౌలు రైతుల బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణను కలిసిన వెంటనే 90 శాతం నిధులు విడుదల చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం గుంటూరులో అమరావతి ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు మాదల శ్రీనివాస్ మాట్లాడారు. న్యాయపరమైన చిక్కుల నుంచి రైతులకు ఉపశమనం కలిగించాలని, అసైన్డ్ భూముల రైతుల సమస్యలపై ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అమరావతి తాగునీటి, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలపై శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి జీవధార కొండవీటి వాగు పునరుజ్జీవ ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా రాజధాని పరిసర ప్రాంతాలకు తాగు, సాగు నీటి అవసరాలు తీర్చేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టులో అమరావతి రాజధానిపై పెండింగ్‌లో ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అధికారులు గత ప్రభుత్వ నీడ నుంచి మారాలని, లేకుంటే రాజధాని అభివృద్ధి కుంటుపడుతుందని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోవాలన్నారు. మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల కల్పనపై నిర్దిష్ట కాల పరిమితి ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఆర్‌డీఏ కోసం అమరావతిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసిన భవనం సిద్ధంగా ఉందని, దసరా పండగలోగా అందులోకి కార్యాలయాన్ని మార్చాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా రైతులు ప్రభుత్వానికి ఇచ్చిన భూముల్లో ఆక్రమణలు, నిర్మాణాలు తొలగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి ఉద్యమంలో సహకరించిన వారికి అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్‌లో ప్రత్యేకంగా సన్మానం చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ఐక్య కార్యాచరణ సమితి సభ్యుడు కళ్లం రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ అమరావతి ఉద్యమంలో గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ల్యాండ్ పూలింగ్‌పై రైతులకున్న అనుమానాలను నివృత్తి చేసి, మిగతా అవసరమైన భూములు తీసుకోవాలన్నారు. జీవో ఎంఎస్ నంబరు 41పై అసెంబ్లీలో తీర్మానం చేసి రైతులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఆర్‌డీఏ నిబంధనలకు అనుగుణంగా డైనమిక్ ప్లాట్లు కేటాయింపు చేయాలని, భూములు ఆక్రమించిన వారిపై, అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజధాని అభివృద్ధిపై రైతులతో, అమరావతి జేఏసీ సభ్యులతో ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్షలు నిర్వహించి పనులు ప్రారంభించాలని కోరారు. రాజధాని రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ధనేకుల రామారావు మాట్లాడుతూ గతంలో భూములు ఇవ్వని రైతులు సైతం ఇప్పుడు ముందుకు వస్తున్నారని, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాయింట్ కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యూస్ బాక్స్

జిల్లా కాంగ్రెస్ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు

విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కాంగ్రెస్ నేతలకు ఇతర జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీచేశారు. వలిబోయిన గురునాథంను అనకాపల్లి ఇన్‌చార్జిగా నియమించారు. మేడా సురేశ్‌కు కాకినాడ జిల్లా, కొలనుకొండ శివాజీకి తూర్పుగోదావరి జిల్లా, వింతా సంజీవరెడ్డికి ఏలూరు జిల్లా, బైపూడి నాగేశ్వరరావుకు పశ్చిమగోదావరి జిల్లా, గంగిశెట్టి ఉమాశంకర్‌కు విజయనగరం జిల్లా, మార్నీడి శేఖర్‌కు కృష్ణాజిల్లా, మొవ్వా మోహనరావుకు ఎన్టీఆర్ జిల్లా, అంబటి రామకృష్ణ యాదవ్‌కు కర్నూలు జిల్లా బాధ్యతలను అప్పగించారు.

ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో

జానకిరామయ్యకు చోటు

ధర్నాచౌక్, సెప్టెంబరు 22 : మరణ కారకమైన రోగాల నుంచి మానవాళిని తప్పించేందుకు జానకిరామయ్య పరిశోధనలు దోహదపడతాయని భువన విజయం కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిశెట్టి శేషగిరి తెలిపారు. ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్తగా నాల్గవసారి ఎంపికైన కేఎల్‌యూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.జానకిరామయ్యను ఆదివారం ఘనంగా సత్కరించారు. గాంధీనగర్‌లోని భువన విజయం కళా కేంద్రం సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళాకేంద్రం, ప్రోగ్రెసివ్ సఫాయ్ కర్మచారిస్ సంఘం, సైన్స్‌-వైజ్ఞానిక అభివృద్ధి సంఘం సభ్యులు అయన్ను ఘనంగా సత్కరించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన ప్రపంచ ఉత్తమ శాస్త్రవేత్త జాబితాలో జానకిరామయ్యకు చోటు లభించింది. వివేకానంద యువజనసంఘం అధ్యక్షుడు చనుమోలు రామచంద్రరావు, ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారిస్ సంఘం నేత కీర్తిప్రకాష్, సైన్స్‌-వైజ్ఞానిక అభివృద్ధి సంఘం సభ్యులు ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, కె.ధనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

వన్‌టౌన్: కలెక్టరేట్ పింగళివెంకయ్య సమావేశమందిరంలో ఈనెల 23న సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వినతులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు,మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లో అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

క్రైం కార్నర్


బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సీపీ

ఫోన్లు దొరికాయ్

» 400 సెల్‌ఫోన్ల రికవరీ

విజయవాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : బాధితుల ఫిర్యాదులతో వివిధ ప్రదేశాల్లో చోరీ చేయపడిన, పోయిన 400 ఫోన్లను సైబర్ క్రైం పోలీసులు ట్రాక్ చేశారు. రూ.50లక్షల విలువ గల ఫోన్లను సంబంధిత వ్యక్తులకు అందజేశారు. విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, డీసీపీ గౌతమి షాలి అందజేశారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రార్), చాట్‌బాట్ ద్వారా అందిన ఫిర్యాదులకు సంబంధించిన ఈ ఫోన్లను రికవరీ చేశారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ఫోన్లను ట్రాక్ చేశారు. ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో 1785 ఫోన్లను రికవరీ చేసి సంబంధిత వ్యక్తులకు అందజేసినట్టు పోలీసు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్లు గుణరాము, పలివెల శ్రీనివాసరావు, ఎస్ఐలు మూర్తి, రంభ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన 'కవర్'

ఆరోపణలకు తావులేకుండా, అవగాహన పెంపొందించేలా పోలీసులు ఒక కొత్త కవర్‌ను రూపొందించారు. రికవరీ చేసిన ఫోన్లను వాటిలో పెట్టి బాధితులకు అందజేస్తున్నారు. రికవరీ చేసిన ఫోన్లను సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇచ్చి ఆధార్, మొబైల్ బిల్లును చూసి ఇచ్చేవారు. ఈవిధంగా చేయడం వల్ల ఏదైనా ఫోన్ మిస్ అయితే ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. రికరీ చేసిన ఫోన్లను పెట్టడానికి ఒక కవర్‌ను తయారు చేయించారు. దానిపై డీజీపీ, పోలీసు కమిషనర్ ఫొటోలతోపాటు రెండు క్యూఆర్ కోడ్‌లు ఉంటాయి. ఇందులో ఒక క్యూఆర్ కోడ్ స్కాన్‌ను చేస్తే ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్ వస్తుంది. ఇదే క్యూఆర్ కోడ్ సైబర్ క్రైం పోలీసుల వద్ద ఒకటి ఉంటుంది. దాన్ని పోలీసులు స్కాన్ చేస్తే ఫోన్‌కి సంబంధించిన వ్యక్తి వివరాలు తెలుస్తాయి. కవర్‌పై ఉండే మరో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సైబర్ నేరాల నియంత్రణపై అవగాహనకు రూపొందించిన సైబర్ సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి, వాటి నుంచి ఎలా తప్పించుకోవాలి, మొబైల్ ఫోన్లు పోతే ఎలా ఫిర్యాదు చేయాలన్న సూచనలను ముద్రించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

వైభవంగా గణేశ్ నిమజ్జనం

భవానీపురం, సెప్టెంబరు 22: ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడి సమీపంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేశుడి నిమజ్జనోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, సీనియర్ నాయకుడు మోరబోయిన రాంబాబు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. తాటి శ్రీకాంత్, ఎం.కిరణ్, పి.త్రినాథ్, ఈశ్వర్, నాగరాజు, లీలా, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.





ముత్యాలంపాడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అందరి మంచి కోరే ప్రభుత్వమిది

సత్యనారాయణపురం, సెప్టెంబరు 22: తొలి వందరోజుల్లోనే రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సురక్షితంగా ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశిష్ట పాలన చేశారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 33వ డివిజన్ ముత్యాలంపాడు గోకరాజు గంగరాజు కల్యాణ మండపంలో 33, 29, 31, 32 డివిజన్ల ప్రజల సమక్షంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. చెత్త పాలకుడు జగన్ రెడ్డి చెత్తపై వేసిన పన్నును ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేశారని ఉమా పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు రద్దు చేసిందని, మెగా డీఎస్సీ ప్రకటించిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిందని తెలిపారు. వరద బాధితులను చంద్రబాబు ఆదుకున్నారని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాలు ప్రజల కోసమే పని చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని చంద్రబాబు ఎలా గట్టెక్కిస్తారా అని చూస్తున్న ప్రజలకు 100 రోజుల పాలన చూశాక ఒక భరోసా లభించిందన్నారు. ఇది మంచి ప్రభుత్వం పోస్టర్‌ను ఉమా ఆవిష్కరించారు. 33వ డివిజన్ ఇన్‌చార్జ్ గార్లపాటి విజయకుమార్, 31వ డివిజన్ ఇన్‌చార్జ్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, ఎరుబోతు రమణ, పడమటి రామకృష్ణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, సింగం వెంకన్న, శ్యామ్‌ప్రసాద్, శ్రీరాములు, మారుతి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన



పాతరాజరాజేశ్వరిపేటలో ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 22: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ అన్నారు. 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేటలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కూటమి నాయకులతో కలిసి డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షోభంలోనూ సంక్షేమం అందించడంలో చంద్రబాబు విజయవంతమయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విమర్శలు మానుకుని ప్రజలకు సేవ చేయాలన్నారు. వరద విపత్తు సమయంలో కూటమి నేతలు బాధితులకు అండగా నిలబడ్డారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజన చౌదరి బాధితులకు నిరంతరం అందుబాటులో ఉంటూ చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నున్నా కృష్ణ, రౌతు వాసు, ఆది పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉన్నారు: షేక్ బాజీ

పాతరాజరాజేశ్వరి పేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ నిర్వహించారు. వరద విపత్తు సమయంలో కూటమి ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి బాధితులకు వేగంగా సేవలు అందించారన్నారు. కూటమి నేతలు ముద్రబోయిన దేవకి, వసుంధర, నజియా, మల్లెపు విజయలక్ష్మి, కృష్ణ పాల్గొన్నారు.

10 టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ నిత్యాన్నదానానికి కూరగాయల లారీని పంపుతున్న వైవీ ఈశ్వరరావు తదితరులు

మొగల్రాజపురం/ పటమట, సెప్టెంబరు 22: తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి గోవిందస్వామి భక్త సమాజం సింగపూర్ సంస్థ ప్రతినిధులు 10 టన్నుల కూరగాయలను పంపించారు. పటమట కృష్ణవేణి పాఠశాల వద్ద ఆదివారం కూరగాయల లారీని లారీ యజమానుల సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ప్రారంభించారు. ఏటా నాలుగు లారీల కూరగాయలు పంపుతామని, ఇది 186వ లారీ అని ప్రతినిధులు తెలిపారు. లారీ యజమానుల సంఘం కోశాధికారి నాదెండ్ల కృష్ణ, సంస్థ ప్రతినిదులు చలసాని శ్రీనివాస్, ఏనుగుల గాంధీ, గుమ్మడి నరసింహారావు, భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వన్‌టౌన్, సెప్టెంబరు 22: కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం సౌత్ ఏసీపీ బంగార్రాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎక్కడైనా దుందుడుకు చర్యలకు పాల్పడటం, గొడవలకు దిగడం చేయొద్దని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమన్నారు. ఎవరైనా క్రిమినల్ కేసుల్లో ఉన్నట్లయితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించబోమని నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

భార్యపై కత్తితో దాడి

పాయకాపురం, సెప్టెంబరు 22: భార్యపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కండ్రిక కాలనీకి చెందిన టి.గౌతమ్‌కు గిరిపురానికి చెందిన సుమ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా మద్యానికి బానిసైన గౌతమ్ భార్యను వేధిస్తున్నాడు. శనివారం రాత్రి కూడా తప్పతాగి వచ్చిన గౌతమ్ భార్యపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లయన్స్ నూతన శాఖ స్పార్క్ ప్రారంభం

పటమట, సెప్టెంబరు 22: లయన్స్ క్లబ్ అంటే సేవతో పాటు సమాజాభివృద్ధికి నాయకులను తయారు చేయడం అని జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరిరావు అన్నారు. బెంజ్‌సర్కిల్ సమీపంలో ఆదివారం ఏర్పాటు చేసిన నూతన శాఖ స్పార్క్‌ను ఆయన ప్రారంభించారు. ఇన్‌స్టాలేషన్ అధికారి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఆంజనేయులు నూతన క్లబ్‌ను ప్రారంభించారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా బావిశెట్టి రమేష్, సెక్రటరీగా క్రాంతి కుమార్, ట్రెజరర్ నున్న సాంబశివరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ మెంబర్‌షిప్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, సర్వీస్ చైర్ పర్సన్ హనుమకుమార్, ఎల్‌సీఐఎఫ్ కో-ఆర్డినేటర్ శివశంకర్ ప్రమాణస్వీకారం చేశారు. డిస్ట్రిక్ క్యాబినెట్ ట్రెజరర్ లయన్ రవీంద్ర, జీఎస్టీ డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ చక్రధర్, జీఎంటీ ఫ్యామిలీ అండ్ ఉమెన్స్ స్పెషలిస్ట్ అక్కినేని లక్ష్మి, డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటర్ తుమ్మల రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 22: ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర గ్రంథాలయశాఖ రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు చిత్ర లేఖనంలో శిక్షణ ఇస్తున్నట్లు ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి తెలిపారు.

గొల్లపూడి పరిధిలో.. జోరుగా అక్రమ నిర్మాణాలు

ప్రభుత్వ ఆదాయానికి గండి




గొల్లపూడి హైస్కూల్ వెనుక వెంకటేశ్వరనగర్‌లో, భారతమాత వృద్ధుల ఆశ్రమం రోడ్డులో..

వన్‌టౌన్, సెప్టెంబరు 22: గొల్లపూడి పంచాయతీ పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అయినా ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోకుండా మామూళ్ల మత్తులో ఉంటున్నారని ఆరోపణలున్నాయి. కొందరు బిల్డర్లు జీప్లస్‌టూ భవన నిర్మాణానికి అనుమతులు తీసుకుని అనధికారికంగా రెండు, మూడు అంతస్థులు నిర్మిస్తున్నారు. బిల్డర్లకు ప్రైవేటు బ్యాంక్ అధికారులు కూడా నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. బిల్డర్లతో బ్యాంక్ అధికారులు లాలూచీపడి, కమీషన్లకు కక్కుర్తి పడి అడ్డగోలుగా రుణాలిస్తున్నారు. ప్రభుత్వానికి వెళ్లాల్సిన ఆదాయాన్ని బిల్డర్లు, ప్రైవేటు బ్యాంక్ అధికారులు, దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా నిర్మించిన అంతస్థుల్లో ఒక్కో ఫ్లాట్‌ను రూ.40 నుంచి రూ.60 లక్షల వరకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు పక్కదారి పడుతున్నాయి. గొల్లపూడి హైస్కూల్ వెనుక వెంకటేశ్వరనగర్‌లో రెండు భారీ అక్రమ నిర్మాణాలు జరిగాయి. బిల్డర్ ఒకరే కావటంతో జీ ప్లస్ టూ పర్మిషన్ తీసుకుని అనధికారికంగా రెండు అంతస్థులు నిర్మించారు. గొల్లపూడి మైలురాయి సెంటర్, హరిజనవాడ, భారతమాత వృద్ధుల ఆశ్రమం రోడ్డులో ఒక బిల్డర్ జీప్లస్ త్రీ భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని అనధికారికంగా మరో అంతస్థు నిర్మించారు. గొల్లపూడి పోస్టాఫీసు రోడ్డులో ఒక బిల్డర్ 280 గజాల స్థలంలో జీ ప్లస్‌టూకు అనుమతి తీసుకుని అనధికారికంగా రెండు అంతస్థులు నిర్మించారు. అదే రోడ్డులో వేరొక బిల్డర్ 200 గజాల స్థలంలో జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని రెండు అంతస్థులు నిర్మించారు. గొల్లపూడి బొడ్డురాయి సెంటర్, పంచాయతీ కార్యాలయం పక్కరోడ్డులో ఓ బిల్డర్ 300 గజాల స్థలంలో జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని అనధికారికంగా మరో భారీ అంతస్థు నిర్మాణం చేపట్టాడు. గొల్లపూడి పంట కాలువ రోడ్డు, శ్రీనివాసనగర్‌లో గ్రామ సచివాలయం సమీపంలో ఓ బిల్డర్ 180 గజాల స్థలంలో జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని మరో రెండు ఫ్లోర్లు నిర్మించాడు. అదే ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఓ బిల్డర్ జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని అనధికారికంగా మరో రెండు ఫ్లోర్లు నిర్మించాడు. మరో బిల్డర్ 200 గజాల స్థలంలో జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని అదనంగా రెండు ఫ్లోర్‌లు నిర్మించాడు. జైన్ కాలనీలో ఏసీబీ కార్యాలయం సమీపంలో వన్‌టౌన్‌కు చెందిన మార్వాడీ వ్యాపారి జీ ప్లస్‌టూ అనుమతి తీసుకుని అనధికారికంగా రెండు ఫ్లోర్లతో భారీ నిర్మాణం చేపట్టాడు. సాయిపురంకాలనీ, ట్రిబుల్ ఎస్ కాలనీ, అయ్యప్ప స్వామి గుడి వెనుక గ్రాం తాల్లో భారీ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. అయినా సీఆర్డీఏ అధికారులు, పంచాయతీ అధికారులు నిర్మాణాలను పట్టించుకోకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది.



బుడమేరు ముంపు బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంఏఎం ట్రస్ట్ చైర్మన్ మహంతి వాసు



సత్యనారాయణపురంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సాదినేని యామినీశర్మ

వరద బాధితులకు ఆపన్న హస్తం

సత్యనారాయణపురం: సౌత్‌ఇండియన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ, లంకగ్రామాల్లోని 9,000 మంది వరద బాధితులకు 20రోజులుగా దాతలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవాభారతి సంస్థల సహకారంతో రూ.10లక్షల విలువైన నిత్యావసరాలు, దుస్తులు, వంటసామగ్రిని అందజేశారు. సత్యనారాయణపురం శిశువిద్యామందిరంలో ఆదివారం ఘనపాటి, వేదపండితులు, పురోహితుల కుటుంబాలకు 25కేజీల బియ్యం, ఇతర సరుకులు అందజేశారు. ఇప్పటివరకు 100 బ్రాహ్మణ కుటుంబాలకు సహకారాన్ని అందించినట్లు ట్రస్ట్ అధ్యక్షురాలు సాదినేని యామినీశర్మ తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

చిట్టినగర్: వరద బాధితులకు క్రియేటింగ్ స్మైల్స్ సహకారంతో బీరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బీరం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిండికేట్ బ్యాంక్ కాలనీలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. జి.విజయ్‌కుమార్, ఎ.బుల్లబ్బాయి, బీఎస్కే పట్నాయక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో..

మధురానగర్: కండ్రికలో వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో రూ.65 వేల విలువైన నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.900 విలువైన సరుకులను 70 కుటుంబాలకు అందించారు. జిల్లా పూర్వపు గవర్నర్ లయన్ డి.గోపీనాథ్, జిల్లా జీఎల్టీ కో-ఆర్డినేటర్ లయన్ ఎస్‌వీవీఎస్‌వీ ప్రసాద్, జోన్ చైర్మన్ శ్యాంప్రసాద్ మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

50 కార్మిక కుటుంబాలకు కిట్లు అందజేత

పాయకాపురం: ప్రశాంతినగర్‌లోని స్పందన సేవా సమితి కార్యాలయంలో సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ 50 కార్మిక కుటుంబాలకు నెల రోజులకు సరి పడా నిత్యావసర వస్తువుల కిట్లను అందజేశారు. సమితి సభ్యులు చిన్నం రామకృష్ణ, బ్రహ్మదేశం వసంతకుమార్, బి. సుబ్బారావు, డి.మురళి పాల్గొన్నారు.

1000 మందికి కిట్లు..

పాయకాపురం: భారత్ వికాస్ పరిషత్ అమరావతి ప్రాంత ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లోని పరిషత్ కార్యాలయంలో 1000 మందికి బియ్యం, నిత్యావసర సరుకుల కిట్లను పరిషత్ సభ్యులు అందజేశారు.

యునైటెడ్ బ్రాహ్మిణ్ ఫోరం ఆధ్వర్యంలో..

అజిత్‌సింగ్‌నగర్: యునైటెడ్ బ్రాహ్మిణ్ ఫోరం ఆధ్వర్యంలో పైపులరోడ్డులోని వెలమూరి వారి శివాలయంలో వెలమూరు సీతారామశర్మ పర్యవేక్షణలో రూ.80 వేల విలువైన నిత్యావసరాలను వరద బాధిత బ్రాహ్మణ కుటుంబాలకు అందజేశామని ఫోరం చైర్మన్ డి.రామచంద్రరావు, సెక్రటరీ ఎం.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఫోరం సభ్యులు వైఎస్ శ్రీధర్, డి.రమణారావు, జి.సతీష్‌కుమార్, డి.శ్రీనివాస్, పి.శశిధర్, డి.పద్మశ్రీ పాల్గొన్నారు.

ఎంఏఎం ట్రస్ట్ చేయూత

గవర్నర్‌పేట: బుడమేరు ముంపునకు గురై సర్వం కోల్పోయిన 500 పేద కుటుంబాలకు 25వ డివిజన్ సీతారామపురానికి చెందిన మహంతి అప్పలనర్సయ్య, మహాలక్ష్మి (ఎంఏఎం) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. ప్రజాశక్తినగర్, కండ్రిక ప్రాంతాల్లో ట్రస్ట్ అధ్యక్షుడు మహంతి వాసుదేవరావు (వాసు) నేతృత్వంలో ట్రస్ట్ సభ్యులు ప్రతి కుటుంబానికి దుప్పట్లు, టవల్స్, లుంగీలు, చీరలు అందజేశారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రాంతంలో ఇప్పటి వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.7 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు, వస్తు సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కోటేశ్వరరావు, కలిశెట్టి అప్పన్ననాయుడు, రౌతు దుర్గారావు పాల్గొన్నారు.

28 వరకు మహాగణపతి ఉత్సవాలు

భవానీపురం, సెప్టెంబరు 22: విద్యాధరపురం లేబర్ కాలనీ స్టేడియం గ్రౌండ్స్‌లో వైభవోపేతంగా నిర్వహిస్తున్న డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల భారీ మట్టి గణపతి మహోత్సవాలను ఈనెల 28వ తేదీ వరకు నిర్వహిస్తామని నిర్వాహకుడు డూండీ రాకేశ్ తెలిపారు. 28న మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం, 4.30 గంటలకు లడ్డూ వేలం, సాయంత్రం 6 గంటలకు ఉన్నచోటే మట్టి మహాగణపతి విగ్రహంలో అమర్చిన ట్యూబులతో నిమజ్జనం చేస్తామని తెలిపారు.

గోపాలరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

భవానీపురం, సెప్టెంబరు 22: సీపీఐ సీనియర్ నాయకుడు, ప్రజా కళాకారుడు పంచదార్ల గోపాలరావు మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు అధ్యక్షతన భవానీపురంలో ఆదివారం గోపాలరావు సంస్మరణసభ నిర్వహించారు. గోపాలరావు చిత్రపటానికి కోటేశ్వరరావు నివాళి అర్పించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు కేవీ భాస్కరావు, పంచదార్ల దుర్గాంబ, మాజీ కార్పొరేటర్ డీవీ రమణబాబు, నాయకులు శర్మ, నజీర్, సూరిబాబు, జాని, రంగారావు, మాతంగి ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్సు, సెప్టెంబరు 22: కానూరు 100 అడుగుల రోడ్డు సమీపంలోని అనుమోలు ప్రభాకర్ గ్రౌండ్స్‌లో ఈనెల 24, 25 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బీ చక్రవర్తి తెలిపారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్లు సంయుక్తంగా నిర్వహించే ఈ టోర్నీని 24న ఉదయం 8 గంటలకు జిల్లా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల 12 ఫుట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయన్నారు. పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి అభినందన



జాతీయ పోటీలకు ఎంపికైన సారికా సర్వజ్ఞను అభినందిస్తున్న హెచ్‌ఎం ఎం.సూర్యప్రభ

సత్యనారాయణపురం, సెప్టెంబరు 22: బాల్ బాడ్మింటన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎన్టీవీఆర్ హైస్కూల్ విద్యార్థిని సారికా సర్వజ్ఞని హెచ్‌ఎం ఎం.సూర్యప్రభ ఆదివారం పాఠశాలలో అభినందించారు. ఇటీవల అన్నవరంలో నిర్వహించిన సబ్ జూనియర్ రాష్ట్ర పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తరఫున పాల్గొన్న సారికా సర్వజ్ఞ అత్యుత్తమ క్రీడాప్రదర్శనతో ఈనెల 25 నుంచి 29వరకూ రోహతక్‌లో నిర్వహించే 43వ సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఉపాధ్యాయురాలు అలివేలమ్మ, వ్యాయామ అధ్యాపకుడు వెంకట్‌రావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



అంబేద్కర్‌నగర్‌లోని దేవదాయశాఖ స్థలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

పటమట: 14వ డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో ఐదెకరాల దేవదాయశాఖ ఖాళీ స్థలం ఉంది. అక్కడ ఆదివారం, ఇతర సెలవు దినాల్లో విద్యార్థులు, యువకులు వాలీబాల్, క్రికెట్ ఆడుతుంటారు. ఆ పక్కనే విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భవానీపురం, సెప్టెంబరు 22: బీజేపీ సభ్యత్వ నమోదుకు యువత, అన్నివర్గాల నుంచి విశేష స్పందన వస్తోందని ఆ పార్టీ 45వ డివిజన్ ఇన్‌చార్జి దుర్భేసుల మీరావలి తెలిపారు. సితార సెంటర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును ఆదివారం ఆయన ఘనంగా ప్రారంభించారు. స్థానికులు స్వచ్ఛందంగా సభ్యత్వ నమోదులో పాల్గొన్నారని తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు మూడు రోజులు ఉంటుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి గన్నవరపు శ్రీనివాసరావు, నాయకులు దుర్భేసుల హుస్సేన్, దొడ్ల రాజా పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల నిర్వహణకు
పోలీసు ఉత్సవ కమిటీ

వన్‌టౌన్, సెప్టెంబరు 22: దసరా మహోత్సవాల సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పూజల నిర్వహణకు 17 మందితో కమిటీని నియమిస్తూ వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్‌ఐలు వీజీవీడీ ప్రసాద్ అలియాస్ గోపి, ఎం.ఎస్.రామకృష్ణారెడ్డి, ఎం.రామ్మోహనరావు, కె.నాగజ్యోతి, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.ఏడుకొండలు, బి.రాధాకృష్ణ(1541), సీహెచ్‌కేఎస్‌వీడీ ప్రసాద్, ఎం.దుర్గారావు, ఎస్.సత్యనారా యణ, ఏకేడీ సత్యనారాయణ, బి.రాధాకృష్ణ(511), కె.శివరామకృష్ణ, ఆర్.సుజాత, కానిస్టేబుళ్లు జి.చైతన్య జి.డి.టి వాసు, బి.రామాంజనేయులు, వై.వి.రమణ కమిటీలో ఉన్నారు. ఆమోదం కోసం పోలీసు కమిషనర్‌కు పంపించారు.

అజాతశత్రువు అడుసుమిల్లి జయప్రకాష్

● సమతాసేవా సమితి కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు

పటమట, సెప్టెంబరు 22: టీడీపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ అజాతశత్రువు, రాజకీయ దురంధరుడని సమతా సేవాసమితి కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. జయప్రకాష్ తనకు గురు సమానులని, ఆయన మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

సచివాలయాల్లో వరద బాధితుల జాబితాలు



46వ డివిజన్ పరిధిలోని సచివాలయంలో జాబితాలో పేర్లు చూసుకుంటున్న వరద బాధితులు

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 22: బుడమేరు వరదల్లో కలిగిన నష్టాన్ని గణన చేశాక పరిహారానికి అర్హుల జాబితాను 32 వార్డుల్లోని సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. జాబితాలపై అభ్యంతరాలుంటే స్పెషల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు. ఆదివారం కండ్రిక కాలనీ, పాయకాపురం, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అభ్యంతరాలు సోమవారమూ తెలియజేయొచ్చన్నారు.

సచివాలయాల వద్ద బాధితుల బారులు

చిట్టినగర్: డివిజన్లలో సచివాలయాల నష్ట పరిహారానికి అర్హుల వివరాలను బోర్డులపై అటించారు. తమ పేర్లు ఉన్నాయో లేవోనని తెలుసుకునేందుకు బాధితులు సచివాలయాల వద్ద బారులు తీరారు. కొందరు తమ పేర్లు నమోదు కాలేదని సచివాయాల్లో అధికారులను కలిశారు. సచివాలయాల పరిధిలో మ్యాపింగ్ అయిన పేర్లు మాత్రమే యాప్‌లో నమోదయ్యాయని వాటి ప్రకారమే అధికారులు నమోదు చేశారని కొంతమంది బాధితులు చెబుతున్నారు. అందరి వివరాలను నమోదు చేశామని అధికారులు చెబుతున్నారు. పేర్లు లేని వారు మరల నమోదు చేసుకునే అవకాశం ఉండటంతో తమ డివిజన్ పరిధిలోని సచివాలయాల అడ్మిన్లను కలిసి వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం ముందుగా చెప్పినట్లు నష్టపోయిన ప్రతి బాధితుడికి న్యాయంచేయాలని కోరుతున్నారు.

ఈ వారం మరో 11 ఐపీఓలు

» 14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్క్లోస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందు కోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సీరిస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

- మారుతి సుజుకీ.. వ్యాగన్‌ఆర్ వాల్ట్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో ప్రత్యేకమైన స్టైలింగ్, కొత్త ఫీచర్లను చేర్చింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్స్‌లో వ్యాగన్‌ఆర్ వాల్ట్ అందుబాటులో ఉండనుంది. 1లీటర్, 1.2 లీటర్ అడ్వాన్స్‌డ్ కే-సిరీస్ ఇంజన్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ధరలు రూ.5.64 లక్షలు- రూ.6.71 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి.

- ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రెండు కొత్త క్రెడిట్ కార్డ్స్‌ను తీసుకువచ్చింది. మయూర, అశ్వ పేర్లతో ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మయూర కార్డును డిజైన్ చేయగా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అశ్వ కార్డును రూపొందించింది.

- బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే రూ.3,500 కోట్ల ఏయూఎం (ఆస్తుల నిర్వహణ)ను అధిగమించిందని బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇప్పటికే ఈ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ 41.30 శాతం, డైరెక్ట్ ప్లాన్ 43.43 శాతం రిటర్నులు అందించిందని తెలిపింది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో నిఫ్టీ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,300

నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.


బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు		
నిరోధం :	25,850	25,930
మద్దతు :	25,760	25,700



ఎక్సైజ్‌లో సిఫారసుల వెల్లువ!

» బదిలీల కోసం మంత్రిపై పెరుగుతున్న ఒత్తిళ్లు

» ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం విపరీతమైన పోటీ

» 'వైసీపీ' అధికారులకూ నేతల లేఖలు

» మాకు ఇప్పుడూ అన్యాయమేనా?

» వైసీపీ బాధిత అధికారుల ఆవేదన

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి ఆ శాఖ మంత్రిపై తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు కొన్ని బదిలీలను మాత్రమే రాజకీయ సిఫారసులపై చేస్తే, మిగిలినవి సమర్థత, సీనియారిటీ ఆధారంగా చేసేవారు. కానీ ఇప్పుడు ఉన్నతాధికారుల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అన్ని స్థాయిల పోస్టింగుల కోసం సిఫారసులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మద్యం షాపులు, బార్లు ఎక్కువగా ఉండే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఇతర ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం అధికారుల మధ్య పోటీ విపరీతంగా పెరిగింది. గత ప్రభుత్వంలో రెండుగా చీలిపోయిన ఎక్సైజ్ శాఖ ఏకీకరణ జరగడం, ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తుండటంతో ఎక్సైజ్‌లో పోస్టింగులకు డిమాండ్ పెరిగింది. ముఖ్య నగరాలు, పట్టణాలు ఎక్కువగా ఉండే జిల్లాలు కావాలని అధికారులు పోటీపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మూడు కేడర్ల అధికారులూ అవే కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్దఎత్తున సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొందరు అధికారులకూ మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో పోస్టింగుల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏఈఎస్, సీఐల వరకు అన్ని కేడర్ల పోస్టులకూ భారీగా పోటీపడుతున్నారు. అయితే ఆ జిల్లాలో తాను చెప్పిన వారికే పోస్టింగులు ఇవ్వాలని ఓ ఎమ్మెల్యే పట్టుబడుతున్నారు. ఈ జిల్లాలో పోస్టింగుల కోసం కొందరు మంత్రులు ఇచ్చిన సిఫారసుల లేఖలనూ పక్కన పెడుతున్నట్లు తెలిసింది. అయితే ఆ ఎమ్మెల్యే 'వైసీపీ' అధికారులకూ సిఫారసు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఆ నగరం రిజర్వ్ కోటాలోకి వెళ్లిపోయింది. విశాఖపట్నంలో పాతుకుపోయిన అధికారులకే పోస్టింగులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు అధికార వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అప్పుడూ.. ఇప్పుడూ

గత ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు మళ్లీ మంచి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ కాలం విజయవాడలో పనిచేసిన అధికారి ఇప్పుడు మళ్లీ విజయవాడకు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో స్పెషల్ సీఎస్‌తో కలిసి ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే బార్లకు మేలు చేసేందుకు ప్రభుత్వ మద్యం షాపులను మార్చేశారు. అప్పట్లో విశాఖపట్నంలో హవా సాగించిన మరో అధికారి ఇప్పుడు మళ్లీ అదే కావాలని ప్రయత్నిస్తున్నారు.

మహిళా అధికారులూ.. పోటాపోటీ

ఏలూరు డిప్యూటీ కమిషనర్ పోస్టు కోసం ఇద్దరు మహిళా అధికారుల మధ్య భారీ పోటీ ఏర్పడింది. వారిలో ఓ అధికారిపై 'వైసీపీ' ముద్ర ఉంది. గత ప్రభుత్వంలో డిస్టిలరీ విభాగంలో పని చేసి, అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో అంటకాగినట్లు విమర్శలున్నాయి. మరో అధికారి రాయలసీమలో పనిచేశారు. నాయకులు ఈ ఇద్దరికీ సిఫారసులు లేఖలు ఇవ్వడంతో పోటీ ఏర్పడింది. ఇక గుంటూరు ఈఎస్ పోస్టు కోసం కూడా ఇద్దరు మహిళా అధికారులు పోటీపడుతున్నారు. వారిలో ఓ అధికారి గత ప్రభుత్వంలో సెబ్‌లో చక్రం తిప్పారు. మద్యం డిపోలో పనిచేస్తున్న మరో అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇక, గత ప్రభుత్వంలో అనామక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు కూడా తమకు అన్యాయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జేసీ స్థాయిలోని ఓ అధికారి గత ప్రభుత్వంలో బాధిత అధికారిగా ఉన్నారు. గత ప్రభుత్వంలో వేధింపులకు గురిచేయడంతో తాను ఇక్కడ ఉండలేనని, తెలంగాణకు వెళ్లిపోతానని కూడా దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి వారికి ఇప్పుడైనా న్యాయం చేస్తారా? అనే సందేహాలు నెలకొన్నాయి.

డీఆర్‌డీఏ పీడీల బదిలీలు

23 మంది మున్సిపల్ కమిషనర్లు కూడా..

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు డీఆర్‌డీఏ పీడీలతో పాటు మున్సిపల్‌శాఖ పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. భీమిలి డివిజన్ డీఎల్‌డీఓ బి.లక్ష్మీపతిని విశాఖపట్నం డీఆర్‌డీఏగా పీడీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పీడీ ఎం.ఎస్ శోభారాణిని ఆమె సొంత శాఖ సాంఘికసంక్షేమశాఖకు బదిలీ చేశారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారి టి.వి. విజయలక్ష్మిని గుంటూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎల్‌డీఓ డి.ప్రతాప్‌రెడ్డిని కర్నూలు డీఆర్‌డీఏ పీడీగాను, నగరి డ్వామా క్లస్టర్ ఏపీడీగా ఉన్న టి.ఎన్. శోభన్‌బాబును తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగాను, కృష్ణా డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వి.నాగరాజకుమారిని నెల్లూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీగా ఉన్న డీఎంకే తులసిని ఆమె సొంత శాఖ వాణిజ్య పనులశాఖకు రీపాట్రియేట్ చేశారు. శ్రీకాకుళం డ్వామా ఏఓగా ఉన్న డీఎల్‌డీఓ విద్యాసాగర్‌ను అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాక ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా మున్సిపల్‌శాఖలోనూ బదిలీలు చేశారు. అదే విధంగా పలు జిల్లాలకు సంబంధించి ఎంపీడీఓల అంతర్‌జిల్లాల బదిలీలు కూడా చేపట్టారు. పలువురు ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు ఇచ్చారు.

అటవీశాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు

సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖలో 13మంది స్టేట్ క్యాడర్‌లోని అసిస్టెంట్, డిప్యూటీ కన్జర్వేటర్లను ప్రభుత్వం బదిలీ చేసి, పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్ ఆఫీస్‌లోని ఎం.శామ్యూల్‌ను అనకాపల్లి డీఎఫ్‌వోగా, కృష్ణా జిల్లా డీఎఫ్‌వో కె.రాజశేఖర్‌రావును ప్రకాశం జిల్లా సోషల్ ఫారెస్ట్‌కు, ప్రకాశం డీఎఫ్‌వో పి.సునీతను కృష్ణా జిల్లాకు, ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వోగా, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో టి.నాగమణేశ్వరిని నంద్యాలకు, చింతపల్లి సోషల్ డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, పాడేరు డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, రాజమండ్రి ఏసీఎఫ్ టి.చక్రపాణిని శ్రీసత్యసాయి డీఎఫ్‌వోగా, పల్నాడు డీఎఫ్‌వో ఎన్.రామచంద్రరావును మంగళగిరి ఎఫ్‌యూఓగా, తిరుపతి డీఎఫ్‌వో జి.సతీష్‌ను ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వోగా, గిద్దలూరు డీఎఫ్‌వో వై.వి.నరసింహారావును చింతపల్లికి, రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌ఏ డీఎఫ్‌వో ఇ. హారికను సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వోగా, ఈస్ట్‌గోదావరి డీఎఫ్‌వో బి.నాగరాజును రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌ఏ డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్‌లు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 23 సెప్టెంబరు 2024
features@andhrajyothy.com



బుకర్ ప్రైజ్... ఆంగ్ల సాహిత్యంలో ప్రతిష్టాత్మక పురస్కారాల్లో ఒకటి. దీనికి షార్ట్‌లిస్ట్ అయ్యే వారిలో ప్రతిసారీ పురుషులే ఎక్కువ. ఈ ఏడాది మాత్రం... ఎంపికైన ఆరుగురిలో అయిదుగురు రచయిత్రులే. యాభై అయిదేళ్ళ 'బుకర్' చరిత్రను తిరగరాసిన ఆ మహిళలు ఎవరంటే...

బుకర్ బరిలో... అతివలు అయిదుగురు

సమంతా హార్వే

వయసు: 49 | దేశం: బ్రిటన్
బుకర్‌కు ఎంపికైన రచన: ఆర్బిటాల్



సమంతా రచనా శైలిని ప్రముఖ రచయిత్రి వర్జీనియా ఉల్ఫ్‌తో పోలుస్తారు అభిమానులు. ఆమె రాసిన అయిదు నవలలు అటు పాఠకుల నుంచి, ఇటు విమర్శకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందాయి. ఆమె 'యూనివర్సిటీ ఆఫ్ యార్క్', 'యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్'లో ఫిలాసఫీ చదివారు. కవితాత్మకమైన వచనం ఆమె ప్రత్యేకత. మానవ మనస్తత్వం గురించి లోతైన విశ్లేషణలు ప్రధానంగా ఉంటాయి. సమంతా రచనలు పన్నెండుకు భాషల్లో అనువాదమయ్యాయి. వాటికి పలు పురస్కారాలు దక్కాయి. "అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న ఆరుగురు వ్యోమగాముల చుట్టూ ఇది తిరుగుతుంది. 'భూమిలేని జీవితం ఏవిటి? మానవాళి లేని భూమి ఏమిటి?' అని ఆ వ్యోమగాములు ఆలోచించడం ప్రారంభిస్తారు. భూమి దిగువ కక్ష్యలో మానవులు నివాసం ఏర్పరచుకోవడం గురించి రాయాలని పాతికేళ్ళుగా అనుకుంటున్నాను. అయితే సైన్స్‌ఫిక్షన్‌గా కాదు, వాస్తవికత ఉట్టిపడేలా. అందరూ నివసించాలని కోరుకొనే ఒక ప్రదేశం సౌందర్యాన్ని ఒక ప్రకృతి రచయిత మాదిరిగా కళ్ళకు కట్టేలా చెప్పగలనా? ఇవీ నా ఆలోచనలు. ఈ రచన 'బుకర్' పరిశీలనలో ఉన్నందుకు సంతోషంగా ఉంది" అంటూ 'ఆర్బిటల్' నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. సమంతా.

అన్నే మైఖెల్స్

వయసు: 66 | దేశం: కెనడా
బుకర్‌కు ఎంపికైన రచన: హెల్డ్



ఇరవయ్యొనిమిదేళ్ళ కాలంలో అన్నే మైఖెల్స్ రాసినవి మూడే నవలలు. మొదటి నవల 'ఫ్యూజిటివ్ పీసెస్'కు అక్షరాలా పన్నెండు పురస్కారాలు వచ్చాయి. రెండో నవల 'వింటర్ వాలెట్'కూ అద్భుతమైన ఆదరణ దక్కింది. ఆ తరువాత పధ్నాలుగేళ్ళకు... తన మూడో నవల 'హెల్డ్'తో మళ్ళీ సంచలనం సృష్టిస్తున్నారామె. అన్నే కేవలం నవలాకర్త మాత్రమే కాదు... గొప్ప కవయిత్రి. కవితా రచనను ప్రారంభించిన తొలి రోజుల్లోనే ఆమె వెలువరించిన తొలి సంకలనం 'ది వెయిట్ ఆఫ్ ఆరెంజెస్'ను 'కామన్వెల్త్ పొయెట్రీ ప్రైజ్ ఫర్ ది అమెరికాస్' పురస్కారం వరించింది. ఆ తరువాత వరుసగా ప్రచురితమైన మరో ఆరు కవితా సంకలనాలు... ఆస్ట్రేలియాలో అత్యుత్తమ కవయిత్రుల్లో ఒకరిగా ఆమెను నిలబెట్టాయి. మఅమె రచనలు, వాటి అనువాదాలు 45కు పైగా దేశాల్లో ప్రచురితమయ్యాయి. ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయిన 'హెల్డ్' నవల... నాలుగు తరాల జీవిత సమాహారం. "ఆ నవల రాస్తున్నంత కాలం... 'ఈ అత్యవసరమైన సమయాల్లో... వినలేనంత చిన్నదైనా సరే... ఎలాంటి స్వరం మనకు అవసరం?' అని ప్రతి రోజూ నన్ను నేను ప్రశ్నించుకున్నాను. దానికి అనుగుణంగానే కథా నేపథ్యాన్ని, శైలిని ఎంచుకున్నాను" అంటూ 'హెల్డ్'ను రాయడం వెనుక తన ఆలోచనలను అన్నే పంచుకున్నారు.

ఛార్లెట్ వుడ్

వయసు: 59 | దేశం: ఆస్ట్రేలియా
బుకర్‌కు ఎంపికైన రచన: స్టోన్ యార్డ్ డివోషనల్



పలు ప్రతిష్ఠాత్మకమైన బహుమతుల జాబితాలో తరచూ కనిపించే పేరు ఛార్లెట్ వుడ్. విమర్శకుల ప్రశంసలూ ఆమెకు కొత్త కాదు. కొన్ని పదుల అవార్డుల్ని గెలుచుకున్న ఆమెను 'సొంత గొంతు కలిగిన, ప్రేరణ కలిగించే ఆస్ట్రేలియన్ రచయితల్లో ఒకరు' అని 'ది ఆస్ట్రేలియన్' పత్రిక ప్రశంసించింది. క్రియేటివ్ ఆర్ట్స్‌లో మాస్టర్స్ డిగ్రీ అందుకొని, 'యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్'లో పిహెచ్‌డి చేసిన ఛార్లెట్ పాత్రికేయ వృత్తిలో కొన్నాళ్ళు ఉన్నారు. 'పీసెస్ ఆఫ్ ఎ గర్ల్'తో ఆమె రచనా వ్యాసంగం ప్రారంభమయింది. ఏడు నవలలతో పాటు కొన్ని కాల్పనికేతర రచనలు కూడా చేశారు. కిందటి ఏడాది ప్రచురితమైన 'స్టోన్ యార్డ్ డివోషనల్' నవల ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయింది. "ఈ నవలలోని అంశాలన్నీ నా జీవితం, బాల్యానికి సంబంధించినవి. వాటిని ఏకంతంగా గడిపే ఒక మత సమాజం గురించి నేను ఊహించుకున్న కథతో కలగలిపాను. ఈ నవలను కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో రాశాను. అప్పుడే నేను తీవ్ర అనారోగ్యం నుంచి బయటపడ్డాను. కొవిడ్, అస్వస్థత.. ఈ రెండూ మానసికంగా అనిశ్చితి కలిగించాయి. గందరగోళంలో నిశ్చలత్వాన్ని సాధించడంలో నైపుణ్యం పొందడానికి ప్రయత్నించాను. ముందే చెప్పినట్టు అందరికీ దూరంగా ఉండే ఒక మత సమాజంలో క్షమాగుణం, దుఃఖం, మహిళలతో స్నేహాల కోసం నిర్భయమైన అన్వేషణే ఈ నవల" అంటారు ఛార్లెట్.

రాచెల్ కుష్నర్

వయసు: 55 | దేశం: అమెరికా
బుకర్‌కు ఎంపికైన రచన: క్రియేషన్ లేక్

అయిదేళ్ళ వయసులో... అమ్మ చెయ్యి పట్టుకొని బుక్ స్టోర్స్‌లో బిడియంగా అడుగుపెట్టిన రాచెల్ కుష్నర్‌కు బాల్యం నుంచే పఠనం ప్రధాన ఆసక్తిగా మారింది. 'పొలిటికల్ సైన్స్-ఫారిన్ పాలసీ'లో బ్యాచిలర్ డిగ్రీ చదివారు. ఆ తరువాత స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో ఇటలీకి వెళ్ళి, 'బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్' పూర్తి చేశారు. కొలంబియా యూనివర్సిటీలో క్రియేటివ్ రైటింగ్‌లో 'మాస్టర్ ఆఫ్ ఫైనార్ట్స్' డిగ్రీ తీసుకున్నారు. చదువుకొనే రోజుల్లోనే సంపాదన కోసం నైట్ క్లబ్‌లో క్లర్క్‌గా పని చేశారు. అనంతరం న్యూయార్క్‌లో ఎనిమిదేళ్ళు పాత్రికేయురాలిగా ఉన్నారు.



'గ్రాండ్ స్ట్రీట్' తదితర పత్రికలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలోనే కళారంగంపై రాచెల్ రాసిన వ్యాసాలు ఆమెకు మంచి గుర్తింపు తెచ్చాయి. 2008లో విడుదలైన 'టెలెక్స్ ఫ్రమ్ క్యూబా' ఆమె మొదటి నవల. 1967లో జరిగిన 'ఆరు రోజుల (అరబ్-ఇజ్రాయెల్) యుద్ధం' యాభయ్యో వార్షికోత్సవం సందర్భంగా... ఇజ్రాయిల్ ఆక్రమణపై ఒక పుస్తక ప్రచురణకు నిర్ణయించిన 'బ్రేకింగ్ ది సైలెన్స్' సంస్థ తరఫున 2016లో ఇజ్రాయెల్ వెళ్ళారు. ఆ సందర్శన తన దృక్పథంలో అనేక మార్పులు తీసుకువచ్చిందని ఆమె చెబుతారు. ఇప్పటివరకూ ఆమె ఏడు నవలలు రాశారు. తాజా నవల 'క్రియేషన్ లేక్'... 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయింది. సీక్రెట్ ఏజెంట్ అయిన ముప్ఫై నాలుగేళ్ళ అమెరికన్ మహిళ ప్రధాన పాత్రగా ఈ కథ నడుస్తుంది. "ఫ్రాన్స్ రాజధాని పారిస్ నుంచి ఆ దేశంలోని గ్రామీణ ఔట్‌పోస్ట్‌కు వెళ్ళే యువకుల బృందం గురించి నేను చాలా కాలంగా ఒక కథ చెప్పాలనుకున్నాను. అదే సమయంలో పూర్వ చరిత్ర మీద నాకు ఆసక్తి కలిగింది.. 'మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఎక్కడున్నాం?' అనే ప్రశ్న మనం వేసుకోవాలి. ఆ ప్రశ్న వేసుకోడానికి ప్రతి రోజూ సరైన తరుణమే అనుకుంటాను. ఈ సంఘర్షణను ప్రతిఫలించే స్పై థ్రిల్లర్... క్రియేషన్ లేక్" అంటూ తన రచన గురించి వివరించారు

యేల్ వాన్ డెర్ వూడెన్

వయసు: 37 | దేశం: నెదర్లాండ్స్
బుకర్‌కు ఎంపికైన రచన: ది సేఫ్ కీప్



ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో యూదు తల్లికి, యూదేతర తండ్రికి యేల్ వాన్ జన్మించారు. ఆ తరువాత ఆమె కుటుంబం నెదర్లాండ్స్‌కు వలస వెళ్ళింది. చరిత్ర, సాహిత్యం ఆమె అభిమాన విషయాలు. పలు యూనివర్సిటీల్లో క్రియేటివ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, లిటరేచర్ గురించి బోధించారు. అనేక పత్రికల్లో కళలు, సాహిత్యంపై వ్యాసాలు రాశారు. ఆమె కథలు ఎన్నో బహుమతులను అందుకున్నాయి. ఈ ఏడాది 'బుకర్ ప్రైజ్'కు షార్ట్‌లిస్ట్ అయిన 'ది సేఫ్ కీప్' ఆమె తొలి నవల. అంతేకాదు... ఆ బహుమతికి నామినేట్ అయిన తొలి డచ్ రచయితగానూ చరిత్రకెక్కారు. "ఈ నవల ఎందుకు రాశాననే ప్రశ్నకు... అనేక సమాధానాలు ఉన్నాయి. నెదర్లాండ్స్‌లో స్థిరపడిన ఇజ్రాయిలీ కుటుంబం మాది. వలస వచ్చిన చోట మా అస్తిత్వ మూలాల గురించి ఆలోచన, వాటిని వెతుక్కొనే ప్రయత్నాలు ఎంతో సంఘర్షణాత్మకమైనవి. ఒకసారి... నా సన్నిహితుల అంత్యక్రియల్లో పాల్గొని, కారులో తిరిగి వస్తున్నాను. విశాలమైన డచ్ వ్యవసాయ క్షేత్రాలు దారిలో కనిపిస్తున్నాయి. ఏదో దుఃఖం నాలో కదిలింది. దాని నుంచి ఎలా తప్పించుకోవాలి? అప్పుడు ఒక ఇల్లు, ఒక మహిళ, ఒక అపరిచితుడు... ఈ పాత్రలు నాలో మెదిలాయి. అదే రెండో ప్రపంచయుద్ధం ముగిసిన పదిహేనేళ్ళ తరువాత... నెదర్లాండ్స్‌లో జరిగే ఫ్యామిలీ డ్రామా- ది 'సేఫ్ కీప్'" అంటూ తన నవల నేపథ్యాన్ని వివరించారు యేల్ వాన్. ప్రస్తుతం బోధన కొనసాగిస్తూనే... రచనా వ్యాసంగంలో తదుపరి అడుగులకు ఆమె సిద్ధమవుతున్నారు.

పదిహేనేళ్ల వయసులో పెళ్లి.... పద్దెనిమిదేళ్లు వచ్చే సరికి ఇద్దరు పిల్లలు. బాల్యంను గుర్తు చేసుకుంటే కన్నీళ్లే తప్ప తీపి జ్ఞాపకాలు ఏమీ లేవు. కానీ ఇప్పుడు మారథాన్‌లో రికార్డులు సృష్టిస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. మనాలీకి చెందిన టెంజిన్ డోల్మా మారథాన్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం.

మనాలీ మారథాన్ క్వీన్



లడఖ్ మారథాన్‌లో భాగమైన సిల్క్ రూట్ అల్ట్రా 122 కి.మీ మేర సాగుతుంది. ఈ మారథాన్‌ను 18 గంటల్లో పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు డోల్మా. కానీ 17 గంటల 3 నిమిషాల్లోనే పూర్తి చేసి మారథాన్‌లో అందరి మన్ననలు అందుకున్నారు. 30 ఏళ్ల వయసులో మారథాన్ మొదలుపెట్టి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారామె. అలా అని తను మారథాన్‌లో ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. మారథానర్‌గా మారడం యాదృచ్ఛికంగా జరిగిపోయిందని అంటారు డోల్మా. హిమాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల గ్రామం కొమిక్‌లో జన్మించారామె. ఆసియాలోనే ఎత్తైన గ్రామంగా కొమిక్‌కు గుర్తింపు ఉంది. డోల్మా చిన్నతనంలో వాళ్ల కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయింది. దాంతో ఏడో తరగతి తరువాత చదువు మానేసింది. తండ్రి చనిపోవడంతో ఆర్థిక సమస్యలు ఎక్కువయ్యాయి. నలుగురు తోబుట్టువులలో డోల్మా చిన్నది. 15 ఏళ్లకే తనకు పెళ్లి చేశారు. 18 ఏళ్ల



వచ్చే సరికి ఒక బాబు, ఒక పాప జన్మించారు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. పిల్లల ఆలనాపాలనా చూసుకోవడంతోనే సరిపోయేది. కానీ 3 సెప్టెంబరు 2017 ఆమె జీవితాన్నే మార్చేసింది. లడఖ్ హాఫ్ మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచింది డోల్మా. "ఆ రోజు నా జీవితం మారిపోయింది" అని అంటారు డోల్మా. 30 ఏళ్ల వయసులో ఎలాంటి శిక్షణ, ఆటల్లో అనుభవం లేకున్నా 21.9 కి.మీ మారథాన్‌లో విజేతగా నిలిచారు డోల్మా.

పరుగు ఇలా మొదలు

ఏడేళ్ల క్రితం డోల్మీ స్నేహితురాలు మనాలీలో జరుగుతున్న 21కె మారథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. ఆమె సూచన మేరకు డోల్మీ కూడా తన పేరు నమోదు చేసుకున్నారు. ఆ మారథాన్‌లో అనుభవం ఉన్న రేసర్లు, పోలీస్ ఫోర్స్‌లో పనిచేస్తున్న మహిళలను వెనక్కినెట్టి డోల్మీ విజేతగా నిలిచారు. "ఆ గెలుపు నాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. నేను పరుగెత్తడం ప్రారంభించగానే నా కళ్లముందు నా బాల్యం కదలాడింది. గమ్యాన్ని చేరుకునే వరకు పరుగును ఆపొద్దని అనుకున్నా" అని ఆనాటి సంగతులను పంచుకుంటారు డోల్మా. భర్త, కుటుంబ సభ్యుల నుంచి సంపూర్ణ సహకారం లభించడంతో ఆత్మవిశ్వాసంతో ఆ మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచింది.

అదే నాకు శిక్షణ

లేహ్-మనాలీ హైవేపై నిర్వహించిన 480 కి.మీ మారథాన్ డోల్మాకు ఒక ఛాలెంజింగ్‌గా నిలిచింది. ఈ మారథాన్‌ను పూర్తి చేయడానికి శారీరకంగా దృఢంగా ఉంటే సరిపోదు. ఉక్కు సంకల్పం కూడా కావాలి. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండే ఎత్తైన ప్రాంతాలలో, మంచు వాతావరణంలో మారథాన్ అంత సులభం కాదు. కానీ డోల్మా ఆ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. "ఒక్కోసారి రోజుకు 40 కి.మీ మాత్రమే పరుగెత్తడానికి వీలయింది. అయితే మారథాన్‌ను పూర్తి చేయలేనని ఎప్పుడూ అనిపించలేదు" అని అంటారు డోల్మా. హెల్ అల్ట్రా మారథాన్‌ను టైం లిమిట్‌లో పూర్తి చేసిన మొదటి మహిళగా డోల్మా గుర్తింపు సాధించారు. సముద్ర మట్టానికి 10వేల అడుగుల ఎత్తులో ఉన్న లాహౌల్‌లో నిర్వహించిన స్నో మారథాన్‌లో మూడు సార్లు విజయం సాధించారు. ఎముకలు కొరికే చలిలో జరిగే ఈ మారథాన్‌లో వరుసగా మూడేళ్లు తనే విజేతగా నిలిచారు. "కోచ్, శిక్షణ లేకుండా ఇన్నాళ్లుగా ఎలా పరుగెడుతున్నావు అని చాలా మంది నన్ను అడుగుతుంటారు. దానికి నా సమాధానం నేను పాల్గొన్న ప్రతి రేసు నాకు శిక్షణలా ఉపయోగపడింది" అని అంటారు డోల్మా. చక్కని ఆహారపు అలవాట్లు, యోగా, మంచి నిద్ర వంటివి కూడా డోల్మా విజయానికి కారణం. కొన్నేళ్లుగా డోల్మా జంక్ ఫుడ్‌ను ముట్టుకోవడం లేదు. ఇంట్లో వండిన ప్రొటీన్ ఆహారాన్ని మాత్రమే తీసుకుంటారు. మనాలి సమీపంలో ఉన్న కోఠి అనే గ్రామంలో భర్తతో కలిసి కేఫ్‌ని నడుపుతున్నారామె. అక్కడికి సమీపంలో ఉన్న రోహతంగ్ లాను సందర్శించేందుకు పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఆ దారిలోనే ఈ కేఫ్ ఉంది. మూడు పదుల వయసులో మారథాన్ మొదలుపెట్టి రికార్డులు సృష్టించడం ద్వారా ఎంతో మంది యువతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు డోల్మా.

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
6. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
7. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
8. నైనా (క్రూ)
9. ఓ మాహీ (డంకీ)
10. చలేయా (జవాన్)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

నవ్య | చిత్రజ్యోతి



షూటింగ్స్‌కు చిన్న బ్రేక్ ఇచ్చిన సమంత పెళ్లి పెద్ద అయ్యారు. ఆమె సోదరుడు డేవిడ్ పెళ్లి ఇటీవలే అమెరికాలోని విస్కాన్సిన్‌లో ఘనంగా జరిగింది. పెళ్లి పనులను దగ్గరుండి చూసుకున్నారు సమంత. తమ్ముడి పెళ్లి ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నారు.

నాకేం ఆ ఉబలాటం లేదు

- సిమ్రాన్



'స్టార్ హీరోల సరసన నటించేందుకు సిమ్రాన్ వెంపర్లాడుతున్నారంటూ కొందరు డిజిటల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నన్ను సంప్రదించకుండా ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్నవాళ్లంతా నాకు క్షమాపణలు చెప్పాలి' అని నటి సిమ్రాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె స్వీయ నిర్మాణంలో విజయ్‌తో భారీ బడ్జెట్ సినిమా చేసేందుకు ప్రయత్నించగా ఆయన అంగీకరించలేదంటూ కోలీవుడ్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సిమ్రాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరోక్షంగా స్పందించారు. 'నేను ఇప్పటికే దక్షిణాదిలో అగ్రహీరోలందరితో సినిమాలు చేశాను. ఇంకా పెద్ద హీరోలతో హీరోయిన్‌గా చేయాలనే ఉబలాటం నాకు లేదు. నా పరిమితులు నాకు తెలుసు. కానీ తరచూ ఎవరితో ఒకరితో ముడిపెడుతూ వార్తలు రాస్తున్నారు. పదే పదే జరుగుతున్న ప్రచారంతో స్నేహితులు, సన్నిహితులు అదంతా నిజమేనని నమ్మే పరిస్థితి వచ్చింది. అందుకే దీనిపై నేను వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ఇక నుంచైనా ఇలాంటి ప్రచారాన్ని ఆపండి' అని సిమ్రాన్ కోరారు.

ఆస్ట్రేలియాలో డ్యూయెట్

కొత్తగా..



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీస్ బ్యానర్‌పై నవీన్ యన్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమాలోని ఓ కీలక షెడ్యూల్ ఆస్ట్రేలియాలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో నితిన్, శ్రీలీలపై ఓ డ్యూయెట్ చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ 20న విడుదలవనుంది. ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎడిటర్: కోటి, డీఓపీ: సాయి శ్రీరామ్, సంగీతం: జీ.వి.ప్రకాశ్‌కుమార్.

దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు

- ఒక్కసారిగా దూసుకొచ్చిన అభిమానులు
- హెచ్ఐసీసీ అద్దాలు ధ్వంసం, పోలీసుల లాఠీ చార్జి
- విచారం వ్యక్తం చేసిన ఎన్టీఆర్



హెచ్ఐసీసీలో ఆదివారం రాత్రి నిర్వహించ తలపెట్టిన జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దయింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు తరలివచ్చారు. 3500 మందికి సీటింగ్ కెపాసిటీ ఉన్న ఈవెంట్‌కు నిర్వాహకులు 5వేల మందికి పాస్‌లు జారీ చేశారు. ఒక్కసారిగా అభిమానులు వేల సంఖ్యలో చొచ్చుకొని రావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు అంచనా వేయలేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. పోలీసులు లాఠీ చార్జి చేయాల్సి వచ్చింది. పలువురు అభిమానులకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు శ్రేయాస్ మీడియా ప్రతినిధులు ప్రకటించారు. కెపాసిటీకి మించి పాస్‌లు ఇచ్చి, అభిమానులను గందరగోళానికి గురిచేయడమే కాకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా భద్రతా వైఫల్యానికి కారణమైన శ్రేయాస్ మీడియాపై పోలీసులు కేసు నమోదు చేయాలని అభిమానులు డిమాండ్ చేశారు.

నేనే ఎక్కువ బాధపడుతున్నా : ఎన్టీఆర్

'దేవర' ప్రీ రిలీజ్ వేడుక రద్దవడం పట్ల జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. అభిమానులను ఉద్దేశించి ఓ వీడియోను విడుదల చేశారు. "అభిమాన సోదరులకి నమస్కారం. దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దు కావడం ఎంతో బాధాకరం. సినిమా కోసం ఎంత కష్టపడ్డామో మీకు తెలియజేద్దాం అనుకున్నా. కానీ కార్యక్రమం రద్దయింది. దీనికి మీ కంటే నేనే ఎక్కువ బాధపడుతున్నాను. కార్యక్రమం రద్దయినందుకు నిర్మాతల్ని, నిర్వాహకుల్ని తప్పు పట్టాల్సిన పని లేదనేది నా అభిప్రాయం. మనమంతా ఈ రోజు కలవకపోయినా.. ఈ నెల 27 సినిమా రిలీజ్ రోజున థియేటర్‌లో కలుసుకుందాం. మీరందరూ గర్వపడేలా సినిమా ఉంటుంది. అందరూ జాగ్రత్తగా ఇంటికి చేరుకోండి" అని అందులో విజ్ఞప్తి చేశారు.

గిన్నిస్ బుక్‌లో మెగా స్టెప్



మెగాస్టార్ చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. మరో అరుదైన గౌరవం ఆయన సొంతమైంది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవి స్థానం దక్కించుకున్నారు. తను నటించిన సినిమాల్లోని 537 పాటల్లో 24 వేల డాన్స్ స్టెప్పులతో ఎవరికీ సాధ్యం కానీ రీతిలో ప్రేక్షకులను అలరించినందుకు ఆయనను ఈ అవార్డ్‌కు గిన్నిస్ నిర్వాహకులు ఎంపికచేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రిచర్డ్, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ సంయుక్తంగా సర్టిఫికేట్‌ను చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "నాకు చిన్నప్పటి నుంచి డాన్స్ అంటే ప్రాణం. డాన్స్‌పై ఉన్న ఆసక్తి వల్లే ఈ రికార్డు నా సొంతమైంది. ఈ ఘనత సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది" అని అన్నారు. ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ "చిరంజీవికి నేను వీరాభిమానిని. నేను ఆయనను పెద్దన్నయ్యలా భావిస్తాను. ఆయనకు ఇంత గొప్ప గౌరవం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు. మెగా హీరోలు సాయిధరమ్ తేజ్, వరుణ్ తేజ్.. డైరెక్టర్లు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబీ.. నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్‌బాబు, అశ్వినీదత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రముఖుల అభినందనలు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిరంజీవికి చోటు దక్కడం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. చిరంజీవి తన నటన, డాన్స్‌తో తెలుగు సినిమా స్థాయిని పెంచడంలో కీలకపాత్ర పోషించారు అని అభినందించారు. చిరంజీవికి గిన్నిస్ బుక్‌లో స్థానం దక్కడం తెలుగు వారిగా మనమంతా గర్వించాల్సిన సందర్భం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. నృత్యం అంటే మెగాస్టార్, మెగాస్టార్ అంటేనే నృత్యం అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిరంజీవిని కొనియాడారు. ఏదైనా సాధించాలనుకునే యువత చిరంజీవిని ఆదర్శంగా తీసుకోవాలని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. విజయాలు, రికార్డులు అన్నయ్యకు కొత్త కాదు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం ఎంతో ప్రత్యేకం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు చిరంజీవిని అభినందించారు.



64 గళ్ల రాజ్యంలో మనమే కింగ్ క్వీన్

చెస్ ఒలింపియాడ్‌ది వందేళ్ల చరిత్ర.. మిగతా క్రీడలకు ఒలింపిక్స్ ఎంత ప్రతిష్ఠాత్మకమో చెస్‌కు ఇదీ అంతే.. 200కిపైగా దేశాలు..హేమాహేమీలైన ఆటగాళ్లు..గెలిచి తీరాలనే పట్టుదల.. ఎత్తులకుపైఎత్తులు..వెరసి ఉత్కంఠభరిత పోరాటాలు..అలాంటి చెస్ ఒలింపియాడ్‌లో పాల్గొనడమే గర్వకారణమైతే..అందులో పతకం అదీ స్వర్ణం సొంతం చేసుకోవడం ఆ ప్లేయర్ కెరీర్ సంపూర్ణం.. మరి అలాంటి ప్రఖ్యాత టోర్నమెంట్‌లో ఈసారి భారత జట్లు అద్భుతం చేశాయి.. ఏకంగా పురుషులు, మహిళల విభాగాలలో పసిడి పతకాలతో చరిత్ర సృష్టించాయి..దేశ చెస్‌లో నూతనాధ్యాయాన్ని లిఖించాయి.. చెస్ 'ప్రపంచం'లో భారత్ తిరుగులేని శక్తిగా మరోసారి నిరూపించాయి.. ఆఖరి రౌండ్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ద్రోణవల్లి హారిక కీలక విజయాలతో మెప్పించారు.

భారత పురుషులు, మహిళల జట్ల చరిత్ర

చెస్ ఒలింపియాడ్‌లో రెండు స్వర్ణాలు

బుడాపెస్ట్: కల నెరవేరింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. చెస్ ఒలింపియాడ్‌లో భారత్ ఒకటికాదు రెండు స్వర్ణాలతో అదరగొట్టింది. అలా తొలి పసిడి పతక లక్ష్యాన్ని 'డబుల్'తో చిరస్మరణీయం చేసుకుంది. పతకమే లక్ష్యంగా ఈసారి టోర్నమెంట్‌లో బరిలో దిగిన పురుషులు, మహిళల జట్లు వాటిని సాధించాయి. పోటీల ఆరంభం నుంచి జోరు ప్రదర్శించిన జట్లు ఆఖరి రౌండ్‌లోనూ అదే ఊపును కొనసాగించాయి. ఆదివారం జరిగిన 11వ, చివరి రౌండ్‌లో..రెండో సీడ్ భారత పురుషుల జట్టు 3.5-0.5తో స్లొవేనియాను చిత్తు చేసింది. టాప్ సీడ్ మహిళల జట్టు కూడా 3.5-0.5తో అజర్‌బైజాన్‌పై విజయం అందుకుంది. పురుషులు శనివారంనాటి పదో రౌండ్ ముగిసే సరికే పసిడి పతకం ఖాయం చేసుకున్నారు. మరోవైపు మహిళల స్వర్ణంపై కాసింత అనుమానాలు ఏర్పడ్డాయి. కారణం..కజకిస్థాన్, అమెరికా పోటీలో నిలవడమే. కానీ చివరి రౌండ్‌లో మనోళ్లు గెలవగా..ఆఖరి రౌండ్‌లో పరస్పరం తలపడిన కజకిస్థాన్-అమెరికా డ్రా చేసుకోవడంతో మన మహిళలకు స్వర్ణం నిర్ణయమైపోయింది.

చెస్ ఒలింపియాడ్‌లో భారత్

2014	పురుషులు	కాంస్యం
2022	పురుషులు	కాంస్యం
2022	మహిళలు	కాంస్యం
2024	పురుషులు	స్వర్ణం
2024	మహిళలు	స్వర్ణం

ఓటమే లేకుండా..

పురుషుల జట్టు అపజయమే ఎరుగకుండా టోర్నీని ముగించడం విశేషం. 11 రౌండ్లలో భారత్ 10 విజయాలతో తిరుగులేని ప్రదర్శన చేసింది. కేవలం తొమ్మిదో రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో డ్రా చేసుకుంది.

అఖర్లోనూ తగ్గేదేలే..: స్లొవేనియాతో చివరి రౌండ్‌ను డ్రా చేసుకుంటే చాలు.. పురుషుల జట్టుకు స్వర్ణ పతకం లభిస్తుంది. ఈనేపథ్యంలో జాన్ సుబేజ్‌పై నల్ల పావులతో ఆడిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి 49 ఎత్తుల్లో అతడిని చిత్తు చేసి జట్టుకు శుభారంభం అందించాడు. మరోవైపు నల్లపావులతోనే బరిలో దిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ చాలెంజర్ గుకేష్. వ్లాదిమిర్ ఫెడోసీవ్‌ని ఓడించడంతో భారత్‌కు స్వర్ణం ఖాయమైంది. నామమాత్రమైన మిగిలి రెండు గేముల్లో.. ప్రజ్ఞానంద-ఆంటన్ డెమ్‌చెన్కోపై గెలుపొందగా, మటేజ్ సెబెనిక్‌తో విదిత్ గుజ్‌రాతీ డ్రా చేసుకోవడంతో భారత జట్టులో ఆనందోత్సాహాలు మిన్నంటాయి.

మొత్తం 11 రౌండ్లలో 22 పాయింట్లకుగాను 21 పాయింట్లతో పురుషుల జట్టు స్వర్ణ విజేతగా అవతరించింది. అమెరికా (17 పాయింట్లు) రజతం, ఉజ్బెకిస్థాన్ (17 పాయింట్లు) కాంస్య పతకం కైవసం చేసుకున్నాయి. అమెరికా, ఉజ్బెకిస్థాన్ చెరో 17 పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ మెరుగైన టైబ్రేకర్ స్కోరుతో అమెరికా రెండో స్థానం దక్కించుకుంది.

అమ్మాయిలు అదరహో..: కజకిస్థాన్, అమెరికా జట్లు కూడా రేసులో ఉండడంతో చివరి రౌండ్‌లో మహిళల జట్టుపై ఒకింత ఒత్తిడి ఏర్పడింది. కానీ బరిలో దిగాక ఆ ఛాయలేవీ దరిచేరనీయకుండా ఆడి సూపర్ విక్టరీ సాధించింది. గోహర్‌పై విజయంతో ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్యదేశ్‌ముఖ్ అదిరే బోణీతో ఆధిక్యం ప్రదర్శించింది. కానీ జీఎం వైశాలీ-ఉల్వియాతో డ్రా చేసింది. తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తిరుగులేని సాంకేతిక నైపుణ్యంతో మమ్మాజదాపై 51 ఎత్తుల్లో నెగ్గి భళా అనిపించింది. దాంతో మనోళ్లు 2.5-0.5తో ముందంజలో నిలిచారు. ఆఖరి గేములో నల్లపావులతో ఆడిన ఇంటర్నేషనల్ మాస్టర్ వంతిక అగర్వాల్-ఖనీమ్‌ను చిత్తు చేయడంతో భారత్ తిరుగులేని విజయం సొంతం చేసుకుంది. మొత్తం 11 రౌండ్లలో తొమ్మిదో రౌండ్లో పోలెండ్ చేతిలో మాత్రమే మన మహిళలు ఓటమి చవిచూశారు. ఇక కజకిస్థాన్ (18) రజతం, అమెరికా (17) కాంస్య పతకం అందుకున్నాయి.

కల నిజమాయె!

ఆంధ్రజ్యోతితో హరికృష్ణ, అర్జున్,హారిక

రెండు దశాబ్దాల నిరీక్షణ ఒకరిదైతే.. పుష్కరకాలంగా ఎదురు చూపులు మరొకరివి. క్రితంసారి అందినట్టే అంది త్రుటిలో ఈ టైటిల్ చేజారడంతో నిద్రలేని రాత్రులు గడిపిన చెస్ చిచ్చరపిడుగు మరొకరు. అలాంటి ఆ ముగ్గురు గ్రాండ్‌మాస్టర్ల కల ఒకే సారి ఒకే వేదికపై నెరవేరడంతో వారంతా ఆనందంలో మునిగిపోయారు. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు పెంటేల హరికృష్ణ, ద్రోణవల్లి హారిక, ఇరిగేసి అర్జున్ తమ సంతోషాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే..

నవ శకం ప్రారంభం..



హరికృష్ణ

24 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత నా కల సాకారమైంది. నా ఆనందానికి హద్దుల్లేవు. నా జీవితంలోనే ఇదొక గొప్ప అనుభూతి. టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌ల్లో నేను సాధించిన అతి పెద్ద టైటిల్ ఇదే. గతంలో ఆసియా గేమ్స్, ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌ల్లో టైటిళ్లు నెగ్గా, కానీ ఒలింపియాడ్ కల నెరవేర్చుకోవడానికి ఇన్నేళ్లు పట్టింది. నేనాడిన అన్ని చెస్ ఒలింపియాడ్ టోర్నీల్లో కంటే ఇదే అత్యుత్తమమైనది. ఈ పుష్కరకాలంలో చెస్‌లో చాలా మార్పులు వచ్చాయి. ఆట స్వరూపం, సమీకరణాలు మారాయి. ఆడే దేశాల సంఖ్య, గ్రాండ్‌మాస్టర్ల శక్తిసామర్థ్యాల ప్రమాణాలు పెరిగాయి. బలమైన ప్లేయర్లను సవాల్ చేసి, కఠినమైన పోటీని తట్టుకుని ఈ టైటిల్‌ను సాధించాం. భారత చెస్‌లో ఇదొక కొత్త అధ్యాయం. నవశకం ప్రారంభమైంది.

అమ్మ అయ్యాక నెరవేరింది..



హారిక

నాకు 13 ఏళ్లప్పుడు తొలి చెస్ ఒలింపియాడ్ ఆడాను. ఇప్పుడు నా వయసు 33 ఏళ్లు. పుష్కరకాలంగా నెరవేరని నా కల, అమ్మ అయ్యాక తీరింది. రెండేళ్లక్రితం చెన్నై వేదికగా జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో తొమ్మిది నెలల బిడ్డను మోస్తూ బరిలోకి దిగా. కాంస్యం సాధించినా టైటిల్ దక్కలేదన్న వెలితి అలానే ఉండిపోయింది. మొత్తానికి ఇన్నేళ్ల తర్వాత నా కల నెరవేరింది. బలమైన జార్జియాపై 3-1తో గెలిచినప్పుడే ఈసారి టైటిల్ సాధిస్తామని నమ్మకం కలిగింది. టోర్నీ ప్రారంభం నుంచి అంచనాలకు తగ్గట్టు రాణించాం. నా చెస్ కెరీర్‌లోనే ఇదొక అద్భుతమైన విజయంగా నిలిచిపోతుంది.

అద్భుతంగా ఆడాం..



అర్జున్

గతంలో త్రుటిలో పతకం కోల్పోయాం. ఈసారి అత్యుత్తమ టీమ్‌తో బరిలోకి దిగి నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోగలిగాం. నా ఆటలోనూ మార్పులు చేసుకున్నా. ఒకప్పుడు ఓటమి ఎదురైనప్పుడు దానికి గల కారణాలపై ఎక్కువగా ఆలోచించేవాడిని. ఆ పరాజయం ప్రభావం తదుపరి పోటీలపైన పడేది. గత మే నెలలో కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్‌లో జరిగిన ఇన్నర్ ఇంజనీరింగ్ తరగతులకు హాజరయ్యాక నా ఆలోచనా ధృక్పథంలో మార్పు వచ్చింది. ప్రతి గేమ్‌ను తాజాగా ఆరంభించడం అలవాటు చేసుకున్నాక నా ఆటతీరు మారింది. మిత్రులు ప్రజ్ఞానంద, గుకేష్‌తో కలిసి ఆడడం, సంయుక్తంగా ఈ టైటిల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

అర్జున్@3

చెస్ ఒలింపియాడ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి కెరీర్‌లో అత్యుత్తమంగా ప్రపంచ మూడో ర్యాంక్‌కు చేరాడు. ఫిడే ఆదివారం ప్రకటించిన ర్యాంకుల్లో అతడు ఈ ఘనత అందుకున్నాడు. ఈక్రమంలో అమెరికా స్టార్ ఫాబియానో కరువానాను అర్జున్ వెనక్కు నెట్టాడు. ఒలింపియాడ్‌లో మొత్తం 11 గేముల్లో ఏడింటిలో నెగ్గిన అర్జున్..రెండింటిని డ్రా చేసుకున్నాడు. గుకేష్ ఐదో ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఇక కార్ల్‌సన్, నకామురా తొలి రెండు ర్యాంకుల్లో నిలిచారు.

మనకు మరో నాలుగు స్వర్ణాలూ..

పురుషులు, మహిళల జట్లు కాకుండా..వ్యక్తిగత ప్రదర్శనకు సంబంధించి మరో నాలుగు పసిడి పతకాలూ భారత్‌కు లభించాయి. గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, గుకేష్ పురుషుల విభాగంలో.. ఇంటర్నేషనల్ మాస్టర్లు దివ్య దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ వ్యక్తిగతంగా స్వర్ణ పతకాలు అందుకున్నారు.

ఆ ట్రోఫీ మనకే..

పసిడి పతకాలతోపాటు గాప్రిన్‌డాష్‌విలీ ట్రోఫీని కూడా భారత్ చేజిక్కించుకుంది. ఓపెన్, మహిళల విభాగాలలో ఓవరాల్‌గా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన జట్లకు ఈ ట్రోఫీ అందజేస్తారు. రష్యా తర్వాత ఈ ట్రోఫీని అందుకున్న రెండో దేశం భారతే కావడం విశేషం.

భారత్‌పై క్రామ్నిక్ ఫిర్యాదు

ప్రపంచ మాజీ చాంపియన్, ఉజ్బెకిస్థాన్ జట్టు కోచ్‌గా వ్యవహరిస్తున్న వ్లాదిమిర్ క్రామ్నిక్ భారత్‌పై ఫిర్యాదు చేశాడు. ఉజ్బెకిస్థాన్‌తో తొమ్మిదో రౌండ్ సందర్భంగా భారత పురుషుల జట్టు సభ్యులవద్ద సెల్‌ఫోన్లు ఉండడంపై నిర్వాహకులకు ఫిర్యాదు చేశాడు. అయితే భారత ఆటగాళ్ల గేములను రికార్డు చేసేందుకు నిర్వాహకుల అనుమతితోనే ఆ ఫోన్లను తాము అక్కడ ఉంచినట్టు చెస్ బేస్ ఇండియా సంస్థ తెలిపింది. అయితే వాటిని 'ఏరో ప్లేన్' మోడ్‌లో ఉంచినట్టు వివరించింది.

మీ విజయాలు భారత ప్రజల కలలకు ప్రతిరూపం. దేశ శక్తి సామర్థ్యాలకు చిహ్నం. ప్రతిరోజూ మనం ఎన్నో విజయాలు సాధిస్తున్నాం. పసిడి పతకాలు అందుకున్న పురుషులు, మహిళల జట్లకు అభినందనలు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- రెండు స్వర్ణాలు సాధించిన చాంపియన్లను చూసి గర్విస్తున్నాం. అద్భుత తెలివి తేటలు, కఠోర శ్రమ, అంకితభావంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఈ దేశ కుమార్తెలు ఏమి సాధించగలరో మీరు నిరూపించారు.
-లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- చదరంగంలో భారత్ చరిత్ర సృష్టించింది. స్వర్ణం గెలిచిన గుకేష్, అర్జున్, విదిత్, హరికృష్ణ, ప్రజ్ఞానందకు శుభాకాంక్షలు. ప్రతిభ, కృషితో దేశం గర్వపడేలా చేశారు.
- కేంద్ర క్రీడామంత్రి మాండవ్య
- భారత జట్లకు శుభాకాంక్షలు. గుకేష్, అర్జున్ సంచలనం. శ్రీనాథ్ కెప్టెన్సీ అద్భుతం. దివ్య, వంతికకు ప్రత్యేక అభినందనలు. - విశ్వనాథన్ ఆనంద్

తిప్పేసి.. గెలిచేసి

తొలి టెస్టు భారత్‌దే

అశ్విన్‌కు ఆరు, జడేజాకు మూడు వికెట్లు

280 రన్స్‌తో బంగ్లాపై ఘనవిజయం

తొలి టెస్టు ఆరంభం.. ముగింపు అంతా అశ్విన్‌దే. టాపార్డర్ వైఫలమై ఇబ్బంది పడుతున్న దశలో మొదటి రోజు బ్యాట్ పవర్ ఏంటో చూపాడు. ఆ తర్వాత నాలుగో ఇన్నింగ్స్‌లో సుడులు తిరిగే బంతులతో బంగ్లాదేశ్ బ్యాటర్లను టపటపా పెవిలియన్‌కు చేర్చాడు. సొంత గడ్డపై ఈ వెటరన్ స్పిన్నర్ నిఖార్సయిన ఆల్‌రౌండ్‌షోతో భారత్ నాలుగో రోజే మ్యాచ్‌ను పూర్తి చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. జడేజా కూడా ఇదే రీతిన రాణించడం విశేషం.



చెన్నై: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను భారత్ ఘనంగా ఆరంభించింది. 'లోకల్ బాయ్' బ్యాట్‌తో.. బంతితో అశ్విన్ (6/88) కెరీర్‌లో చిరస్మరణీయ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఫలితంగా 515 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన బంగ్లాదేశ్ నాలుగో రోజే కుప్పకూలింది. అశ్విన్‌తో పాటు మరో స్పిన్నర్ జడేజా (3/58) కూడా బంతితో రాణించడంతో బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 234 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియా 280 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. చివరిదైన రెండో టెస్టు కాన్పూర్‌లో ఈనెల 27న ఆరంభం కానుంది. కెప్టెన్ షంటో (82), షాద్‌మన్ ఇస్లాం (35), జకీర్ హసన్ (33), షకీబ్ (25) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అశ్విన్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 376, రెండో ఇన్నింగ్స్‌లో 287/4 డిక్లేర్ చేయగా.. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు సాధించింది.

స్పిన్‌కు దాసోహం: భారత్‌తో ఆడడమంటే పాకిస్థాన్‌తో ఆడినట్టు కాదని బంగ్లాదేశ్‌కు సులువుగానే అర్థమైంది. 158/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన పర్యాటక జట్టుకు స్పిన్‌తో గాలమేసింది. బంతి టర్న్ కావడంతో అశ్విన్, జడేజా పన్నిన ఉచ్చు లో బంగ్లా బ్యాటర్లు విలవిల్లాడారు. క్రీజులో షంటో, షకీబ్ ఉండడం తో పాక్‌పై మాదిరే ఏమైనా పోరాడగలరా? అనే సందేహం వ్యక్తమైంది. కానీ ఈ ఇద్దరి నుంచి కొద్దిసేపే ప్రతిఘటన ఎదురై ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించగలిగారు. అయితే, అశ్విన్ బంతి తీసుకోగానే వికెట్ల పతనం ఆరంభమైంది. మొదట 52వ ఓవర్‌లో అతడు షకీబ్‌ను అవుట్ చేయడంతో భారత్ విజయం వైపు అడుగులు వేసింది. అటు షంటో వీలు చిక్కినప్పుడల్లా షాట్లు బాదినా అతడికి సహకారం అంద లేదు. ఆదివారం పడిన ఆరు వికెట్లలో అశ్విన్, జడ్డూ చెరి సగం తీయడంతో లంచ్ సెషన్‌లోపే ఆట ముగిసింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 376
రెండో ఇన్నింగ్స్: 287/4 డిక్లేర్డ్
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: జకీర్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 33; షాద్‌మన్ (సి) గిల్ (బి) అశ్విన్ 35; షంటో (సి) బుమ్రా (బి) జడేజా 82; మోమినుల్ (బి) అశ్విన్ 13; ముష్ఫికర్ (సి) రాహుల్ (బి) అశ్విన్ 13; షకీబ్ (సి) జైస్వాల్ (బి) అశ్విన్ 25; లిట్టన్ (సి) రోహిత్ (బి) జడేజా 1; మెహిదీ హసన్ (సి) జడేజా (బి) అశ్విన్ 8; టస్కిన్ అహ్మద్ (సి) సిరాజ్ (బి) అశ్విన్ 5; హసన్ (బి) జడేజా 7; నహీద్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 62.1 ఓవర్లలో 234 ఆలౌట్. వికెట్ల పతనం: 1-62, 2-86, 3-124, 4-146, 5-194, 6-205, 7-222, 8-222, 9-228, 10-234. బౌలింగ్: బుమ్రా 10-2-24-1; సిరాజ్ 10-5-32-0; ఆకాశ్ దీప్ 6-0-20-0; అశ్విన్ 21-0-88-6; జడేజా 15.1-2-58-3.

1 నాలుగో ఇన్నింగ్స్‌లో ఎక్కువ వికెట్లు (99) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. కుంబ్లే (94)ను అధిగమించాడు.

2 ఒకే టెస్టులో ఎక్కువసార్లు (4) సెంచరీ, 5+ వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా అశ్విన్. ఇయాన్ బోథమ్ (5) టాప్‌లో ఉన్నాడు.

సుదీర్ఘ సీజన్ కఠినమే..



'డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం మేం సుదీర్ఘ సీజన్ ఆడాల్సి ఉంది. ఇంకా తొమ్మిది టెస్టులున్నాయి. మరో మూడు, నాలుగు నెలల్లో వీటిని ఆడాల్సి ఉందని తల్చుకుంటే భయంగా ఉంటుంది. కానీ అలా కాకుండా ఒక్కో టెస్టుకు మాత్రమే పరిమితమైతే ప్రశాంతంగా ఉంటుంది. టెస్టుల మధ్య లేక సిరీస్‌ల మధ్య తీసుకునే విశ్రాంతి ఉత్తేజాన్నిస్తుంటుంది. ఇప్పుడు నేను 25-30 ఏళ్ల మధ్యలో ఆడినట్టు ఆడలేను. 38 ఏళ్ల వయస్సులో రెట్టింపు కృషి చేయాల్సి ఉంటుంది. అందుకే శారీరక శిక్షణ కాకుండా యోగా చేస్తాను. ఇక ఈ పిచ్‌పై మంచి బంతులు విసిరినా పరుగుల కోసం ప్రయత్నించవచ్చు. అయితే బౌన్స్ ఎక్కువగా ఉంటుంది' - ఆర్.అశ్విన్

చరిత్రలో తొలిసారి..

బంగ్లాతో తొలి టెస్టు విజయం భారత్‌కు అరుదైన ఘనతను సాధించిపెట్టింది. తమ 92 ఏళ్ల సుదీర్ఘ ఫార్మాట్ చరిత్రలో తొలిసారి ఓటములకన్నా ఎక్కువ విజయాలందుకుంది. ఇప్పటి వరకు భారత్ 580 మ్యాచ్‌లు ఆడగా ఇందులో 179 విజయాలు, 178 ఓటములున్నాయి. అలాగే 222 మ్యాచ్‌లు డ్రా, 1 టైగా ముగిశాయి.

రెండో టెస్టుకూ ఇదే జట్టు..

కాన్పూర్‌లో జరిగే రెండో టెస్టు కోసం భారత జట్టును ప్రకటించారు. అయితే సెలెక్టర్లు ఈ టీమ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ ఆధ్వర్యంలో తొలి టెస్టులో ఆడిన ఆటగాళ్లనే కొనసాగిస్తున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. అయితే ఈ మ్యాచ్‌కు పనిఒత్తిడిలో భాగంగా పేసర్ బుమ్రాకు విశ్రాంతినిస్తారనే ఊహాగానాలు వినిపించాయి.

దులీప్ ట్రోఫీ విజేత ఇండియా-ఎ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): ఇండియా-ఎ జట్టు దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఆఖరి మ్యాచ్‌లో ఇండియా-ఎ 132 పరుగుల తేడాతో ఇండియా-సి జట్టును చిత్తు చేసింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో నెగ్గి ఒకటి ఓడిన ఇండియా-ఎ మొత్తం 12 పాయింట్లతో టాప్‌లో నిలిచి ట్రోఫీని సొంతం చేసుకొంది. ఇండియా-సి 9 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆటకు చివరి రోజైన ఆదివారం 350 పరుగుల లక్ష్య ఛేదనలో ఇండియా-సి రెండో ఇన్నింగ్స్‌లో 217 రన్స్‌కు ఆలౌటైంది. సాయి సుదర్శన్ (111) శతకం వృథా అయింది. అంతకుముందు ఇండియా-ఎ రెండో ఇన్నింగ్స్‌ను 286/8 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ 297, ఇండియా-సి 234 రన్స్ సాధించాయి.

రికీ భుయ్ అజేయ శతకం.. ఇండియా 'డి'కి ఓదార్పు విజయం: పేసర్ అర్ష్‌దీప్ సింగ్ (6/40) నిప్పులు చెరగడంతో.. దులీప్ ట్రోఫీని ఇండియా-డి విజయంతో ముగించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఇండియా-డి.. చివరి మ్యాచ్‌లో ఇండియా-బిపై 257 రన్స్‌తో గెలిచింది. ఆటకు చివరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 244/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా-డి 305 రన్స్‌కు ఆలౌటైంది. 67 రన్స్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి ప్రత్యర్థి ముందు 373 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. రికీ భుయ్ (119 నాటౌట్) సెంచరీ చేశాడు. ఛేదనలో ఇండియా-బి రెండో ఇన్నింగ్స్‌లో 115 రన్స్‌కే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 349, ఇండియా-బి 282 రన్స్ సాధించాయి.

పూర్ణ జోడీకి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండోనేసియా పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మిక్స్‌డ్ డబుల్స్‌లో శ్రీకాకుళం అథ్లెట్ సీహెచ్ పూర్ణరావు జోడీకి కాంస్య పతకం లభించింది. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో డబ్ల్యూహెచ్1, డబ్ల్యూహెచ్2 కేటగిరీలో పూర్ణ-మున్నా ఖలీదా జోడీ సెమీస్‌లో ఓడి, కాంస్యంతో సరిపెట్టుకుంది. వీరితో పాటు భారత్‌కే చెందిన ఉమేశ్ విక్రమ్ ఎస్ఎల్ 3 సింగిల్స్ విభాగంలో స్వర్ణం, సుఖాంత్ ఎస్ఎల్4 సింగిల్స్‌లో రజతం, శివరంజన్ ఎస్‌హెచ్6లో రజతం నెగ్గారు.

కివీస్ లక్ష్యం 275

ప్రస్తుతం 207/8
లంకతో తొలి టెస్టు



రచిన్ రవీంద్ర (91 బ్యాటింగ్)

గాలె: రచిన్ రవీంద్ర (91 బ్యాటింగ్) ఒంటరి పోరాటంతో.. శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ రసవత్తరంగా మారింది. 275 పరుగుల లక్ష్య ఛేదనలో ఆఖరి రోజు విజయానికి కివీస్‌కు 68 పరుగులు కావాల్సి ఉండగా.. లంకకు రెండు వికెట్లు చాలు. ఆటకు నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 237/4తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 309 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వ (40), కుశాల్ మెండిస్ (23) కొంతసేపు పోరాడారు. ఎజాజ్ పటేల్ 6 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన న్యూజిలాండ్ ఆదివారం ఆటముగిసే సమయానికి 207/8 స్కోరు చేసింది. రవీంద్రతోపాటు పటేల్ క్రీజులో ఉన్నాడు. ప్రభాత్ జయసూర్య, రమేష్ మెండిస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో లంక 305 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ 340 స్కోరు చేసింది.

కల్తీ నెయ్యి దోషాన్ని తొలగించాం

- గత నెలలోనే సంప్రోక్షణతో శుద్ధి.. నేడు ఆలయంలో శాంతి హోమం
- టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి



తిరుపతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కలకలం రేపిన కల్తీ నెయ్యి దోషాన్ని గత నెల ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టామని, భక్తులు ఎవరూ ఆందోళన చెందవద్దని టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్యామలరావు వెల్లడించారు. ఆదివారం రాత్రి తిరుపతిలో పద్మావతి రెస్ట్ హౌస్‌లో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, రామకృష్ణ దీక్షితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'తిరుమల ఆలయంలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో తెలుసో తెలియక జరిగే దోష నివారణకు ప్రతి ఏడాది శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో భాగంగా ఆగస్టులోనే ఆలయంలో అన్న ప్రసాదపోటు, లడ్డూ పోటులో సంప్రోక్షణ చేశాం. అందులోని కృష్ణస్వామి మూర్తులకు పవిత్రాలను సమర్పించాం. కల్తీ నెయ్యి వలన ఏమైనా దోషాలు ఉండుంటే కూడా తొలగిపోయాయి. అయినప్పటికీ భక్తుల్లో నెలకొన్న ఆందోళన దృష్ట్యా ఆగమశాస్త్ర పండితులు, పెద్దజియ్యంగార్లను సంప్రదించిన తర్వాత సీఎం చంద్రబాబు శ్రీవారి ఆలయంలో ఒకరోజు శాంతి హోమం నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శాంతిహోమం చేస్తున్నాం. శ్రీవారి ఆలయంలోని యాగబావి వద్ద యాగశాలలో, మూడు హోమగుండాలు (వాస్తు, సభ్యం, పౌండరీక) ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అదేవిధంగా అన్ని ఆలయాల్లో పంచగవ్య ప్రోక్షణ చేయనున్నాం' అని ఈవో వివరించారు. గత కొన్ని రోజులుగా టీటీడీ కొనుగోలు చేసే ఆవు నెయ్యి విషయంలో ఎన్డీడీబీ నివేదికలో కల్తీ విషయం రావడం, హిందువుల మనోభావాల దెబ్బతినడం చూశామన్నారు. ఆవు నెయ్యి తీసుకునేవిధానంలో మార్పు తీసుకొచ్చామని టీటీడీ తరఫున భక్తులందరికీ తెలియజేస్తున్నామని అన్నారు. 'మంచి పేరున్న సంస్థల నుంచి మాత్రమే ఆవు నెయ్యి కొంటున్నాం. అది కూడా రూ.475కే. నందిని, ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ పేరెన్నిక సంస్థలు. వీటిని పరీక్షించారు. చాలా కరెక్టుగా ఉన్నాయి. ఇప్పటికే ఎన్ఏబీఎల్‌కు శాంపిల్స్ పంపే విధానం మొదలైంది. ఆ ప్రక్రియను కొనసాగిస్తాం. అక్కడే జంతువుల కొవ్వు ఉందో లేదో పరీక్ష జరుగుతుంది. తిరుమలలో ఇదివరకు అలాంటి పరీక్షలు జరగలేదు. ఇక్కడ సాధారణ పరీక్షలు చేసే సామర్థ్యం మాత్రమే ఉంది. 18మందితో సెన్సరీ ప్యానెల్‌ను ఏర్పాటు చేశాం. మైసూరులో శిక్షణ పొందిన ల్యాబ్ నిపుణులు ఇందులో ఉంటారు. జీరో నుంచి 9 వరకు రేటింగ్‌లో కనీసం 7 పాయింట్ల రేటింగ్ ఉండే ఆవు నెయ్యినే ఆమోదిస్తున్నాం. ఎన్డీడీబీ ముందుకొచ్చి విరాళంగా సుమారు రూ.75 లక్షల విలువగల టెస్టింగ్ యంత్రాన్ని తిరుమలలో ఏర్పాటుచేస్తున్నాం. అది మూడు నెలల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా తిరుమలలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చారు. ఇప్పటికే వారికి బిల్డింగ్ కూడా చూపించాం. తిరుమలలో స్వచ్ఛమైన నెయ్యితోనే లడ్డూ ప్రసాదాలు తయారు చేస్తున్నాం. యాత్రికులు ఎలాంటి భయాందోళనలు చెందవద్దు' అని ఈవో శ్యామలరావు భక్తులను కోరారు.

దోషులను సమాజం ముందు నిలబెడతాం: పయ్యావుల కేశవ్

అనంతపురం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణ చేయాలని ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి వస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఘటనపై విచారణ జరిపి, దోషులను సమాజం ముందు నిలబెడతామని చెప్పారు. అనంతపురంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... అన్యమతస్థుడైన జగన్ తిరుమలేశుడిని దర్శించుకోవాలంటే ఆలయ నిబంధనల మేరకు సంతకం పెట్టాలని, కానీ సంతకం పెట్టకుండానే దర్శనం చేసుకున్నాడన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీశారు: అచ్చెన్న

కోటబొమ్మాళి, సెప్టెంబరు 22: 'వైసీపీ పాలనలో.. తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును నెయ్యిలో కలిపి వాడారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసి ఆలయ ప్రతిష్ఠకు భంగం కలిగించారు' అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో ఆయన మాట్లాడుతూ.. 'కమీషన్ల కక్కుర్తితో పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఇటువంటి నీచానికి పాల్పడడం దారుణమ'ని ధ్వజమెత్తారు.

వైసీపీని తిరుమలవాసుడే శిక్షించాడు: దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 22 : గత వైసీపీ ప్రభుత్వం సాక్షాత్తూ వేంకటేశ్వ స్వామికే అపచారం తలపెట్టడం దారుణమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. అందుకే నాటి వైసీపీ ప్రభుత్వ దుర్మార్గపు పాలనను సాక్షాత్తూ ఆ భగవంతుడే గుర్తించి శిక్షించి ఇంటికి పంపించాడని వ్యాఖ్యానించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం బండారం బయట పెట్టామనే అక్కసుతో కొందరు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- టీటీడీ మాజీ చైర్మన్ పప్పల చలపతిరావు

ఎలమంచిలి(అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 22: తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడడం దారుణమని, ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ మాజీ చైర్మన్ పప్పల చలపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో హిందూ ఆలయాలపై దాడులు, విగ్రహాలు పడగొట్టడం, రథాలను ధ్వంసం చేయడం వంటి దుస్సంఘటనలు చోటుచేసుకున్నా కనీస చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

పాపాలు చేసి పశ్చాత్తాపం చెందని జగన్: పట్టాభి

అమరావతి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో జగన్ సర్కార్ చేసిన పాపాన్ని తెలుసుకున్నాక, జరగరాని తప్పు జరిగిపోయిందని.. ప్రతి హిందువూ శ్రీవారి ముందు నిలబడి క్షమించమని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'జంతు కొవ్వుతో కలుషితమైన నెయ్యితో వేంకటేశ్వరస్వామికి నైవేద్యం పెట్టడం మహా అపచారం. క్షమించరాని నేరం. ప్రపంచంలోనే కరుడుకట్టిన హిందూ ద్రోహి, ద్వేషి జగన్‌రెడ్డి. జగన్‌ను యావత్ సమాజం క్షమించదు. ఇంకా జగన్ బుకాయించడం సిగ్గుచేటు. భక్తుల మనోభావాలను, టీటీడీ పవిత్రతను దెబ్బతీసిన ద్రోహులకు శిక్ష తప్పదు' అని హెచ్చరించారు.

వైసీపీ అంటేనే స్కామ్: ఉండవల్లి శ్రీదేవి

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అంటేనే స్కామ్‌ల సర్కారు అనేది జగమెరిగిన సత్యమని మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి వ్యాఖ్యానించారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ శాండ్, వైన్, మైన్స్‌లోనే కాదు.. తిరుమల లడ్డూ విషయంలో కూడా వైసీపీ నేతలు స్కామ్‌లకు పాల్పడ్డారని ఆరోపించారు.

జగన్ కలియుగ దైవాన్నీ వదల్లేదు: బుచ్చిరామ్‌ప్రసాద్


అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం చేసిన జగన్.. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామినీ వదలలేదని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ కె.బుచ్చిరామ్ ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ హిందూ ద్వేషి, ద్రోహి అయిన జగన్ అన్యమతస్థులకు టీటీడీ చైర్మన్ పోస్టు ఇచ్చి, టీడీపీ ప్రతిష్ఠను మంటగలిపారు. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసిన ఇలాంటి ద్రోహులను సమాజం క్షమించదు' అని హెచ్చరించారు.

ఆ స్థానంలో నేనుంటే నిన్ను జైలుకు పంపేవాడిని!

- విజయసాయిపై సోమిరెడ్డి ఫైర్

కొండపి, సెప్టెంబరు 22: 'చంద్రబాబుది మంచి మనసు. అందుకే నువ్వు ఇంకా బయట తిరుగుతున్నావు. అదేస్థానంలో నేనుంటే నిన్ను బొక్కలో వేసేవాడిని' అని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఉద్దేశించి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పెడుతున్న పోస్టులు చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. 'శాంతి భర్త.. మీ సతీమణి వద్ద డబ్బులు తీసుకున్న వీడియోను రిలీజు చేశారు. ఆ ఆధారాలున్నా నువ్వు ఇంకా మాట్లాడుతున్నావ్. నేనేగనక చంద్రబాబు స్థానంలో ఉంటే నిన్ను జైలుకు పంపేవాడిని' అని అన్నారు. మంత్రి డోలా మాట్లాడుతూ ప్రజలు ఛీత్కరించినా, వైసీపీ నాయకుల నీచపు బుద్ధి మారలేదన్నారు. ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పాల్గొన్నారు.

లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు



(మొదటి పేజీ తరువాయి)

తప్పు తప్పే. అన్నింటి కంటే పెద్దదైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన సమయంలో అధికార దుర్వినియోగం వల్ల అడుగడుగునా సెంటిమెంట్లు దెబ్బతిన్నాయి. వ్యాపార సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా, వారికి కావలసిన పనులు చేయించుకునేందుకు టీటీడీని ఉపయోగించుకున్నారు. దానిపై చాలా మంది బాధపడ్డారు. ఏదైనా మళ్లీ ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత మేం తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇష్టానుసారంగా టీటీడీ బోర్డు సభ్యులను నియమించారన్నారు. 50 మంది సభ్యులను నియమిస్తే కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కనపడిన వారందరినీ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమించారని ఆక్షేపించారు. 'శ్రీవారి దర్శనం టికెట్లను ఇష్టారీతిగా విక్రయించారు. దానిపై నేను, పవన్ కల్యాణ్ ధర్నాలు చేశాం. తిరుమలకు అనుమతించకపోవడంతో అలిపిరి వద్ద ధర్నా చేసి వెనక్కి వచ్చాం' అని గుర్తుచేశారు. అన్య మతస్తులకు ప్రాధాన్యమివ్వడం, దేవుడిపై నమ్మకం లేని వారిని దేవాలయాల్లో పెట్టడం, రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వినియోగించారని విమర్శించారు. 'వాళ్లు రాగానే నెయ్యి, ఇతర సరుకుల సరఫరాకు సంబంధించి రివర్స్ టెండర్ల పేరుతో నిబంధనలు మార్చారు. 18వ నిబంధనలో ఉన్న మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించారు. డెయిరీ పెట్టిన మూడేళ్ల తర్వాతకు బదులుగా ఏడాదిలోనే నెయ్యి సరఫరా చేయవచ్చని పెట్టారు. 4 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అనుభవం ఉండాలి. ఆ నిబంధనా తీసేశారు. అదే విధంగా 8 టన్నుల ఉత్పత్తి చేయాలన్న నిబంధనా తొలగించారు. రివర్స్ టెండరింగ్‌తో విన్యాసాలు చేశారు. పెద్ద సంస్థలు రాకుండా చేశారు. అనుభవం లేని వారికి, డెయిరీయే లేని వారికి అవకాశమిచ్చారు. దీంతో వారు నాసిరకం నెయ్యి సరఫరా చేశారు. కల్తీ నెయ్యితో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

నిబద్ధత కలిగిన ఈవోను నియమించా..

లడ్డూ మూడ్రోజుల్లోనే చెడిపోవడం, ఘుమఘుమలాడాల్సిన లడ్డూ పాచిపోయినట్లుగా, రంగుమారినట్లుగా కనబడుతుండడంతో తినాలన్నా బాధవేసేది. నేను ముఖ్యమంత్రి కాగానే.. మిగతా పోస్టింగుల గురించి ఆలోచించలేదు. టీటీడీ ఈవోగా ఎవరిని నియమిస్తే ప్రక్షాళన జరుగుతుందో ఆలోచించి శ్యామలరావును నియమించాను. తిరుమలలో అపవిత్ర కార్యక్రమాలు జరిగాయని, ప్రక్షాళన మొదలుపెట్టాలని సూచించా. పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం తేవడానికి భగవంతుడు ఆదేశాలిచ్చాడు.. ఆ ఆదేశాలనే నీకిస్తున్నానని చెప్పాను. అప్పటి నుంచి రోజురోజుకూ పురోగతి చూస్తున్నాం. ఎవరైతే నాసిరకం సరఫరా చేస్తున్నారో ఆ కాంట్రాక్టర్లకు వార్నింగ్ ఇచ్చారు. కల్తీ పరీక్షలు చేసే వ్యవస్థలు టీటీడీలో లేవు. ఇప్పటిదాకా నమ్మకం, పవిత్రతతో పదార్థాల సరఫరా జరిగింది. భయం, భక్తి ఉండడంతో వాటిలో నాణ్యతా ప్రమాణాలు ఉండేవి. ఇప్పుడు తేడా రావడంతో ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ కోసం ఎన్‌డీడీబీకి పంపితే షాకింగ్ నివేదిక వచ్చింది. కల్తీ ఉన్నట్లు తేలింది. సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఆలివ్, గ్రాప్‌సీడ్, లిమ్‌సీడ్స్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్.. పంది కొవ్వు ఉన్నట్లు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది చూసిన తర్వాత ఈవో జూలై 22, 23ల్లో ఆ కంపెనీ వారికి మెమోలు ఇచ్చారు. ఆ నివేదిక దాచిపెడితే భక్తుల మనోభావాలు ఏ విధంగా ఉంటాయి? రెండ్రోజులు దీనిపై ఆలోచించాం. కేంద్ర మంత్రులు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో మాట్లాడా. జరిగిన అపచారానికి, అపవిత్రతకు బాధపడుతున్నాం. ఎలాంటి చిన్న నిర్లక్ష్యం లేకుండా ప్రక్షాళన చేసి పవిత్రతను కాపాడేందుకు మన వంతు చేయాల్సింది చేయాలని భావిస్తున్నాం. ఏఆర్ కంపెనీ నుంచి వచ్చిన నెయ్యిని వాడేశారు. అది వాడిన తర్వాత శాంపిల్స్‌ను పంపించి నియంత్రించారు. ఆగమ సలహామండలితో చర్చించారు. ఆలయ సంప్రోక్షణపై చర్చించి, ఇప్పుడు వెలుగు చూసిన అంశాల వల్ల ఇతర దోషాలు తొలగిపోయేందుకు సోమవారం ఉదయం శాంతి హోమం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో బంగారుబావి వద్ద శుద్ధి చేయాలని నిర్ణయించారు. జరిగిన అపచారానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నారు.

ఆ అధికారం ఎవరిచ్చారు?

భక్తుల మనోభావాలు దెబ్బతిని కుంగిపోయే పరిస్థితి తెచ్చారు. ఆ అధికారం ఎవరిచ్చారు? జగన్.. నీది మనిషి పుట్టుకేనా? కరుడుకట్టిన నేరస్థుడు రాజకీయ ముసుగులో ప్రజలను మోసం చేయడానికి వచ్చి.. అబద్ధాలను సత్యాలుగా చేయాలని చూస్తున్నప్పుడు ప్రమాదమని హెచ్చరిస్తున్నాం. ఎంత ధైర్యముంటే ఎదురుదాడి చేస్తారు? బోర్డు సభ్యులుగా ఎవరిని వేశారు? ఈవోగా ఎవరిని వేశారు? ఇంట్లో ఎవరైనా చనిపోతే ఏడాది పాటు వేంకటేశ్వర స్వామి వద్దకు రారు. కొడుకు చనిపోతే 12వ రోజు గుడికి వస్తావా (అప్పటి ఈవో ధర్మారెడ్డినుద్దేశించి)? అన్య మతస్థులు అబ్దుల్ కలాం, సోనియాగాంధీ సైతం అఫిడవిట్ ఇచ్చి తిరుమలకు వస్తే.. జగన్ ఎందుకు ఇవ్వలేదు? అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారని గతంలో కూడా పలు దఫాలు చెప్పాను. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు స్వామికి ఉన్నది ఏడుకొండలు కాదు.. రెండు కొండలేనంటే పోరాడాను. పాదయాత్ర చేసి ఏడుకొండలూ ఎక్కి మొక్కు తీర్చుకున్నా. దేవుడి పవిత్రత కాపాడేందుకు ఎన్నో చేశాం. అలాంటి పవిత్ర క్షేత్రంలో గడచిన ఐదేళ్లలో అపవిత్ర కార్యక్రమాలు చేశారు. వేంకటేశ్వరస్వామి లడ్డూకు ప్రత్యేకత ఉంది. దానికి కారణం ఎన్నో ఏళ్లుగా దానిని తయారుచేసే విధానమే. అందులోని పదార్థాలు స్వచ్ఛంగా ఉంటాయి. నాణ్యత లేకుండా వాడరు. సరఫరాదారులు కూడా పవిత్రమైన భావంతో సరఫరా చేస్తారు. లడ్డూ మాత్రమే కాదు, జిలేబీ, వడ, పొంగల్ దేనికదే ప్రత్యేకం. భోజన శాలలో వంటలు కూడా రుచికరంగా ఉంటాయి. లడ్డూకు 2009లో పేటెంట్ హక్కు కూడా వచ్చింది. దానిని కాపీ చేసే అవకాశమే లేదు. ఎంత ప్రయత్నించినా తిరుమల లడ్డూ మాదిరి లడ్డూ చేయలేకపోయారు. అలాంటి ప్రసాదంలో నాణ్యత లేదని, అపవిత్రం చేశారని ఎన్నో సార్లు భక్తులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు తిరుమలలో అన్నదానం, ప్రాణదానం ప్రవేశపెట్టాం. ఎన్టీఆర్ వైకుంఠం కాంప్లెక్-1 నిర్మించారు. నేను వైకుంఠం కాంప్లెక్స్-2 నిర్మించా. రామ్‌దేవ్‌బాబాను తీసుకొచ్చి వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలతో అనుసంధానం చేసి తిరుమల అంతా ఆయుర్వేద మొక్కలు పెట్టి ప్రోత్సహించాను. శ్రీవారికి సంప్రదాయబద్ధంగా వస్త్రాలు సమర్పించే సమయంలో నాపై క్లైమోర్ మైన్స్ దాడి జరిగింది. ఆ భగవంతుడి కృపవల్ల బతికాను. అన్ని దేవాలయాల్లో అపవిత్రతపై దర్యాప్తు చేసి.. నివేదిక వచ్చాక కఠిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో నెయ్యి కల్తీ వంటివి జరగకుండా చేస్తాం. ఏ ప్రార్థనా మందిరాల్లో అయినా ఆ మతాల వారి నిర్వహణే ఉండాలి. అందులో నేరస్థులు గానీ, సంఘ విద్రోహ శక్తులు గానీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ఇవన్నీ మేం కచ్చితంగా పాటిస్తాం. అందరం మత సామరస్యం కాపాడుకోవాలి. అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తెచ్చి అమలు చేస్తాం. అన్ని దేవాలయాల్లో మహిళలను గౌరవించే విధంగా ప్రత్యేక సిఫారసులు తీసుకుని చర్యలు తీసుకుంటాం.

హెచ్చరించినా మారలేదు!

- ఏఆర్ డెయిరీ కల్తీ నెయ్యే పంపింది!
- సీఎంకు టీటీడీ ఈవో శ్యామలరావు నివేదిక

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంపై భక్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో.. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కంపెనీలను ముందుగానే హెచ్చరించామని టీటీడీ ఈవో శ్యామలరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదించారు. కొన్ని కంపెనీలు సరేనన్నా.. ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ తక్కువ నాణ్యత గల నెయ్యి సరఫరా చేసిందని తెలిపారు. నాసిరకం ట్యాంకర్లు పంపిందని.. అనుమానం వచ్చి గోప్యంగా పరీక్షలు చేయించామని తెలిపారు. జంతువుల కొవ్వు కలిసినట్లు రిపోర్టుల్లో తేలడంతో ఆ కంపెనీ నుంచి మొత్తం సరఫరానే నిలిపివేశామని వెల్లడించారు. ఈ మేరకు ప్రాథమిక నివేదికను ఆదివారమిక్కడ సీఎంకు అందించారు. టీటీడీ ల్యాబ్‌లో కల్తీ నెయ్యిని పరీక్షించే పరికరాలు లేవని తెలిపారు. 'టీటీడీకి 10 వేల కేజీల నెయ్యి సరఫరాకు ఏఆర్ కంపెనీని ఈ-టెండర్ ద్వారా 2024 ఫిబ్రవరిలో అధికారులు ఎంపిక చేశారు. ఈ కంపెనీ రివర్స్ టెండరింగ్‌లో కిలో నెయ్యి రూ.319.80 చొప్పున రోజుకు పది వేల కిలోలు సరఫరా చేసేందుకు అంగీకరించింది. జూన్ 12న (చంద్రబాబు సీఎంగా ప్రమాణం చేసిన రోజు) నుంచి సరఫరా ప్రారంభించింది. జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 15న మరో రెంటిని పంపించింది. వాసన, రుచి సరిగా లేకపోవడంతో.. ఆ నాలుగు ట్యాంకర్ల నుంచి శాంపిల్స్ తీసుకుని.. భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నాణ్యత ప్రకారం నెయ్యి ఉందా లేదా అన్న నిర్ధారణ కోసం అత్యంత గోప్యంగా గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపించాం. అదే నెల 16, 23వ తేదీల్లో నివేదికలు వచ్చాయి. సదరు కంపెనీ సరఫరా చేసిన నెయ్యిలో వెజిటబుల్, జంతువుల కొవ్వు ఆధారిత కల్తీ పదార్థాలున్నట్లు తేలింది. వెంటనే కల్తీ నెయ్యి ట్యాంకర్లను సదరు డెయిరీకి వెనక్కి పంపించేశాం. ఆ కంపెనీ నుంచి మొత్తం సరఫరాయే నిలిపివేశాం. 22, 23, 27వ తేదీల్లో వరుసగా షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశాం. వారిచ్చిన సమాధానంలో కొన్ని అభ్యంతరాలను లేవనెత్తి మరోసారి ఆగస్టు 8న నోటీసులు జారీ చేశాం. దానికి ఆ కంపెనీ ఇచ్చిన తిరుగు జవాబును పరిశీలిస్తున్నాం. నెయ్యి కల్తీ సమస్య నేపథ్యంలో వెంటనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశాం. ప్రస్తుతం నెయ్యి కొరత లేకుండా కొన్ని తాత్కాలిక చర్యలు తీసుకున్నాం. టెండర్లు ఆహ్వానించగా నాలుగు డెయిరీ కంపెనీలు పాల్గొన్నాయి. అందులో ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ (న్యూఢిల్లీ) ఎల్-1, కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(నందిని)ను ఎల్-2గా ఎంపిక చేశాం. ఈ రెండు డెయిరీలు ప్రస్తుతం టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

నిబంధనల్లో నాణ్యత సూచనలు ఉన్నా..

'టీటీడీకి ప్రతిరోజూ 15 వేల కిలోల నెయ్యి అవసరం. నెయ్యి నిమిత్తం ఏటా రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నెయ్యి నాణ్యత టీటీడీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని టెండర్ల నిబంధనల్లో స్పష్టంగా పొందుపరిచారు. టీటీడీ ఆవు నెయ్యి మొత్తం ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తోంది. ఇలాంటి సమయంలో 14 సాధారణ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తాం. టీటీడీ విధించిన టెండర్ నిబంధనల ప్రకారం ఏదైనా ఎన్ఏబీఎల్ అక్రిడెటెట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేయవచ్చునని స్పష్టంగా ఉంది. కానీ టీటీడీ అధికారులు ఇప్పటి వరకూ ఎన్ఏబీఎల్ ల్యాబ్‌ల్లో నెయ్యిని పరీక్షించిన దాఖలాలు లేవు. నెయ్యి కల్తీ పరీక్షలు చేసేందుకు అవసరమైన పరికరాలు కొనుగోలుకు రూ.74 లక్షలు ఖర్చవుతుంది. టీటీడీ ల్యాబ్‌ల్లో కల్తీని పరీక్షించే పరికరాలు లేకపోవడంతో దీనిని అదునుగా తీసుకుని నాణ్యత తగ్గిస్తున్నారు. రివర్స్ టెండరింగ్ వల్ల నెయ్యి ధరలు మరింత తగ్గిపోయాయి. పైగా నాణ్యమైన నెయ్యి అందించే సరఫరాదారులు రివర్స్ టెండరింగ్ వల్ల వెనక్కి వెళ్లిపోయారు. ఈ విధానంపై లోతైన సమీక్ష చేయాలి' అని నివేదికలో తెలిపారు.

లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై.. నెలపాటు విస్తృత చర్చలు

- పోటు కార్మికులు, ప్రొక్యూర్‌మెంట్ కమిటీతో ఈవో శ్యామలరావు వరుస భేటీలు
- విశ్రాంత ఉద్యోగులు, డెయిరీ విభాగం నిపుణులు ఐదుగురు నెయ్యి సరఫరాదారులతో సమావేశం
- నాణ్యమైనది సప్లయ్ చేయాల్సిందేనని స్పష్టీకరణ
- గత ప్రభుత్వంలో ఆపేసిన.. నందిని నెయ్యి కొనుగోలుకు శ్రీకారం

తిరుమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదాల్లో నెయ్యితో పాటు అన్నప్రసాదాల రుచి తగ్గిందనే భారీ ఫిర్యాదులు భక్తుల నుంచి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీటీడీ ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు సీఎం చంద్రబాబు సూచన మేరకు తొలుత లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపైనే దృష్టిసారించారు. దాదాపు 30 రోజుల పాటు పోటు కార్మికులు, ప్రొక్యూర్‌మెంట్ కమిటీ, గతంలో పోటులో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, డెయిరీ విభాగం నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో నాణ్యమైన నెయ్యి ఉంటేనే అన్నప్రసాదాల నాణ్యత పెరగడంతో పాటు సువాసన, తాజాతనం వస్తుందని గ్రహించారు. దీంతో టెండరు విధానం ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారులతో సమావేశం నిర్వహించి నాణ్యమైన నెయ్యే సరఫరా చేయాలని స్పష్టంచేశారు. అయినప్పటికీ సరఫరాదారుల్లో ఒకరైన ఏఆర్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కేలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు పొందిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ల్యాబ్‌కు నెయ్యి శాంపిల్స్ పంపాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే జూలై 6న వచ్చిన రెండు ట్యాంకర్లు, 12వ తేదీన వచ్చిన మరో రెండు ట్యాంకర్లలోని నెయ్యిని తొలిసారిగా ప్రైవేట్ ల్యాబ్‌కు పంపడంతో కల్తీ జరిగినట్టు తేలింది. వెంటనే ఆ సంస్థను బ్లాక్‌లిస్‌లో పెట్టడంతో పాటు గత ఏడాదిన్నర కాలంపాటు వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన నందిని నెయ్యిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రస్తుతం టీటీడీకి నాణ్యమైన నెయ్యి అందుతోంది. ఈ క్రమంలోనే లడ్డూల నాణ్యత కూడా పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టీటీడీ ఈవో ఆహ్వానించారు. తిరుమలలో అక్టోబరు 4 నుంచి 12 వరకు జరిగే ఉత్సవాలకు రావాలని కోరారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసానికి టీటీడీ ఈవో శ్యామలరావు, ఏఈవో వెంకయ్య చౌదరి వెళ్లి చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందించారు.

నలుగురు నిపుణుల నివేదికతో..

గతంలో కొనుగోలు చేసిన నెయ్యిలో కనీస ప్రమాణాలు లేవని గ్రహించిన ఈవో నెయ్యి కొనుగోళ్ల టెండర్లలో మార్పులు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే లడ్డూలతో పాటు వివిధ రకాల ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కొనుగోళ్లకు డెయిరీ రంగంలోని నలుగురు నిపుణులతో జూలై 2వ తేదీన కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్‌డీఆర్ఏ మాజీ ఆచార్యుడు డాక్టర్ సురేంద్రనాథ్, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ స్వర్ణలత, బెంగుళూరుకు చెందిన డాక్టర్ మహదేవన్ ఉన్నారు. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే నాణ్యమైన నెయ్యి అందుతోంది. నెయ్యిలో ఎస్ విలువలను కమిటీ మార్పు చేసింది.

గతంలో కొన్న, ఇప్పుడు కొంటున్న నెయ్యిలో ఉన్న ఎస్ విలువలు..

ఈక్వేషన్	ఉండాల్సిన విలువ	గతంలో సరఫరా చేసిన విలువ	ప్రస్తుతం సేకరిస్తున్న నెయ్యిలో విలువ
ఫస్ట్ శాంపిల్			
1.	98.05 - 101.95	86.62	100.20
2.	99.42 - 100.58	106.89	100.39
3.	95.90 - 104.10	22.48	98.61
4.	97.96 - 102.04	117.42	100.35
5.	95.68 - 104.32	19.72	97.21
రెండో శాంపిల్			
1.	98.05 - 101.95	86.88	100.44
2.	99.42 - 100.58	106.99	100.19
3.	95.90 - 104.10	22.76	99.95
4.	97.96 - 102.04	117.15	100.09
5.	95.68 - 104.32	19.77	98.85

పెరిగిన శ్రీవారి లడ్డూ విక్రయాలు

తిరుమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ల్యాబ్ రిపోర్టులు వెలుగులోకి రావడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. కల్తీ గురించి తెలిశాక.. తాము నాణ్యమైన నెయ్యినే కొనుగోలు చేసి లడ్డూలను తయారు చేస్తున్నామని టీటీడీ ప్రకటించింది. అయితే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని బహిర్గతమయ్యాక లడ్డూ అమ్మకాలు భారీగా పడిపోయాయని, భక్తులు లడ్డూలను కొనుగోలు చేయడం లేదంటూ కొందరు దుష్ప్రచారానికి దిగారు. ఇదంతా అబద్ధమని తేలింది. నిజానికి లడ్డూ విక్రయాలు పెరిగాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో పరీక్షలు చేసి స్వచ్ఛమైన నెయ్యితో లడ్డూలు తయారు చేస్తుండంతో వాటి రుచిలో మార్పు వచ్చిందని, తాజాగా కనిపిస్తున్నాయని భక్తులు చెబుతున్నారు. గత నాలుగైదు రోజులుగా నెయ్యి కల్తీ వార్తలు భారీగా వస్తున్నప్పటికీ లడ్డూల విక్రయాలు మాత్రం భారీగా పెరగడం గమనార్హం. ఈ నెల 19వ తేదీన 3,59,660 లడ్డూలు, 20వ తేదీన 3,17,954, 21వ తేదీన 3,67,607 లడ్డూలను భక్తులకు అందజేశారు. టీటీడీ ప్రస్తుతం రోజుకు మూడున్నర లక్షల లడ్డూలను తయారు చేస్తోంది.

కమిటీ ద్వారా ఎస్ విలువల్లో చేసిన మార్పులు

	ఉండాల్సిన విలువ	మార్పు చేసిన విలువ
1.	98.05-101.95	97.63-102.37
2.	99.42-100.58	99.24-100.76
3.	95.90-104.10	95.23-104.77
4.	97.96-102.04	97.73-102.27
5.	95.68-104.32	98.84-105.16

చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?

(మొదటి పేజీ తరువాయి)



గుంటూరు జిల్లా నంబూరులోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్

నీచమైన చర్య అని దుయ్యబట్టారు. ప్రతి హిందువూ, ధర్మాన్ని పాటించే ప్రతి వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వర స్వామిని కోరుతూ ఆయన ఆదివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష మాలధారణ తీసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... కేబినెట్, అసెంబ్లీలో చర్చించి దోషులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. "తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా జగన్ వారిని ఎలా సమర్థిస్తారు? కోట్ల మంది హిందువులు స్వీకరించే ప్రసాదాన్ని అపవిత్రం చేస్తారా? దోషులకు శిక్ష పడాల్సిందే. చర్చి, మసీదులో ఇలా జరిగితే దేశం అల్లకల్లోలం అయిపోయేది. ప్రపంచం అంతా మాట్లాడేది. గ్లోబల్ న్యూస్ అయ్యేది. అదే హిందువులకు జరిగితే మాట్లాడకూడదా? సెక్యులర్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందా? హిందువులకు మనోభావాలు ఉండవా? ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం. గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నాను. తిరుమలలో జరిగిన విధంగా ఒక చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా? ఒక మసీదుకు జరిగితే ఊరుకుంటావా? మరి తిరుమలలో అపవిత్రం జరిగితే ఎందుకు మాట్లాడకూడదని అంటున్నారు? మేము మాట్లాడతాం. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతం మీద దాడి జరిగినా మాట్లాడతాం. సనాతన ధర్మంపై దాడి జరిగినా మాట్లాడుతాను. తిరుమల ఘటనలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అపచారాలపై విచారణ జరగాలి. దోషులను శిక్షించాలి. నిన్న మీడియా ప్రతినిధులు సీబీఐ విచారణకు ఈ కేసు తీసుకువెళ్తారా అని అడిగారు. కేబినెట్‌లో చర్చ జరిగే విధంగా చూసి, దీనిపై నిర్ణయం తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా మేము సహకరిస్తాం. తిరుమలలో జరిగిన ఘటన భవిష్యత్తులో జరగకుండా చూసేలా మా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని పవన్ స్పష్టం చేశారు. "నెయ్యి కల్తీపై గత టీటీడీ బోర్డు బాధ్యత వహించాలి. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఇతర పాలక వర్గంపై విచారణ జరగాలి. తప్పులు చేస్తే మాది ఉపేక్షించే ప్రభుత్వం కాదు. టీటీడీ బోర్డు ఉన్నది ధర్మాన్ని పరిరక్షించడానికి మాత్రమే. దర్శనం టికెట్లు మీ వారికి ఇచ్చుకోవడానికో, మీ ఇష్టానికి కాంట్రాక్టులు ఇవ్వడానికో కాదు" అని పవన్ అన్నారు.

ఒక్కరూ ప్రశ్నించలేదు

"తిరుమలలో ప్రతి రోజు దాదాపు 15వేల కిలోల నెయ్యి వినియోగిస్తారు. కిలో నెయ్యి తయారీకి దాదాపు రూ.వెయ్యి ఖర్చవుతుంది. అలాంటిది రూ.360కే వస్తుందని మధ్యవర్తి చెబితే క్వాలిటీ చెక్ చేయకుండా ఎలా తీసుకుంటారు.? స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదు? వైసీపీ అంటే భయమా? లేక సుబ్బారెడ్డి అంటే భయమా? ఉద్యోగులు మౌనంగా ఉండి మహా అపరాధం చేశారు. ఈ అపరాధంతో నాకు సంబంధం లేకపోయినా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్నాను. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10 వేలు వసూలు చేశారు. ఐదుగురు కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి వస్తే రూ.50వేలు వసూలు చేసి బిల్లు మాత్రం రూ.500 చొప్పునే ఇచ్చారు. తప్పు జరుగుతోందని వేలెత్తి చూపినా వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రసాదాల నాణ్యత తగ్గిపోయింది. లడ్డూను కూడా కల్తీ చేశారు. గత ప్రభుత్వంలో 219 ఆలయాలను అపవిత్రం చేశారు. రథాలు తగలబెట్టారు. రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేశారు. దోషులను పట్టుకోలేకపోయారు. వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి. దాడులు జరుగుతున్నప్పుడు చూస్తూ కూర్చోవడం కూడా తప్పే. ధర్మాన్ని పాడు చేసే హక్కు ఎవరికి లేదు. పగ, ప్రతీకారం తీర్చుకునే ప్రభుత్వం కాదు మాది" అని పవన్ అన్నారు.


వరద బాధితుల సహాయార్థం రూ.కోటి చెక్‌ను సీఎం చంద్రబాబుకు అందజేసిన ఎంప్రడ మైన్స్ అండ్ మినరల్స్ సీఈఓ ఎ.ఎస్.విక్రమ్

డ్రోన్ సిటీగా అమరావతి

» వచ్చేనెల 22, 23వ తేదీల్లో జాతీయ డ్రోన్ సదస్సు

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సిటీగా అమరావతికి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర డ్రోన్ కార్పొరేషన్ ఎండీ దినేశ్ కుమార్ వెల్లడించారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. వచ్చే నెల 22, 23వ తేదీల్లో అమరావతిలో తొలిసారి జాతీయస్థాయి డ్రోన్ సదస్సు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. డ్రోన్ తయారీ సంస్థలు, వినియోగదారుల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. అత్యుత్తమ విధానాలను పరిగణనలోకి తీసుకుని డ్రోన్ పాలసీని తీసుకువస్తామని తెలిపారు. ఏపీని డ్రోన్ తయారీ కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

ఇంటింటికీ గ్యాస్ సరఫరా..

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని త్వరలోనే పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని దినేశ్‌కుమార్ చెప్పారు. ఇప్పటికే గ్యాస్ ఉత్పత్తి, సరఫరా కంపెనీలతో సంప్రదింపులు ప్రారంభించామని అన్నారు. గ్యాస్ సరఫరా అనుమతులు సరళీకృతం చేసేందుకు ఒక కొత్త పాలసీని తీసుకురానున్నామని చెప్పారు.

బాధ్యులు రక్తం కక్కుకుని చావాలి: భూమన

తిరుపతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'తిరుమల లడ్డూ కల్తీ జరిగుంటే బాధ్యులు రక్తం కక్కుకుని చావాలి. శ్రీవారిని అదే కోరుకుంటున్నా' అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీని, జగన్‌ను రాజకీయంగా కనుమరుగు చేయడానికి సీఎం చంద్రబాబు నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని, దానికోసం సాక్షాత్తూ శ్రీవారిని పావుగా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు ఆరోపణలపై ప్రధాని జోక్యం చేసుకోవాలని సీబీఐతో లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కల్తీకి పాల్పడినవారిని శిక్షించాలి: శరత్‌కుమార్

చెన్నై, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూను కల్తీ చేసిన వ్యవహారంలో బాధ్యులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని బీజేపీ నేత, సినీ నటుడు శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాల నిర్వహణను భక్తులకే అప్పగించాలి

» తిరుమల లడ్డూ వివాదంపై సద్గురు ఆగ్రహం

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదంలో గొడ్డు కొవ్వు కలవడం అసహ్యాన్ని మించిపోయిందని ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ ఆదివారం 'ఎక్స్' పోస్టులో ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే దేవాలయాల మేనేజ్‌మెంట్ల విషయంలో సమూల మార్పులు అవసరమని, భక్తులే గుడుల నిర్వహణను చూసుకొంటే భవిష్యత్తులో ఇటువంటి మహాపరాధాలు జరగకుండా చూసుకోవడం సాధ్యమని పేర్కొన్నారు.

నేడు కోర్టు ముందుకు విద్యాసాగర్



విజయవాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి జెత్వానీ కేసులో అరెస్టు చేసిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు ఆదివారం రాత్రి ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. విద్యాసాగర్‌ను సోమవారం ఉదయం చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరచనున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో సంతకాలు అయిన తర్వాత, విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యాసాగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు.

జగన్ కోటను తాకిన 'కల్తీ' సెగ

» 'శ్రీవారి లడ్డూ అపవిత్రం'పై ప్రజాగ్రహం

» తాడేపల్లి ప్యాలెస్, వైసీపీ కార్యాలయ ముట్టడి

» పాల్గొన్న బీజేపీ, హిందూ సంఘాలు

» జగన్ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నం.. దిష్టిబొమ్మ దహనం

» బీజేపీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు


జగన్ ఇంటి గేట్ ముందు ఆందోళన చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 22: దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో తయారు చేసిన నెయ్యిని వినియోగించడానికి మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగనే కారణమని ఆరోపిస్తూ బీజేపీ, హిందూ సంఘాలు ఆందోళన బాటపట్టాయి. ఇందులో భాగంగా ఆదివారం బీజేపీ నాయకులు తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌ను, వైసీపీ కార్యాలయాన్ని ముట్టడించారు. బీజేపీ, బీజేవైఎం నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా మెరుపు వేగంతో జగన్ నివాసాన్ని చేరుకుని ఆందోళనకు దిగడంతో అక్కడంతా గందరగోళ పరిస్థితి నెలకొంది. కొద్దిసేపు గోవింద నామస్మరణ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలియజేశారు. జగన్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకానొక సందర్భంలో జగన్ నివాసంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ప్యాలెస్ ముందు భారీ గేటు మూసివేసి ఉండడంతో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. జగన్ నివాసంలోకి కాషాయ రంగు బాల్స్, చెప్పులు విసిరారు. అనంతరం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జగన్ ఇంటి ముందున్న సెక్యూరిటీ కార్యాలయంపైకి రాళ్లు విసరడంతో కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. హిందువులకు వైఎస్ జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. మంగళగిరికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బీజేపీ నేతలను పరామర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వున్న కోట్లాది మంది హిందువులను జగన్ మానసిక క్షోభకు గురిచేశాడన్నారు. తిరుమల శ్రీవారి వద్ద జగన్ 108 ప్రదక్షిణలు చేసి, మోకాళ్లపై కూర్చొని లెంపలేసుకుని హిందువులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తిరుమల ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోని ప్రసాదాన్ని కూడా ఫుడ్ సేఫ్టీ కంట్రోల్‌కు పంపించి నివేదిక తెప్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బీజేపీ మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

భీమవరంటౌన్, విజయవాడ, సెప్టెంబరు 22: తిరుపతి లడ్డూ ప్రసాదంలో నెయ్యిని కల్తీ చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరుతూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ విషయంలో జగన్ రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని హిందూ ధర్మరక్షణ ఐక్యవేదిక నగర అధ్యక్షుడు సానా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

బెదిరింపా.. బ్లాక్‌మెయిలా?

» ప్రధానికి జగన్ లేఖపై సర్వత్రా విస్మయం

» శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యిపై దర్యాప్తు ప్రస్తావనేదీ?

» చంద్రబాబుపై దుష్ప్రచారమే లక్ష్యం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)





వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో అపవిత్ర నెయ్యి వినియోగించిన పరిణామం.. కోట్లాది శ్రీవారి భక్తుల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహావేశాలు చూశాక తన రాజకీయ భవిష్యత్‌పై మాజీ సీఎం వైఎస్ జగన్ గందరగోళంలో పడ్డారా.. దీనినెలా ఎదుర్కోవాలో అర్థంగాక అయోమయానికి గురయ్యారా..? అనే సందేహాలు రాజకీయ వర్గాల్లోనే కాదు.. సామాన్య ప్రజల్లోనూ వ్యక్తమవుతున్నాయి. గత శుక్రవారం (20న) ఎంపిక చేసుకుని పిలిపించుకున్న మీడియా ప్రతినిధుల ముందు ఈ వ్యవహారంపై విచారణకు డిమాండ్ చేసిన ఆయన.. ప్రధాని మోదీకి రాసిన లేఖలో ఆ ఊసే ఎత్తకపోవడం గమనార్హం. పైగా టీటీడీ బోర్డులో అత్యధిక సభ్యులు బీజేపీ వారేనని.. వారిని మోదీ ప్రభుత్వంలోని కేంద్ర మంత్రులే సిఫారసు చేశారని ప్రస్తావించడం.. బెదిరిస్తున్నట్లు అనిపిస్తోందని, ఈ ఘోరం వెనుక మీ వాళ్లు కూడా ఉన్నారని బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్లుగా ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. హైకోర్టు సిటింగ్ జడ్జితో గానీ.. కోర్టు నియమిత కమిటీ ద్వారా గానీ విచారణ జరపాలని జగన్ బాబాయి, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇప్పటికే హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశారు. జగన్ లేఖలో ఎంతసేపూ సీఎం చంద్రబాబును దూషించడం.. ఆయనపై చర్య తీసుకోవాలని కోరడమే తప్ప.. దీనిపై సీబీఐ వంటి కేంద్ర ఏజెన్సీలతో దర్యాప్తు జరిపించాలని గానీ, న్యాయ విచారణ చేయించాలని గానీ కోరకపోవడం విస్మయం కలిగిస్తోంది. తాను సీఎంగా ఉన్నప్పుడు పవిత్రమైన తిరుమలలో జరిగిన అపరాధంపై ఆత్మవిమర్శ చేసుకోకపోగా.. ఎదురుదాడికి దిగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగన్ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందంటూ నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)కు చెందిన కాఫ్ లేబొరేటరీ నుంచి వచ్చిన నివేదికను టీటీడీ ఈవో, టీడీపీ నేతలు కొద్దిరోజుల కింద విడుదల చేశారు. అంతకుముందు సీఎం చంద్రబాబు ఈ అంశాన్ని కూటమి పార్టీల సమావేశంలో ప్రస్తావించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తికోటి నివ్వెరపోయింది. ఇంత అపరాధం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పెద్దఎత్తున నిరసనలకు దిగింది. బిత్తరపోయిన జగన్ గత శుక్రవారం తాడేపల్లి ప్యాలెస్‌లో తన అనుకూల మీడియా ముందు మాట్లాడారు. చంద్రబాబు ఈ విషయం బయటపెట్టడం వల్లే తిరుమల ప్రతిష్ఠ దెబ్బతిందని.. ఇందుకు ఆయన్ను తిట్టాలని, అక్షింతలు వేయాలని ప్రధాని మోదీకి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తానని చెప్పారు. తర్వాత బెంగళూరు వెళ్లిపోయారు. ఈలోపు ప్రసాదానికి సంబంధించి మరిన్ని వాస్తవాలు వెలుగు చూడడం, జాతీయ స్థాయిలో తీవ్ర దుమారం రేగడంతో ప్రధానికి లేఖ రాశారు.

బీజేపీ వాళ్ల పాత్రా ఉందనా..?

మోదీకి రాసిన లేఖలో జగన్ ఎలాంటి విచారణలూ కోరలేదు. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు ఇందులో బీజేపీకీ భాగముందని హెచ్చరించినట్లుగా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కేంద్ర మంత్రులు సిఫారసుచేసిన బీజేపీ వాళ్లే టీటీడీ బోర్డులో అత్యధికంగా ఉన్నారని, నెయ్యి, ఇతర పదార్థాల కొనుగోలు ప్రక్రియను బోర్డు సభ్యులే పర్యవేక్షిస్తారని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉండదని జగన్ తన లేఖలో ప్రస్తావించారు. దీనర్థం.. ఈ కల్తీ నెయ్యిలో బీజేపీ పాత్ర కూడా ఉందని బ్లాక్‌మెయిలింగ్ చేయడమేనని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక ఈ ఏడాది జూలై 12న శాంపిల్స్ తీశారని.. 23నే ఎన్‌డీడీబీ నివేదిక వస్తే చంద్రబాబు ఇన్నాళ్లూ ఎందుకు బహిర్గతం చేయలేదని జగన్ లేఖలో ప్రశ్నించారు. అయితే ఆ నెయ్యి శాంపిల్స్ తీయించింది చంద్రబాబు ప్రభుత్వమే కదా! మరి తన హయాంలో లేబొరేటరీలో నెయ్యిని పరీక్షించారో లేదో జగన్ ఎందుకు చెప్పలేదు? పైగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని.. జనం కోపంతో ఉన్నారని.. దాని నుంచి దృష్టి మళ్లించడానికే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని చెప్పారు. అయితే ఆ కూటమిలో బీజేపీ భాగస్వామిగా ఉందని.. ప్రభుత్వంలోనూ భాగస్వామి అని తెలిసినా విమర్శలు చేశారు. దీనిని బీజేపీపై ఎదురుదాడిగా ప్రధాని పరిగణిస్తే జగన్ మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఇంకోవైపు.. వివాదం నుంచి ఎలా బయటపడాలో తెలియక ఆత్మరక్షణలో పడిపోయిట్లయిందని వైసీపీ ముఖ్య నేతలు కూడా అంటున్నారు. ఆయన తీరుతో తాము, పార్టీ శ్రేణులు కూడా ఇరుకునపడ్డామని.. ఇది మున్ముందు పార్టీనే ముంచేసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీటీడీ బోర్డులో బీజేపీ వాళ్లే ఎక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

బోర్డులో మెజారిటీ సభ్యులు బీజేపీకి చెందినవారేనని, వీరిని కేంద్ర మంత్రులే సిఫారసు చేశారని గుర్తుచేశారు. నెయ్యి, ఇతర సరుకుల కొనుగోలు ప్రక్రియను బోర్డు కూడా పర్యవేక్షిస్తుందని, సభ్యులకు దానిపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. తిరస్కరించిన నెయ్యిని లడ్డూ ప్రసాదానికి వినియోగించలేదని చెప్పారు. చంద్రబాబు చేసిన పనివల్ల లడ్డూ పవిత్రతపై సందేహాలు నెలకొన్నాయని, భక్తుల్లో మళ్లీ విశ్వాసాన్ని పెంచేలా ప్రధాని చూడాలని కోరారు. తిరుమల లడ్డూ అపవిత్రం వ్యవహారం తన మెడకు చుట్టుకోవడంతో జగన్ ప్రధాని మోదీకి ఆదివారం 8 పేజీల లేఖ రాశారు. అందులోని సారాంశం క్లుప్తంగా..

వాగ్దానాలు అమలు చేయలేక..

'తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు బాధ్యతారాహిత్యంతో మాట్లాడి శ్రీవేంకటేశ్వరస్వామి సమగ్రతను, ప్రతిష్ఠను దెబ్బతీశారు. 100 రోజుల చంద్రబాబు ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. దీనిని పక్కదోవ పట్టించేందుకే లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు ఉందంటూ ఉద్దేశపూర్వకంగా మాట్లాడారు. దీనివల్ల భక్తుల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ ఏడాది జూలై 12న తిరుమల దేవస్థానానికి వచ్చిన నెయ్యి శాంపిల్స్ నెగిటివ్ రావడంతో తిరస్కరించారు. తుది నివేదిక జూలై 23న వస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా చంద్రబాబు ఎందుకు బహిర్గతం చేశారు? తిరస్కరించిన నెయ్యిని లడ్డూ ప్రసాదంకోసం వాడలేదు. అయినా వాడినట్లు ఆయన అబద్ధాలు చెబుతున్నారు. నెయ్యి విషయంలో 'ఎన్‌డీడీబీ కాఫ్' నివేదికలో ఎస్-వాల్యూ తగ్గినట్లు పేర్కొంది. దీనికే జంతు కొవ్వు కలిసిందంటూ భక్తులను తెలుగుదేశం నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారు. 2015 నుంచి 2016 దాకా టీడీపీ ప్రభుత్వం కూడా నందిని నెయ్యిని వాడలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. లడ్డూపై చంద్రబాబు అబద్ధాలు మాట్లాడారు. ఈ అంశంపై మీ నిర్ణయంపై దేశమంతా ఎదురు చూస్తోంది. భక్తుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరింపజేయండి' అని జగన్ తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

తప్పు చేశాను.. ప్రాయశ్చిత్తం చేసుకుంటా

» ప్రొఫెసర్‌పై దాడిపై ఎమ్మెల్యే నానాజీ పశ్చాత్తాపం

» నేడు ఇంటి వద్ద ప్రాయశ్చిత దీక్ష చేస్తానని ప్రకటన

సర్పవరం జంక్షన్, కాకినాడ క్రైం, సెప్టెంబరు 22: కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ (ఆర్ఎంసీ) ప్రొఫెసర్‌పై దాడి ఘటనకు సంబంధించి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తప్పు చేశానని అంగీకరించారు. దానికి ప్రాయశ్చిత్తం కూడా చేసుకుంటానని ప్రజల ముందు చెప్పారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్‌లో ఆదివారం 'ఇది మంచి ప్రభుత్వం' వంద రోజుల కార్యక్రమం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ.. 'ప్రొఫెసర్‌పై దురుసు ప్రవర్తనకు నైతిక బాధ్యత వహిస్తున్నాను. ఒక ప్రజాప్రతినిధి ఎలా ఉండకూడదో నిన్నటి రోజున అలా ఉన్నాను. ఈ విషయంపై ప్రాయశ్చిత్తం చేసుకోవాలని నిర్ణయించుకున్నా. సోమవారమే ఆ పని చేస్తా. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తన నివాసం వద్ద ప్రాయశ్చిత దీక్ష చేస్తాను' అని ప్రకటించారు. 'రంగరాయ వైద్య కళాశాల వద్ద కొందరు వాలీబాల్ ఆట సమయంలో ఏదో గొడవ జరిగింది. దాన్ని సెటిల్ చేద్దామని ప్రిన్సిపాల్‌కి చెప్పే వెళ్లాను. అక్కడకు వెళ్లాక నన్ను ఎవరో ఏదో అన్నారని తెలిసి ఆవేశంతో తప్పుగా మాట్లాడాను. దానికి డాక్టర్ గారికి శనివారమే క్షమాపణ చెప్పాను. అయినా నా తప్పు తెలుసుకుని ప్రాయశ్చితం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను' అంటూ ఎమ్మెల్యే నానాజీ ప్రజల సమక్షంలో తెలిపారు.

కేసు నమోదు చేయాలని వైద్యసంఘాల డిమాండ్

రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ కె.ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే పంతం నానాజీ దురుసు ప్రవర్తనపై వైద్యసంఘాలు భగ్గుమంటున్నాయి. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఉన్నతాధికారుల తీరుతో కలత చెందిన వైద్యులు నిరసనే మార్గమని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) ఆధ్వర్యంలో వైద్య బృందాలు ఆందోళనకు సమాయత్తమవుతున్నాయి. తొలిదశలో భాగంగా సోమవారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరుకానున్నారు. దీనిపై సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి తుది కార్యాచరణను ప్రకటిస్తామని సంఘం నాయకులు తెలిపారు. దాడి చేసిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయకపోతే దశలవారీ ఆందోళన తప్పదని హెచ్చరించారు.

ఆ ఒక్కటీ అడక్కు!



(మొదటి పేజీ తరువాయి)

బదులివ్వలేక గుండెలు బాదుకుంటున్నారు. ఒకవైపు తనకు కీలక సమాచారం ఇవ్వాలని విజిలెన్స్‌ను కోరుతూనే, మరోవైపు అసలు ఆ సంస్థకు తనను ప్రశ్నించే అర్హతే లేదంటూ వితండవాదం చేస్తున్నారు. టీటీడీ వ్యవహారంలో విజిలెన్స్ విచారణకు చట్టబద్ధత లేదని, కాబట్టి తాను ఆ సంస్థ లేవనెత్తిన ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ఉద్దేశపూర్వకంగా, ఏకపక్షంగా తనను టార్గెట్ చేశారంటూనే భిన్నవాదనలు చేయడం న్యాయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. నెయ్యి కొనుగోళ్ల వ్యవహారం దేశమంతటా ప్రకంపనలు సృష్టిస్తుండటంతో తగిన సమాధానం చెప్పలేక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తాను ఒక్కడే ఏ నిర్ణయం తీసుకోలేదని, బోర్డులో చర్చించి సమష్టిగా తీర్మానాలు చేశామని ఆయన చెబుతూనే.. కీలక అధికారాలన్నీ టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)వేనంటూ మరో కొత్తవాదన తెరపైకి తీసుకొచ్చారు. ఇలా పరస్పర విరుద్ధమైన అంశాలపై వింతండవాదం చేస్తున్న ఆయన అసలు ఎలాంటి నెయ్యి కొన్నారు? అందులోని పదార్థాలపై మాత్రం నోరు విప్పడం లేదు. ఇందుకు కారణం విజిలెన్స్ విభాగం ఆయనకు సంధించిన ఈటెల్లాంటి ప్రశ్నలే. వాటికి బదులు ఇవ్వడం అంటే ఏమిటో వైవీకి తెలుసు. అందుకే విజిలెన్స్ చట్టబద్ధత గురించి దిగులు వ్యక్తం చేస్తున్నారు. టీటీడీలో నిధుల దుర్వినియోగం, నెయ్యి కొనుగోళ్లపై విజిలెన్స్ విభాగం విచారిస్తోంది. విజిలెన్స్ ఎస్పీ జూలై 2న, ఆగస్టు 12, 16, 17 తేదీల్లో పలు ప్రశ్నలకు బదులివ్వాలంటూ వైవీకి నోటీసులు ఇచ్చారు. ఆవునెయ్యి కొనుగోళ్లలోని లోగుట్టును కనిపెట్టేందుకు విజిలెన్స్ ఎస్పీ అనేకానేకప్రశ్నలు సంధిస్తూ వాటికి సమాధానాలు చెప్పాలని నోటీసులు ఇచ్చారు. ఆ నోటీసుల్లో ఉన్న ప్రశ్నలు వైవీకి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.

విజిలెన్స్ ప్రశ్నలు ఇవే

- ప్రతీ శాఖ రివర్స్ టెండరింగ్ పాటించాలని జగన్ సర్కారు 2019 ఆగస్టు 16న జీవో 67 జారీచేసింది. మల్టీ వెండర్ కాంట్రాక్ట్ (బహుళ విక్రయదారులు)కు రివర్స్ టెండరింగ్ ఎందుకు వర్తింపచేయలేదు?
- మల్టీ వెండర్ కాంట్రాక్టు విధానం 2011 సెప్టెంబరు 28న బోర్డు తీసుకున్న తీర్మానానికి (377) విరుద్ధం. అయినా ఆ విధానం ఎలా అమలు చేశారు? ప్రభుత్వ అనుమతి తీసుకున్నారా? బోర్డులో తీర్మానించే నిర్ణయం తీసుకున్నారా?
- టెండర్‌లో ఎల్1గా నిలిచిన బిడ్డర్ సమర్పించిన ధరలను బహిరంగ మార్కెట్‌లోని అగ్‌మార్క్, ఇండియా మార్ట్, బిగ్ బాస్కెట్, డీ-మార్ట్ ధరలతో పోల్చారు. ఇలా సరిపోల్చడానికి మీ దగ్గర ఉన్న ప్రామాణికత ఏమిటి? ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు, డాక్యుమెంట్‌లు, ఇందులో భాగస్వాములైన అధికారుల పేర్లు చెప్పండి.
- టీటీడీ బోర్డు తీర్మానానికి (377) విరుద్ధంగా ఎల్1 ఇచ్చిన ధరలకే ఎల్2తో 35 శాతం సరఫరా చేసేందుకు అనుమతించారు. ఆ సంప్రదింపులు ఏవో ఎల్1తో చేసుంటే ధర మరింత తగ్గేది కదా. జరిగిన తీవ్ర నష్టానికి మార్కెటింగ్ జీఎంను ఎందుకు బాధ్యులుగా చేయలేదు?
- టీటీడీ ఆవు నెయ్యిని 9:2 నిష్పత్తిలో కొనడానికి కారణం ఏమిటి? ఇందుకు బాధ్యులైన అధికారులు ఎవరు? (ఇందులో 9 శాతం కింద జాతీయ డెయిరీలు, 2 శాతం ఏపీ డెయిరీలు)
- టీటీడీ 1500 కిలోమీటర్ల దూరంలోని సంస్థల నుంచి నెయ్యి కొనుగోలు చేయవచ్చని పాలసీలో మార్పులు చేసింది. దీనికి ముందు ఆవు పాలు, నెయ్యి లభ్యత గురించి ఏమైనా అధ్యయనం చేయించారా? 1500 కి.మీ. దూరం పరిధిలో ఉన్న సంస్థల నుంచి నెయ్యి కొనుగోలు చేయడానికి, జాతీయ డెయిరీల నుంచే తీసుకోవడానికి ఉన్న హేతుబద్ధత ఏమిటి?
- టీటీడీ వద్ద తగిన నిధులు అందుబాటులో ఉన్నా గోడౌన్లు, కోల్డ్‌స్టోరేజీ పాయింట్లు ఎందుకు ఏర్పాటు చేసుకోలేదు?
- బ్లాక్‌లిస్టు చేసిన కంపెనీలు, వాటి పనితీరు ఇతర వివరాలు ఇవ్వండి.
- కాంట్రాక్టర్లు సరఫరా చేసే ఆహార పదార్థాలపై భద్రతా ప్రమాణాల పరీక్షల వివరాలు సమర్పించాయి. ఆ రిపోర్టుల వాస్తవికత, హేతుబద్ధత గురించి పునఃపరిశీలన చేయించారా?
- ఆవు నెయ్యి కొనుగోళ్ల ధరల్లో, విధానాల్లో చాలా తేడాలున్నాయి. జాతీయ టెండర్లతో పోలిస్తే ఏపీ ధరలు భారీగా ఉన్నప్పుడు నిపుణుల అభిప్రాయాలు ఎందుకు తీసుకోలేదు? ధరల మధ్య వ్యత్యాసం ఉన్నప్పుడు రీ టెండర్లు ఎందుకు నిర్వహించలేదు? రివర్స్ టెండరింగ్‌లో పరాగ్ మిల్క్‌ఫుడ్స్ పాల్గొనకపోయినా దానికే ఎందుకు టెండర్ కట్టబెట్టారు? రివర్స్ టెండరింగ్ పూర్తయిన 12 రోజుల తర్వాత పరాగ్ కంపెనీ సరఫరా చేసేందుకు ముందుకొస్తూ ఎందుకు మెయిల్ చేసింది? వైష్ణవి డెయిరీ, పరాగ్ మిల్క్ ఫుడ్స్ ఇచ్చిన పదార్థాలను సాంకేతికంగా తనిఖీలు చేశారా? ఆ వివరాలు ఇవ్వండి. పరాగ్ మిల్క్ ఫుడ్స్ కేవలం 25 శాతమే సరఫరా చేస్తానన్న దాన్ని ఏ ప్రాతిపదికన ఆమోదించారు? వైష్ణవి డెయిరీ 65% సరఫరా చేయాలి. కాని దాన్ని 75 శాతానికి ఎలా పెంచారు? సంబంధిత వివరాలు, డాక్యుమెంట్లు ఇవ్వండి.


మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

జగన్ మాదిగల ద్రోహి

» వైసీపీలో ఉన్న మాదిగలంతా బయటకు రావాలి

» చంద్రబాబు, మోదీ వల్లే వర్గీకరణ సాధ్యం.. వారికి రుణపడి ఉన్నాం

» మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మంద కృష్ణ మాదిగ

తెనాలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): "ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని నాకు తెలుసు. కానీ మనలో కొందరు వైసీపీని నమ్మి.. నన్ను అనుమానించారు. మనల్ని గొర్రెల్ని చేసిన జగన్ కసాయిగా మారి వర్గీకరణను చంపేశారు. వైసీపీలో ఉన్న మాదిగలంతా ఇప్పటికైనా కళ్లుతెరిచి ఆ పార్టీ నుంచి బయటకు రండి.." అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం శుభపరిణామమని, రాష్ట్రాల్లో దీన్ని అమలు చేసేలా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వర్గీకరణ ఫలాలు మన పిల్లలకు అందిన రోజే నిజమైన విజయోత్సవం జరుపుకోవాలన్నారు. తాను బలవంతులతో పోరాటం చేస్తున్నప్పుడు చంద్రబాబు సహకారం అందించారని చెప్పారు. సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ వల్లే వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. 'మాదిగల ప్రధాన శత్రువు జగనే. ఆయన మాదిగ ద్రోహి. వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలూ సహకరించాయి. వర్గీకరణ జరగనివ్వకుండా జగన్ అడ్డు తగిలారు. అటువంటి ద్రోహులను వదిలి.. మనకు మేలు చేసిన చంద్రబాబు వెంట నడవాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో వర్గీకరణ కచ్చితంగా అమలవుతుందని నమ్ముతున్నా. కానీ.. తెలంగాణ, కర్ణాటకలోనే అమలుపై అనుమానాలున్నాయి. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే చంద్రబాబును కలసి చర్చించాలనుకుంటే.. వరదలు వచ్చాయి. త్వరలోనే ఆయనను కలసి ఎస్సీ వర్గీకరణపై ఏ విధంగా ముందుకు వెళ్లాలనేది చర్చిస్తాం' అని మంద కృష్ణ పేర్కొన్నారు.

స్పెషల్ సీఎస్ ఓకే చేసినా మాకేంటి?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న కొందరు అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోతున్నా అది పెద్దగా మార్పు తీసుకురావడం లేదు. తాజాగా రెవెన్యూ శాఖలో ఆ ఉదంతం మరోసారి బయటకొచ్చింది. సాధారణంగా ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదులు, వాటిపై జరిగిన విచారణల నేపథ్యంలో పలువురు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు. కొందరిని సస్పెండ్ చేస్తుంటారు. విచారణ ముగిసిన తర్వాత కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకొని అధికారులపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తుంటారు. ప్రభుత్వ స్థాయిలో ముఖ్యకార్యదర్శులు లేదా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సంబంధిత ఫైలుపై సంతకం పెట్టిన తర్వాత సచివాలయంలోని సెక్షన్ అధికారులు 24 గంటల్లోగా ఉత్తర్వులు ఇవ్వాలి. అదీ కుదరకపోతే 48 గంటల్లోగా ఆదేశాలు ఇవ్వాలి. కానీ రెవెన్యూ శాఖలోని విజిలెన్స్ విభాగం (విజిలెన్స్ సెక్షన్-2) ఈ నిబంధనలను పాటించడం లేదు. ఇటీవలి కాలంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా పలువురు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై సస్పెన్షన్‌లను ఎత్తివేస్తూ ఫైళ్లపై సంతకాలు చేశారు. ఆ వెంటనే ఆ ఉత్తర్వులు (జీఓ)లను ఆయా సెక్షన్‌లు విడుదల చేసి, సంబంధిత అధికారులకు ఆన్‌లైన్‌లో కాపీలను పంపించాలి. కానీ విజిలెన్స్- 2 సెక్షన్‌లోని కొందరు అధికారులు సకాలంలో ఆ ఫైళ్లను సెటిల్ చేయడం లేదు. 20 రోజుల వరకు ఉత్తర్వులు పెండింగ్ పెడుతున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారు? ఇంత లెక్కలేని తనం వారికి ఎందుకొచ్చింది? ఇందులో ఉన్న కోణం ఏమిటో ఇటు ఉత్తర్వులు అందుకోవాల్సిన వారికి, ఆ ఉత్తర్వులు ఇవ్వాల్సిన సెక్షన్ అధికారులకే తెలుసు. రిజిస్ట్రేషన్ అధికారులపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇస్తే, వాటి ఆధారంగా వారు తదుపరి పోస్టింగ్ పొందగలరు. అయితే సచివాలయంలోని రెవెన్యూ విజిలెన్స్ విభాగం-2లోని కొందరు అధికారులు అలాంటి కీలక ఫైళ్లను పెండింగ్ పెడుతున్నారు. వీటిపై అనేక ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా ఆరా తీశారు. విజిలెన్స్ విభాగం-2 సెక్షన్ అధికారులను పిలిచి వారి వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించి నివ్వెరపోయినట్టు తెలిసింది. దాదాపు 20-30 రోజుల క్రితం సంతకం పెట్టిన ఫైళ్లపై ఉత్తర్వులు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టినట్లు గుర్తించారు. ఇది తీవ్రమైన తప్పిదంగా భావించిన ఆయన ఇద్దరు సెక్షన్ అధికారులు(ఎస్ఓ), మరో ఇద్దరు అసిస్టెంట్ సెక్షన్ అధికారుల (ఏఎస్ఓ)కు చార్జ్ మెమోలు జారీ చేశారు. కీలక ఫైళ్లపై వెంటనే ఉత్తర్వులు ఇవ్వకుండా రోజుల తరబడి ఎందుకు పెండింగ్‌లో పెట్టాల్సి వచ్చిందో స్పష్టమైన వివరణ ఇవ్వాలని మెమో ద్వారా ఆదేశించినట్లు తెలిసింది. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోతే సీసీఏ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని సిసోడియా హెచ్చరించినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.